30-01Pg1exHMNWJQE.qxd:30-01Pg1exHMNWJQE.qxd 01/01/01 9:40 AM Page 1

epaper.vaartha.com
: fb.com/vaartha
WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-1-2025 గురువారం
సంపుటి: 30 సంచిక: 362
పేజీలు: 12 వెల: 6.50
ఒంగోలు,



బుధవారం ప్రయాగరాజ్‌లో చెల్లాచెదురుగా పడిన బాధితులను మోసుకువస్తున్న సహాయక సిబ్బంది

# 'కుంభ్' విషాదం



బాధితులను మోసుకువస్తున్న సహాయక సిబ్బంది

## తొక్కిసలాటకు 30 మంది బలి

- మరో 90 మందికి తీవ్రగాయాలు
- మౌని అమావాస్య సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చిన కోట్ల మంది
- ఘాట్‌లవద్ద బారికేడ్లను తన్నుకుంటూ ముందుకు ఉరికిన భక్తులు
- తొక్కిసలాట స్థలంవద్ద చెల్లాచెదురైన బ్యాగ్‌లు, వస్తువులు, దుస్తులు
- ఊపిరందక పడిపోవడంతో పెరుగుతున్న మృతులు
- ప్రధాని దిగ్భ్రాంతి, బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ప్రకటించిన యుపి సిఎం ఆదిత్యనాథ్

**మహాకుంభ్‌నగర్, (యుపి), జనవరి 29:** ప్రపంచ వ్యాప్తంగా తరలివచ్చి పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న ఈ మహాకుంభ్‌మేళాలో ఘోరం జరిగిపోయింది. మౌని అమావాస్య సందర్భంగా త్రివేణి సంగమంలోనే పవిత్రస్నానంచేయాలని కోట్లాదిమంది భక్తుల మధ్య జరిగిన తొక్కిసలాట 30మంది ప్రాణాలను బలిగొంది. తొక్కిసలాట జరగకుండా అక్కడ ఏర్పాటుచేసిన బారికేడ్లను దాటుకుని తోసుకుని వచ్చిన భక్తులకు అప్పటికే ఘాట్‌లవద్ద ఉన్న భక్తులపై తాకిడిపెరగడంతో 30మందికిపైగా చనిపోయారు. మరో 90 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పుణ్యస్నానాలకు ఎటువెళ్లాలో కూడా తెలియక కొందరుభక్తుల్లో అయోయమయం నెలకొంది. దీనితో ఎక్కువమంది ఎక్కడ ఉంటే అటువైపే యాత్రీకులంతా అక్కడకు చేరుకున్నారు. తొక్కిసలాటతర్వాత సంఘటన స్థలంలో బ్యాగ్‌ల >>2




శ్రీహరికోట నుంచి బుధవారం ఉదయం ప్రయోగించిన 100వ రాకెట్ జిఎస్ఎల్‌వి-ఎఫ్15

## ఉషోదయాన నింగిలోకి జిఎస్ఎల్‌వి-ఎఫ్15

## కక్ష్యలోకి ప్రవేశించిన ఎన్‌విఎస్-02 ఉపగ్రహం

## శాస్త్రవేత్తలను అభినందించిన రాష్ట్రపతి, ప్రధాని, రాష్ట్రాల సిఎంలు, మంత్రులు

### శత ప్రయోగ విజయంతో షార్‌లో అంబరాన్నంటిన సంబరాలు

**పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి /శ్రీహరికోట**

అంతరిక్ష పరిశోధనలో మరోచరిత్ర లిఖితమయింది. బుధవారం ఉదయం 6.23 గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి జిఎస్ఎల్‌వి-ఎఫ్15 రాకెట్ విజయవంతంగా రోదశిలోకి దూసుకెళ్లింది. ఇది శ్రీహరికోట నుంచి ప్రయోగించిన 100వ రాకెట్. కేవలం 19 నిమిషాల 10 సెకన్లకు మూడు దశల రాకెట్ వడివడిగా అంతరిక్ష కక్ష్యకు చేరుకుంది. భారతీయ నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్-02ను కక్ష్యలో విడిచిపెట్టింది. ఇస్రో ఛైర్మన్‌గా ఈ ఏడాది ప్రారంభంలోనే బాధ్యతలు చేపట్టిన వి.నారాయణన్‌కు వచ్చీరాగానే ఘనవిజయం దక్కింది. రాకెట్ ప్రయోగం >>2



## డిజిపిగా హరీష్ కుమార్ గుప్తా

**విజయవాడ, జనవరి29,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిజిపిగా హరీష్‌కుమార్‌గుప్తా నియమితులయాలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేసారు. ఈనెల 31న ప్రస్తుత >>2


# నేటినుంచి వాట్సప్ గవర్నెన్స్

### మొదటి దఫాలో పౌరులకోసం 161 సేవలు

### విద్యుత్ బిల్లులు, ఆస్తిపన్నుల చెల్లింపు

### సౌకర్యాల అమలును సమీక్షించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌరసేవలు అందించేందుకు ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రారంభిస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. జనవరి 30 నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రభుత్వం నేటి నుంచి అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో సిఎం సమీక్షించారు. మొదటి విడతగా పౌరులకు 161 సేవలను ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. వాట్సాప్ ద్వారా సేవలను పొందాలనుకునే వారు ఏ విధంగా ఆప్షన్‌లను ఎంచుకుంటారనే దానిపై సిఎంకు అధికారులు వివరించారు. రెండవ విడతలో మరిన్ని సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుంది. మొదటి విడతలో భాగంగా దేవాదాయ, ఎనర్జీ, ఏపీఎస్ ఆర్టీసీ, రెవెన్యూ, అన్నక్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ వంటి వివిధ శాఖల్లో సుమారు 161 సేవలను ప్రవేశపెట్టనుంది. దేశంలోనే మొదటి సారి వాట్సాప్ గవర్నెన్స్ >>2



## ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూలు విడుదల

### ఫిబ్రవరి 27న పోలింగ్

**విజయవాడ,జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3న లెక్కింపు జరగనుంది. ఫిబ్రవరి 27నఉదయం 8 నుంచి >>2



30-01pg2exHMNWJQEP.qxd:30-01pg2exHMNWJQEP.qxd 01/01/01 9:36 AM Page 1





బుధవారం ఢిల్లీలోని కర్తార్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని మోడీ

# 100వ ప్రయోగం సక్సెస్

>> విజయవంతమైన తర్వాత శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్‌లో కొందరు నారాయణన్‌ను కౌగిలింతలు, కరచలనాలతో అభినందించారు. ఉబ్బితబ్బిబ్బయిన ఛైర్మన్ అక్కడి నుంచే మాట్లాడారు.

**నావిగేషన్ సేవలకు మరింత ఊపు**

శ్రీహరికోట నుంచి బుధవారం అంతరిక్ష కక్ష్యకు చేరిన ఎన్‌విఎస్-02 ఉపగ్రహం భారత స్వదేశీ నావిగేషన్ వ్యవస్థకు ఉపయోగపడనుంది. భూ, జల, వాయు మార్గాలలో వాహన చోదకులకు దిక్సూచిగా ఈ నావిక్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగిస్తోంది. ప్రస్తుతానికి ఇటువంటి ఉపగ్రహాలు అంతరిక్షంలో పనిచేస్తున్నాయి. ఎన్‌విఎస్-02 కూడా ఈ జాబితాలో చేరనుంది. ఈ ఉపగ్రహం నావిక్ రెండోతరం ఉపగ్రహం. 2250 కిలోల బరువు ఉన్న ఇది పదేళ్ల పాటు దేశానికి సేవలు అందించనుంది. ఎన్‌విఎస్-02 ఉపగ్రహాన్ని బెంగళూరులోని యుఆర్ రావు శాటిలైట్ సెంటర్లో రూపొందించి షార్‌కు తీసుకొచ్చి ప్రయోగించారు.

**ఖచ్చిమైన కక్ష్యలోకి ఉపగ్రహం : వి.నారాయణన్**

బుధవారం ఉదయం ఇస్రో మరచిపోలేని రోజుగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ పేర్కొన్నారు. 100వ రాకెట్ ప్రయోగాన్ని ఇంత విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. ఖచ్చితమైన కక్ష్యలో ఈ ఉపగ్రహం ప్రవేశించిందని ఆయన చెప్పారు. ఇస్రో 1979లో సతీష్‌ధవన్ ఛైర్మన్‌గా ఎపిజె అబ్దుల్ కలామ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా తొలి ఎస్‌ఎల్‌విని ఇదే శ్రీహరికోట నుంచి ప్రయోగించామని గుర్తు చేశారు. మళ్లీ 2025 జనవరి 29న 100వ రాకెట్ జిఎస్‌ఎల్‌వి-ఎఫ్15ను తాను ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ప్రయోగించడం మరచిపోలేనిదన్నారు. ఈ ప్రయోగ వీక్షణకు నలుగురు ఇస్రో మాజీ ఛైర్మన్లు సోమనాథ్, శివన్, కిరణ్‌కుమార్, రాధాకృష్ణన్ హాజరు కావడం తనకు మరింత సంతోషాన్ని ఇచ్చిందన్నారు. స్మార్ట్ ఆర్బిటర్ మిషన్, ఆదిత్య-ఎల్1, ఎస్‌ఆర్‌ఇ, ఒకేరాకెట్‌తో 104 ఉపగ్రహాలు ప్రయోగించడం ఇస్రో సాధించిన ఘన విజయాలని ఆయన పేర్కొన్నారు. త్వరలో శ్రీహరికోట నుంచి గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ పరిశోధనలు, కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. వీనస్‌తో పాటు చంద్రయాన్-4 ప్రయోగాలు చేపడతామన్నారు.

**శాస్త్రవేత్తలకు జేజేలు**

ఇస్రో శాస్త్రవేత్తలకు బుధవారం దేశంలోని ప్రముఖులు, ప్రజలు కూడా జేజేలు పలికారు. 100వ ప్రయోగాన్ని విజయవంతం చేయడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోడీ, పలువురు కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభినందించారు. 100 సంఖ్యకు చేరుకోవడానికి ప్రధాన భూమిక పోషించిన శ్రీహరికోటలోని శాస్త్రవేత్తలు కూడా సంబరాలు జరుపుకున్నారు. ఒకేచోటు నుంచి కేవలం రెండు ప్రయోగ వేదికల ద్వారా గత 46 ఏళ్లలో 100 రాకెట్లు ప్రయోగించడంతో శ్రీహరికోట పేరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా మార్మోగింది. మంచును సైతం లెక్కచేయకుండా బుధవారం తెల్లవారుజాము నుంచే వీక్షకుల గ్యాలరీలో సందర్శకులు సందడి చేశారు. పలు పాఠశాలల పిల్లలు జాతీయ జెండాలు చేతబట్టి 100వ రాకెట్ ప్రయోగాన్ని వీక్షించి విజయం సాధించిన తర్వాత కేరింతలు కొట్టారు.

## డిజిపిగా హరీష్ కుమార్ గుప్తా

>> డిజిపి సీహెచ్ ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ చేయను న్నారు. ఈ నేపథ్యంలో హరీష్‌కుమార్ గుప్తాను తదుపరి డిజిపిగా నియమించారు. 1192లో బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో హరీష్ గుప్తాను ఎన్నికల సంఘం డిజిపిగా నియమించింది. దీంతో కొన్ని రోజుల పాటు ఆయన ఆ పోస్టులో కొనసాగారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వచ్చాక సీహెచ్ తిరుమలరావును డిజిపిగా ఈ నియమించింది. ఈ నెల31 ఆయన పదవి కాలం ముగుస్తుంది. 1992 బ్యాచ్ ఆంధ్ర కేడర్ ఐపీఎస్ అధికారి అయిన హరీష్ కుమార్ గుప్తా.. పలు జిల్లాలకు ఎస్పీగా పని చేశారు.

# నేటినుంచి వాట్సప్ గవర్నెన్స్

>> విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్నామని, ధృవపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి ఇక స్వస్తి పలకనున్నామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. అదేవిధంగా పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయాలని సూచించారు. వాట్సాప్ ద్వారా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 22న మెటాతో ఒప్పందం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌ను డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న తరుణంలో పాలన, ప్రభుత్వ సేవలను పౌరులకు వేగవంతంగా అందజేయడానికి ఈ విధానం సులభతరం కానుంది. ఈ రేపు వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ అధికారికంగా ప్రారంభించనున్నారు. వాట్సాప్ ద్వారా కేంద్ర పథకాలు రాష్ట్రానికి ఏ విధంగా ఉపయోగపడతాయో అధ్యయనం చేసి రాష్ట్రంలోని సంబంధిత శాఖా మంత్రులకు తెలపాలని ఎంపీలకు సూచించామని చంద్రబాబు తెలిపారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం లభించేలా చూడాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇక రాజధాని అమరావతిని హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలతో అనుసంధానిస్తూ బుల్లెట్ రైలు ప్రాజెక్టుకి ఈ ఐదేళ్లలో కచ్చితంగా శంకుస్థాపన చేసేలా ఎంపీలు కృషి చేయాలని తాము వారికి సూచించామన్నారు. రాష్ట్రానికి కొత్త రోడ్లు వచ్చేలా చొరవ తీసుకోవాలని సీఎం సూచించారు. జిల్లా ఇంఛార్జ్ మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఎస్పీలు ఒక బృందంగా సమన్వయంతో పనిచేయాలన్నారు.. ఉపాధి హామీ పనులకు అనుమతులు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించాలని తెలిపారు. రైల్వే ప్రాజెక్టులపై ఎంపీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించినట్లు వెల్లడించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించేలా కొత్త ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సిఎం సూచించారు. ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలంటే ఈ వాట్సప్ ఖాతా ద్వారా సమావేశం పంపిస్తుంది. ఉదాహరణకు భారీవర్షాలు వరదల కారణంగా రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నాం, మీ ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఫలానా సమయంలో విద్యుత్తు సరఫరా ఉండదు, వైరస్‌లు వ్యాప్తిలో ఉన్నందున ఈ జాగ్రత్తలు తీసుకోండి, మీ ప్రాంతంలో పిడుగులు పడే అవకాశముంది. అప్రమత్తంగా ఉండండి, 5 మీ ప్రాంతంలో ఈ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి లాంటి సమాచారాన్ని ఒకేసారి కోట్లమందికి చేరవేస్తారు. ప్రజలు తమ వినతులు ఫిర్యాదులు ఏవైనా ఇవ్వాలనుకుంటే ఈ నంబరుకు మెసేజ్ చేస్తే వెంటనే వారికి ఒక లింక్ వస్తుంది. అందులో సంబంధిత వ్యక్తి పేరు ఫోన్ నంబరు, చిరునామా పొందుపరిచి, వినతిని టైప్ చేస్తే సరిపోతుంది. వెంటనే వారికి ఒక రిఫరెన్స్ నంబరు వస్తుంది. దాని ఆధారంగా తాము ఇచ్చిన వినతి పరిష్కారం ఎంతవరకూ వచ్చింది? ఎవరివద్ద ఉందనేది తెలుసుకోవచ్చు. తమ పరిధిలో మురుగు కాలవల లీకేజీలు, రోడ్లు గుంతలు వంటివి ఫోటోలు తీసి పెట్టొచ్చు. వాతావరణ కాలుష్యంపైనా ఫిర్యాదులు చేయొచ్చు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అభివృద్ధి కార్యక్రమాలకు అర్హతలు పథకాల లబ్ధి గురించి ఈ వాట్సప్ నంబరుకు మెసేజ్ చేసి తెలుసుకోవచ్చు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సప్‌లో పంపిస్తారు. అందులో నుంచి మీకు కావాల్సిన ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని, అక్కడే టికెట్లు, వసతి సహా అన్ని బుక్ చేసుకోగలరు. విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్నులు ఈ అధికారిక వాట్సప్ ద్వారా చెల్లించొచ్చు. ట్రేడ్ లైసెన్సులు పొందొచ్చు. దేవాలయాల్లో దర్శనాల స్లాట్ బుకింగ్ వసతి బుకింగ్, విరాళాలు పంపడం వంటివి చేయొచ్చు. రెవెన్యూ శాఖకు సంబంధించి ల్యాండ్ రికార్డుల యాక్సెస్ వివిధ సర్టిఫికెట్లుపొందొచ్చు. ఈసమీక్షలో సీఎస్ కె.విజయానంద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొన్న ఎపి ఏటి కొప్పాక బొమ్మల శకటం

# ఢిల్లీ వేడుకల్లో రాష్ట్ర శకటానికి కేంద్ర ప్రభుత్వ జ్యూరీ అవార్డు

**విజయవాడ.జనవరి29.ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవం పెరేడ్‌లో భాగంగా ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ అవార్డు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని చేతి వృత్తుల కళా ప్రాముఖ్యత చాటుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వారసత్వ సంప్రదాయానికి ప్రతీకగా ఉన్న ఏటి కొప్పాక బొమ్మలతో రూపొందించి, ప్రదర్శించిన శకటం రిపబ్లిక్ డే పెరేడ్ ఉత్సవానికే హైలెట్‌గా నిలిచి యావత్ దేశ ప్రజలందరి దృష్టిని ఆకర్షించింది. సామాజిక మాధ్యమలలో సైతం లక్షలాది మంది ఈ శకటానికి మంత్రముగ్ధులై, ప్రశంసలతో ముంచెత్తారు. రాష్ట్రంలో చేతివృత్తులు, హస్తకళలకు జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం తీసుకురావాలనే ఉద్దేశంతో సిఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ ఈ శకటాన్ని రూపొందించింది. శకటంముందు వినాయకుడు, చివర కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి ఎత్తైన రూపాలతో, ఇరువైపులా బొబ్బిలివీణలు, తెలుగువారి కట్టుబొట్టుప్రతిబింబించేలా అమర్చిన ఏటికొప్పాక బొమ్మల కొలువుతో శకటం ఆధ్యంతం ఆకట్టుకుంది. శకటం నడుస్తున్నంత సేపు ఏటి కొప్పాక బొమ్మల ప్రాశస్త్యాన్ని చాటుతూ బొమ్మలు బొమ్మలు ఏటికొప్పాక బొమ్మలు, ఆంధ్ర ప్రదేశ్ బొమ్మలు, ఇవి విద్యను నేర్పే బొమ్మలు, వినోదాల బొమ్మలు, భక్తి చాటే బొమ్మలు, హస్తకళల హంగులు, సహజ ప్రకృతి రంగులు అంటూ సాగే గీతంతో ప్రజలందరి హృదయాలను దోచుకుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు సైతం ఈ శకటం మనోహరమైన రూపాన్ని చూసి పులకించిపోయారు. అలాగే నెటిజన్లు సైతం ఏపీ ప్రదర్శించిన ఏటి కొప్పాక బొమ్మల శకటాన్ని పెద్ద ఎత్తున సామాజిక మధ్యమాల్లో షేర్ చేసుకున్నారు. చాలా మంది నెటిజన్లు తమ సామాజిక మధ్యమ సాధానల్లో తమ డిపిలుగా కూడా ఈ శకటాన్ని ప్రదర్శించారు.

**30 సంవత్సరాల తర్వాత తొలిసారి జూరీ అవార్డు..**

దేశ రాజధానిలో జరిగే గణతంత్ర దినోత్సవాలలో ప్రదర్శించే శకటాలకు సంబంధించి 30 సంవత్సరాల సంవత్సరాల తర్వాత తొలిసారిగా ఆంధ్ర ప్రదేశ్ శకటానికి కేంద్ర ప్రభుత్వ జూరీ పురస్కారం లభించింది. ఏటికొప్పాక బొమ్మల శకటానికి కేంద్రప్రభుత్వం జ్యూరీ తృతీయ బహుమతి ప్రకటించింది.

**సిఎం, డిప్యూటీ సిఎం ప్రశంసలు..**

ఏటికొప్పా శకటానికి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లు సైతం ప్రశంసించారు. దశాబ్దాల తర్వాత రాష్ట్ర శకటానికి కేంద్ర ప్రభుత్వ పురస్కారం లభించడం పట్ల సర్వత్ర హర్షాతిరేకాలు వ్యాక్తమౌతున్నాయి. ఏటి కొప్పాక బొమ్మలకు జియో ట్యాగింగ్ చేసి, ఈ బొమ్మలను అంతర్జాతీయంగా కూడా ప్రసిద్దిని పొందేలా రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

## ఆర్టీసీ ఎండిగా సిహెచ్ ద్వారకా తిరుమలరావు కొనసాగింపు

**విజయవాడ,జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్టీసీ ఎండీ సీనియర్ ఐపిఎస్ అధికారి సిహెచ్ తిరుమలరావును ప్రభుత్వం ఒప్పంద ప్రాతిపాదికన కొనసాగించాలని నిర్ణయించింది. ఆర్టీసీ ఎండిగా బాధ్యతలను నిర్వహిస్తున్న ద్వారకా తిరుమలరావును చంద్రబాబు ప్రభుత్వం డిజిపిగా నియమించింది. దాంతో ఆర్టీసీ ఎండీగా అదనపు బాధ్యతలపై నిర్వహించారు. ఆయన ఉద్యోగ విరమణ వయస్సు రావడంతో ఈ నెల31న రిటైర్ అవుతారు. అయినప్పటికి ఆయన ఒప్పంద పదతిన ఆర్టీసీ ఎండిగా కొనసాగుతారు. ఆ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులుజారీ చేసింది.

# ‘కుంభ్’ విషాదం

>> కుప్పలు, చెల్లాచెదురుగాపడిన భక్తుల దుస్తులు, పాదరక్షలు దర్శనమిచ్చాయి. మౌని అమావాస్యరోజు పుణ్యస్నానం తెల్లవారుఝామునే చేస్తే పాపాలన్నీ హరించుకుపోతాయన్న భక్తుల ప్రగాఢ విశ్వాసమే అందుకు దారితీసింది. కోట్లాదిమందిభక్తులు ఇదేరోజు పవిత్రస్నానంకోసం వస్తే బారికేడ్లు కూడాధ్వంసం అయ్యాయి. దీనితోభక్తులు ఒకరివెంట ఒకరు పరుగులుతీసారు. రద్దీగా ఉండటంతో భక్తులు ఒకరిపై ఒకరు పడిపోవడం, ఒకరినొకరు తోసుకోవడంతో ఈదుర్ఘటన జరిగింది. మంగళ, బుధవారాల్లోనే రోజుకు ఆరుకోట్లమందికి తగ్గకుండా భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారని యుపి ప్రభుత్వం ప్రకటించింది. ఇదంతా త్రివేణి సంగమం ప్రధాన ఘాటవద్దనే స్నానంచేయాలన్న ప్రగాఢ విశ్వాసమే ఈ ఘోరవిపత్తుకు దారితీసిందని అధికారులుసైతం చెపుతున్నారు. తొక్కిసలాటలో ఊపిరాడక పోవడంవల్లనే అనేకమంది కిందపడిపోయారని, వీరిపైనుంచి భక్తులు వెళ్లిపోవడంతో ఈ విపత్తు సంభవించినట్లు అధికారులు వెల్లడించారు.

**తొక్కిసలాటలో 30 మంది మృతి, 90 మందికి గాయాలు : ప్రయాగరాజ్ డిఐజి వైభవ్‌కృష్ణ**

ప్రయాగరాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని, మరో 90 మందికి తీవ్ర గాయాలయినట్లు మహాకుంభ్ డిఐజి వైభవ్‌కృష్ణ తెలిపారు. అర్థరాత్రి దాటిన తర్వాత తెల్లవారకుండానే త్రివేణి సంగమంలో స్నానంచేయాలన్న ఆతృతతో భక్తులు తోసుకువచ్చారని, తోపులాట తొక్కిసలాటగా మారిందని సుమారు 90 మందికిపైగా గాయపడ్డారని డిఐజి చెప్పారు. బుధవారం కుంభమేళాలోకి విఐపిలు ఎవ్వరినీ అనుమతించడంలేదని తెలిపారు. ప్రస్తుతం సాధారణపరిస్థితి ఉందని, ఇతర వివరాలకోం 1920 హెల్ప్‌లైన్ నంబర ఏర్పాటుచేసామన్నారు. ఈ ఘోర దుర్ఘటనతో అఖాడాలు మొత్తం తమ అమృతస్నాన్ కార్యక్రమాన్ని వాయిదావేసారు.

**రూ.25 లక్షలుచొప్పన పరిహారం**

కుంభమేళా తొక్కిసలాటలో మృతులకు యుపి ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలచొప్పున పరిహారం ఇస్తుంన్నట్లు సిఎం యోగి ఆదిత్యానాథ్ తెలిపారు. జ్యుడిషియల్ కమిషన్‌వేసి నిర్ణీత వ్యవధిలో ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని తెలిపారు. కాగా మృతుల్లో నలుగురు కర్ణాటకలోని బెళగావికి చెందినవారని గుర్తించారు. ఇద్దరు తల్లీకూతుళ్లుకాగా, మరో ఇద్దరు శెట్టి గల్లి, శివాజీనగర్‌కు చెందినవారనినిర్ధారించారు. మృతదేహాలు తెచ్చేందుకు సీనియర్ అధికారుల బృందాన్ని



మహాకుంభ్‌లో తొక్కిసలాట ప్రదేశంవద్ద చేతులుజోడించి వేడుకుంటున్న ఓ తల్లి

పంపించామని బెళగావి ఎమ్మెల్యే ఆసిఫ్ సియాత్ వెల్లడించారు. బాధిత కుటుంబాలకు రూ.2 లక్షలచొప్పున కర్ణాటక ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. బెళగావినుంచి సుమారు 300 మందికిపైగా కుంభమేళాకు వెళ్లినట్లు అధికారులు చెపుతున్నారు. ఘాట్‌లలో ఉన్న భక్తులందరూ వెంటనే అక్కడినుంచి ఖాళీచేయాలని మైకుల్లోప్రకటించారు. అధికారులు కూడా దగ్గరుండి వారిని వెనక్కిరప్పిస్తున్నారు. ఈ రెండురోజుల్లోనే సుమారు పదికోట్లకుపైగా భక్తులు స్నానమాచరించారని అదికారులు అంచనావేసారు.

**ప్రధానిమోడీ సంతాపం**

ప్రయాగరాజ్‌లో జరిగిన ఘోరసంఘటనపై ప్రధానిమోడీ విచారం వ్యక్తంచేసారు. అంతేకాకుండా వెంటనే సీఎం యోగితో ఫోన్‌లోసంభాషించారు. ప్రతి గంటకు ప్రధాని పరిస్థితిని సమీక్షిస్తూ ఉన్నారనియుపి ప్రభుత్వం వెల్లడించింది. ఉదయంనుంచి మూడుసార్లుసీఎంతో మాట్లాడారని, పరిస్థితి సాధారణస్థితికి వచ్చేంతవరకూ యుపి అధికారులతోమోడీ మాట్లాడుతూనే ఉన్నారని యుపి యంత్రాంగంప్రకటించింది.

## ఫిబ్రవరి 2న ఢిల్లీ ప్రచారానికి సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీ అసెంబ్లీకి సార్వత్రిక ఎన్నికల వేళ సిఎం చంద్రబాబుకు బిజెపి కీలక బాధ్యతలు అప్పగించింది. బిజెపి అభ్యర్థుల తరపున సిఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 2వ తేదీన న్యూఢిల్లీలో తెలుగు వారు అత్యధికంగా నివసించే ప్రాంతాల్లో బిజెపి అభ్యర్థులను మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఎన్నికల ప్రచారానికి రావాల్సిందిగా ఢిల్లీలోని తెలుగు అసోసియేషన్ సైతం చంద్రబాబును ఆహ్వానించింది.

# షెడ్యూలు విడుదల

>> సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుంది. నామి నేషన్ల దాఖలుకు ఫిబ్రవరి 10 వరకు గడువు ఉంటుంది. అలాగే ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన చేస్తారు. నామినేషన్ల ఉపసంహారణకు ఫిబ్రవరి 13 వరకు గడువు పెట్టారు. రెండు పట్టభద్రుల, ఒక ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికలు జరగనుంది. ఉభయగోదావరి పట్టభద్రుల నియోజకవర్గం. అలాగే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నిక జరగనుంది. అదేవిధంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నిక నిర్వహించనున్నారు. ఎన్నికలు జరిగే జిల్లాల్లో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కానుంది.

# ఫిబ్రవరిలో రాష్ట్ర బడ్జెట్

**విజయవాడ జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఫిబ్రవరిలోనే అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర బడ్జెట్‌ను సాధారణంగా ప్రతి ఏటా మార్చి నెలలో సమర్పిస్తారు. కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్ ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్‌ను ఎందుకు ఆలస్యం చేయడం అన్న చర్చ ప్రభుత్వంలోవచ్చింది. ఫిబ్రవరి మూడు లేదా నాలుగు వారంలో బడ్జెట్ సమర్పించి, ఏప్రిల్ ప్రారంభం నుంచే పూర్తిస్థాయిలో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకునేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. బడ్జెట్ రూపకల్పన తదితర అంశాలపై రాష్ట్ర ఆర్థికశాఖ ఉన్నతాధికారి సమీక్షించారు. అన్ని ప్రభుత్వ శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు ఇప్పటికే ఆర్థికశాఖకు చేరాయి. త్వరలో ఈ ప్రతిపాదనలపై తొలిదశ చర్చలు జరగనున్నాయి. ఫిబ్రవరి 3 లేదా 4వ వారంలో బడ్జెట్ సమర్పించి ఏప్రిల్ నుంచే ఆర్థిక కార్యకలాపాలు పూర్తి స్థాయిలో నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు!

**విజయవాడ, జనవరి29, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ప్రభుత్వం ఉగాది పండుగ నాటికి మహిళలకు తీపికబురు చెప్పేందుకు సిద్ధమవుతుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుకు శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై పలు రాష్ట్రాల్లో పర్యటించి వివరాలు సేకరించిన కేబినెట్ సబ్ కమిటీ.. ఆ నివేదికను ప్రభుత్వానికి అందజేసి నట్లు తెలిసింది. వచ్చేనెల 6న జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి విధివిధానాలు ప్రక టించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలును ఉగాది నుంచే ప్రారంభించాలనే నిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు పలు రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకం అమలవుతున్న తీరును, అక్కడి విధానాలను అధ్యయనం చేశారు. ఆయా రాష్ట్రాల్లో ఈ పథకంకోసం అవుతున్న ఖర్చు, బస్సుల సంఖ్య, ఉద్యోగుల నియామకం వంటి అంశాలపై సమగ్ర నివేదికను తయారు చేశారు. ఎపిలో ఉచిత బస్సు పథకాన్ని అమలుచేస్తే సంస్థపై ఏటా రూ.2,500 కోట్ల వరకు భారం పడుతుందని అధికారులు అంచనా వేశారు. మరోవైపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయగా..కేబినెట్ సబ్ కమిటీ ఉచిత బస్సు పథకం అమలవుతున్న రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసింది. ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ పేరిట మహిళలకు పలు వరాలు ప్రకటించారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తే ఆటో, క్యాబ్ వంటి వారికి జరిగే నష్టాలను, అందుకోసం ఆయా రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలపైనా అక్కడి అధికారులను కేబినెట్ సబ్ కమిటీ అడిగి తెలుసుకుంది. అన్ని రాష్ట్రాల్లో సమగ్ర అధ్యయనం చేసిన మంత్రులు ప్రభుత్వానికి ఉచితబస్సు పథకంపై నివేదికను అందజేసినట్లు తెలిసింది. ఆర్టీసీ ఉన్నతాధికారుల నివేదిక, కేబినెట్ సబ్ కమిటీ నివేదికలపై మంత్రి మండలి సమావేశంలో చర్చించనున్నారు. ఆ తరువాత పథకం అమలుకు విధివిధానాలు రూపొందించి ప్రకటించనున్నట్లు సమాచారం.

## కుంభమేళాలో తొక్కిసలాట దురదృష్టకరం - డి.సిఎం పవన్

**విజయవాడ,జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 20 మందికి పైగా భక్తులు దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదనకు లోనైనట్లు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. దురదృష్టకరమైన ఘటన ఇది. మోని అమావాస్య సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించాలని కోట్ల మంది వచ్చిన క్రమంలో తొక్కిసలాట చోటు చేసుకోవడం బాధాకరం. మన తెలుగు రాష్ట్రాల నుంచి మహా కుంభమేళాకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ప్రభుత్వ అధికారుల సూచనలు అనుసరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. కుంభమేళాలో భక్తులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

# జగన్ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో విధ్వంసం - మంత్రి నారా లోకేష్

**విజయవాడ,జనవరి29,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో జరిగిన విధ్వంసం జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికతో బయటపడిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రచారంలో మేనమామ అని చెప్పుకున్న జగన్, వాస్తవానికి కంసమామ అని మరోసారి రుజువైందని అన్నారు. పబ్లిసిటీ కోసం వందల కోట్లు ఖర్చు చేశారే తప్ప విద్యా ప్రమాణాలు పెంచే కనీస చర్యలు తీసుకోలేదని విమర్శించారు. 2018లో నాటి టిడిపి హయాంలో మెరుగ్గా ఉన్న ప్రభుత్వ విద్యా ప్రమాణాలు వైఎస్సార్సీపాలనలో ఎలా దిగజారాయో అసర్ నివేదిక స్పష్టంగా వెల్లడించిందని తెలిపారు. గత ప్రభుత్వపు పాలకులు అడ్డగోలు జీవోలు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారన్నారు. అక్షరాలు, అంకెలు కూడా గుర్తుపట్టలేని స్థితిలో విద్యార్థులు ఉన్నారని, స్కూళ్లలో తాగునీరు, మరుగుదొడ్లు లాంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని విమర్శించారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారో తెలుసుకుని, మారుతున్న కాలానికి తగ్గ ట్టుగా పాఠ్యప్రణాళిక సిద్ధం చేయడం, విలువలతో కూడిన విద్య అందించే ప్రయత్నాలు చేయడం ప్రారంభించామన్నారు. విద్యార్థులకు క్రీడలతో సహా ఇతర రంగాల్లో కూడా గైడెన్స్ ఇవ్వడం, పాఠశాలలో కనీస మౌలికవసతులు కల్పించడం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం మొదలైన అనేక అంశాలపై దృష్టి పెట్టి పనిచేస్తున్నామన్నారు. త్వరలోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రూపొందించి ప్రజలు, విద్యావేత్తల అభిప్రాయాలు తెలుసుకోబోతున్నామని లోకేష్ ప్రకటించారు.

# రెవెన్యూ వ్యవస్థలో పరిపూర్ణ సంస్కరణలు

### క్యూఆర్ కోడ్‌తో నూతన పట్టాదారు పుస్తకాలు అందిస్తాం

### రెవెన్యూ వ్యవస్థపై సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భద్రత, భరోసా వచ్చిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేసారు.. పెట్టుబడిదారులను ఆహ్వానించేలా ఒక సానుకూల వాతావరణంఏర్పడిందన్నారు. ఏపీ సచివాలయంలోని ప్రధాన సమావేశ ప్రాంగణంలో సిఎం చంద్రబాబు రెవెన్యూ వ్యవస్థపై సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరివల్ల మంచి జరుగుతుందో రాష్ట్రప్రజలంతా చూస్తున్నారు. ఎప్పటి నుంచో ఉన్న సమస్యలకు కూడా పరిష్కారం చూపిస్తున్నాం. సింహాచలం పంచగ్రామాల సమస్య కూడా త్వరలోనే పరిష్కారం కాబోతోంది. దాదాపు 500 ఎకరాల భూమిని ప్రత్యామ్నాయంగా ఇచ్చి 12149 ఇళ్లను రెగ్యులరైజ్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. గతంలో జీవో నెం.225 ఇచ్చాం. ఎంత భూమి ఆక్రమణకు గురైందో దానికి సమానంగా భూమి ఇచ్చేందుకు ఆనాడు నిర్ణయించారు. జీవో రాగానే కొంత మంది కోర్టుకు వెళ్లారు. గత ఐదేళ్లలో వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయలేకపోయింది. సుమారు 12149 కుటుంబాలకు న్యాయం చేయాలనే ఆలోచన కూడా వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం చేయలేకపోయింది. సింహాచలం భూములను ఆక్రమించి 12149 ఇళ్లను నిర్మించుకున్నారు. వాటి క్రమబద్ధీకరణకు గతంలోనూ ప్రయత్నాలు చేశాం. ఇప్పుడు సీఎం చంద్రబాబు నిర్ణయం మేరకు 420ఎకరాలకు బదులుగా 610ఎకరాలు సింహాచలం దేవస్థానానికి బదలాయించాలని నిర్ణయం తీసుకున్నాం. దీని రిజిస్ట్రేషన్ విలువ రూ.5300 కోట్ల వరకూఉంది. పెదగంట్యాడ, గాజువాక తదితరప్రాంతాల్లో సింహాచలం దేవస్థానానికి 610 ఎకరాలభూమిఇస్తున్నాం. దేవస్థానానికి చందనం చెట్లను పెంచుకునేందుకు అవకాశం ఉన్న చోట భూమి ఇస్తున్నాం. గాజువాకలో ఇనాం భూమిని క్రమబద్ధీకరించేందుకు నిర్ణయం తీసుకున్నాం. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన డీడ్‌ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అందుకే పట్టాలుఇచ్చి రెండేళ్లలోనే శాశ్వతహక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ అంశంపై గురువారం కౌంటర్ దాఖలు చేయబోతున్నాం. కోర్టులో మాకు సానుకూల స్పందన వస్తుందని భావిస్తున్నామన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 30-01-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
శుక్ల పాడ్యమి సా.4.11
శ్రవణం ఉ.7.14
వర్జ్యం ఉ.11.00-12.31
దు.ఉ.10.35-11.20, 2) మ.3.07-3.52
శుభసమయం : ఉ.8.30-9.15, సా.3.50-4.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ సభ్యులతో సఖ్యత. ప్రయాణాలు లాభిస్తాయి. కొత్త పనులు చేపడతారు.

**వృషభం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. ఒక సంఘటన ఆశ్చర్య పరుస్తుంది. ఇంటా బయటా అనుకూలం.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్య సమస్యలు చికాకుపెడతాయి.

**కర్కాటకం :** ఆదాయం పెరుగుతుంది. వ్యవహారాలలో పురోగతి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**సింహం:** కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు.

**కన్య :** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

**తుల :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సోదరుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు.

**వృశ్చికం:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. అనారోగ్యం, ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**ధనుస్సు:** వాహనయోగం. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

**మకరం:** శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కుంభం:** ప్రయాణాలు ముందుకు సాగవు. ఆలోచనలు కలిసి రావు. అనారోగ్యం, ఔషధ సేవనం.

**మీనం:** ఆదాయం కంటే ఖర్చులు అధికంగా ఉంటాయి. ఇంటా బయటా ప్రోత్సాహం. ఇతరుల విషయాలలో జోక్యం వద్దు.

- శ్రీమతి కలగ్గర శివలక్ష్మి, కోఠి, హైదరాబాద్

30-01Pg3exHMNWJQECK.qxd:30-01Pg3exHMNWJQECK.qxd 01/01/01 9:49 AM Page 1



=

# తిరుమల సమాచారం

## మొదటిఘాట్‌లో ఉట్టిపడుతున్న ఆధ్యాత్మికత

### - సహజ గరుడకు హైఫోకస్డ్‌లైట్లు

**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకు వచ్చే భక్తులు దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలు కలిగిఉంటారు. తిరుమల ఒక ఆధ్యాత్మికపుణ్యక్షేత్రం. అందుకు తగ్గట్లు భక్తుల్లో కూడా ఆధ్యాత్మిక భావన కలిగించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లుచేస్తోంది. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో, తిరుమల నుంచి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌లో రోడ్డుకు ఇరువైపులా భక్తులు ఆ స్వామిని స్మరించుకునేలా ఆధ్యాత్మికంగా 'గోవింద'నామాలు రాసిన బోర్డులను గతంలో ఏర్పాటుచేశారు. రోడ్డుమరమ్మతులు ,విస్తరణలో ఈ బోర్డులు తొలగించారు. ఆ తరువాత ఇప్పటికీ ఏర్పాటుచేయలేదు. ప్రస్తుతం గత కొద్దిరోజులుగా తిరుమల నుండి తిరుపతికి దిగే మొదటిఘాట్‌లో చివరన వినాయకస్వామి గుడికి ముందుగానే సహజగరుడశిల కొండకు టిటిడి విద్యుత్‌విభాగం ఘాట్‌రోడ్డులో హైఫోకస్డ్ లైట్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల రాత్రివేళ తిరుమలకొండ ప్రత్యేకించి సహజగరుడశిల మరింత శోభాయమానంగా కనిపిస్తోంది. ఈ ఏర్పాట్లపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆశయంప్రధానం. దిగే ఘాట్‌లో చివరన భక్తులు తదేకంగా భక్తిభావం గుర్తుండేలా ఇది కొంతవరకు దోహదంచేస్తుందనేది నమ్మకం. ఏడుకొండలవాడి దర్శనం ఏడేడుజన్మల పుణ్యఫలం, హరినామమే మదినిండా , ఇంకా ఆ దేవుని నామాలతో బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది.

## మొదటిఘాట్‌లో తప్పిన ప్రమాదం

**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానంతరం తిరుమల నుండి తిరుగుప్రయాణమైన భక్తుల వాహనం బుధవారం ఉదయం మొదటిఘాట్‌లో అదుపుతప్పింది. వాహనం డ్రైవర్ అతివేగంగా నడపడంతో ఏడవమైలు వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను గోడను ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటనలో ఒకే కుటుంబంలోని నలుగురు భక్తులు స్వల్పగాయాలకు గురయ్యారు. సంఘటన జరగడంతో ఘాట్‌లో వాహనాలు ఆగిపోయాయి. సమాచారం అందుకున్న అలిపిరి ఏవిఎస్‌ఒ రాజశేఖర్ సిబ్బందితో అక్కడకు చేరుకుని వాహనాన్ని పక్కకు తొలగించారు. క్షతగాత్రులను స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

## టిటిడిపై దుష్ప్రచారం చేసిన సోషల్‌మీడియా ప్రతినిధులపై కేసు

**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుకు టిటిడి అవమానం అంటూ దుష్ప్రచారం చేసిన మూడు సోషల్‌మీడియా ప్రతినిధులపై పోలీసులు కేసు నమోదు చేశారు. చాగంటి జనవరి 14వతేదీ శ్రీవారిని దర్శించుకోవడం జరిగింది. 16వతేదీ తిరుపతి మహతి ఆడిటోరియం లో ప్రవచనాలు ఇచ్చేందుకు 2024 డిసెంబర్ 20న ప్రొసీడింగ్స్ ఇచ్చింది. అయితే ఆయనకున్న క్యాబినెట్‌ర్యాంక్ ప్రోటోకాల్ ప్రివిలేజ్ ప్రకారం 14న దర్శనం చేయించింది. అయితే దీనిపై సోషల్‌మీడియా ప్రతినిధులు ముగ్గురు అవాస్తవాలు ప్రచారం చేశారని, లేనిపోని విషయాలు తప్పుగా దుష్ప్రచారం చేయడంతో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీసులకు టిటిడి ఫిర్యాదు చేసింది. విషప్ర చారం చేసిన ఆ సోషల్‌మీడియా సంస్థల లైసెన్స్‌లను రద్దు చేయాలని యూట్యూబ్ మెటా యాజమాన్యానికి కూడా ఫిర్యాదు చేశారు.

## కన్యకా పరమేశ్వరి దేవికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో నిర్వహించే వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 31న ముఖ్యమంత్రిచంద్రబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేశ్ తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కులమతాలకు ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పండగగా నిర్వహించాలన్న నిర్ణయానికి ఆర్యవైశ్యుల తరపున సీఎంకు ధన్యవాదాలు చెబుతున్నాం అని పేర్కొన్నారు.

## ఒలింపిక్స్ అసోసియేషన్‌కు పురుషోత్తం నియామకంపై సింగిల్ బెంచ్ తీర్పు సస్పెన్షన్!

**విజయవాడ,.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పురుషోత్తం నియామకంపై గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన జడ్జిమెంట్‌ను ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ బుధవారం సస్పెండ్ చేసింది. గతంలో తనను తానే ఏపీ ఒలంపిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పురుషోత్తం ప్రకటించుకొన్నారు. ఈ నియామకాన్ని సవాల్ చేస్తూ.. ఏపీ కబడ్డీ సెక్రటరీ శ్రీకాంత్‌తోపాటు పలు క్రీడా సంఘాలకు చెందిన వారు ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ క్రమంలో ఫెడరేషన్, ఏపీ కబడ్డీ క్రీడా సంఘాలకు ప్రభుత్వ గుర్తింపుతోపాటు ఫెడరేషన్ గుర్తింపు ఉందని ప్రధాన న్యాయమూర్తి దృష్టికి పిటిషనర్ తరుపు న్యాయవాది గంటా రామారావు తీసుకు వెళ్లారు. పురుషోత్తంకు ఎటువంటి గుర్తింపు లేదన్న ఈ సందర్భంగా ప్రధాని న్యాయమూర్తి ఎదుట పిటిషనర్ తరుపు న్యాయవాది స్పష్టం చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏకీభవించారు. అలాగే క్రీడాకారులకు ప్రభుత్వం ఎటువంటి సహకారం అందిస్తుందంటూ న్యాయమూర్తి ప్రశ్నించగా.. జాతీయ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ట్రావెలింగ్ ఎలవెన్స్, డైట్ అలవెన్స్, కోచింగ్, క్యాంపుల నిధులతోపాటు క్రీడా పరికరాలను సైతం ఏపీ ప్రభుత్వం సమకూర్చినట్లు హైకోర్టుకు క్రీడా సంఘాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఏపీ హైకోర్టులోని డివిజన్ బెంచ్ పై విధంగా తీర్పు వెలువరించింది.



## తిరుమల లడ్డూలకు మళ్లీ ప్లాస్టిక్ రహిత కవర్లు

### - భక్తులకు అందుబాటులో రూ.5కే రూ.10జనపనారబ్యాగ్

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత పవిత్రమైన లడ్డూప్రసాదాలను భక్తులు స్వీకరించి సులభంగా తీసుకెళ్ళేందుకు వీలుగా తిరుమల తిరుపతి దేవస్థానం మళ్ళీ ప్లాస్టిక్ రహిత సంచులను అందుబాటులోకి తీసుకువచ్చింది. సామాన్య భక్తులకు కూడా అందుబాటులో ఉండేలా ఈ ఒక్కోసంచి ధర 5రూపాయలుగా నిర్ణయించి విక్రయిస్తున్నారు. ఇప్పటికే లడ్డూలకోసం టిటిడి పలు రకాలుగా ప్రయోగాలను చేసింది. అయితే ఏవీ కూడా భక్తుల నుండి తగిన స్పందన లేకపోయింది. గత ఏడెనిమిదినెలలుగా తిరుమలలో లడ్డూప్రసాదాలకు జనపనార సంచులు 10రూపాయలు, 25రూపాయలవి విక్రయించేవారు. అయితే ఇవేవీ లడ్డూలకు అంత సంతృప్తికరంగా లేదనే అసంతృప్తి భక్తులు వ్యక్తంచేశారు. దీంతో మళ్ళీ టిటిడి ప్లాస్టిక్ రహిత కవర్లను వినియోగించేలా చర్యలు తీసుకుంది. గత ఐదురోజులుగా ఈ కవర్లు విక్రయాలు ప్రయోగాత్మకంగా చేపట్టడంతో భక్తుల నుండి విశేష స్పందన లభించింది. పర్యావరణ హితంకోసం ప్రత్యేకంగా టిటిడి ఈ ప్లాస్టిక్ రహిత కవర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కవర్లు లడ్డూవితరణ శాలలోని కౌంటర్లలో 5రూపాయలకే విక్రయిస్తున్నారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణతో బాటు ప్లాస్టిక్ వినియోగం నిషేధిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకున్న నిర్ణయంపై ఐదు సంవత్సరాల క్రిందట భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా అమలులో సఫలీకృతులయ్యారు. ప్లాస్టిక్ సంచుల నిషేధంలో లడ్డూలకు టిటిడి వినియోగించిన కవర్లను పూర్తిస్థాయిలో ఆపేశారు. అంతేగాక ఆ స్థానంలో కాగితపు సంచులను 5,10 లడ్డూలు పట్టేలా అందుబాటులో తీసుకువచ్చారు. ఈ సంచులు లడ్డూలు బరువు ఎక్కువ కావడంతో చిరిగిపోయి ,నీళ్ళతో తడిస్తే నాని లడ్డూలను తీసుకెళ్ళేందుకు భక్తులకు కష్టంగా మారింది. దీంతో వీటి సరఫరాను మూడేళ్ళ క్రిందటే నిలిపివేసిన టిటిడి జనపనారతో తయారైన కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జ్యూట్ సంచులను లడ్డూ వితరణశాలలో భక్తులకు విక్రయించారు. వీటి ధరలు అమాంతం 5లడ్డూలసంచి 25 రూపాయలు,10లడ్డూల సంచి 30రూపాయలు, 15లడ్డూలు పట్టే సంచి 35రూపాయలు, 25 లడ్డూలు పట్టే సంచి ఏకంగా 55రూపాయలు ధరగా ఉండేది. దీంతో సామాన్యభక్తులు కవర్లపైనే ఆధారపడ్డారు. ఆ తరువాత రెండేళ్ళు తిరుమలకు భక్తులు ప్లాస్టిక్ కవర్లు తీసుకురావడం కూడా నిషేధించడంతో డిఆర్‌డిఒ ఆధ్వర్యంలో పర్యావరణహితంగా గ్రీన్‌మంత్ర శ్రీవారి లడ్డూప్రసాదాల కవర్లు విక్రయాలు జరిగాయి. ఈ కవర్లు ధర 3, 6,10రూపాయల వరకు ఉండటంతో ఈ కవర్లలో లడ్డూలు ఉంచినా నెయ్యి కవరుకు అతుకుపోతోంది. ఈ సంచుల వినియోగంపై భక్తులు పెద్దగా సుముఖత చూప లేదు. ఈ కవర్లనుభూమిలో వేసినా తులసిమొక్క పుట్టుకొస్తుందని ప్రచారం కూడా చేశారు. అయినా భక్తులు మాత్రం ఈ కవర్ల వినియోగానికి ఆసక్తిచూపలేదు. ఆ తరువాత కొద్దిరోజులు తాటాకుబుట్టలు లడ్డూలకు వినియోగించాలని టిటిడి రెండేళ్ళ క్రిందట వినూత్నంగా ఆలోచన చేసినా "వార్త"కథనంతో ఈ కార్యాచరణకు ఫుల్‌స్టాప్ పెట్టేశారు. అప్పటి నుండి కూడా భక్తులు లడ్డూలు తీసుకెళ్ళేందుకు తంటాలు పడుతున్నా ప్రస్తుత టిటిడి అధికారులు ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, పోటు ఏఇఒ రమేశ్ ప్లాస్టిక్ రహిత కవర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. జనపనారతో (జూట్)తయారైన సంచులు తిరుమల లడ్డూ వితరణశాలలో అందుబాటులో ఉన్నా సామాన్యభక్తుల నుంచి పెద్దగా ఈ సంచులకు ఆసక్తిచూపడం లేదు.

## ఖేల్‌రత్నపై హైకోర్టు ఆదేశాలు భేష్

### - ఆర్చర్ జ్యోతి సురేఖ

**విజయవాడ, జనవరి 29,ప్రభాత వార్తప్రతినిధి:** మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు తనకు ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ హైకోర్టు ఆదేశించడం సంతోషం కలిగించిందని ఆర్చర్ జ్యోతి సురేఖ తెలిపారు. ఈ తీర్పును ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బుధవారం విజయవాడలో మీడియాతో ఆర్చర్ జ్యోతి సురేఖ మాట్లాడుతూ.. తాను అనేక టోర్నమెంట్లలో చాలా మెడల్స్ సాధించానని తెలిపారు. ప్రముఖ పోటీల్లో సైతం గోల్డ్ మెడల్స్ సాధించానని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సహాలు ఉన్నా.. అవార్డుల విషయంలో మాత్రం తన ప్రతిభను గుర్తించ లేదనే ఓ ఆవేదన అయితే తనకు ఉందన్నారు. తనకు అవార్డు కేటాయించడంలో కమిటీ సభ్యులంతా ఏకాభిప్రాయానికి రాలేదా? లేక ఇతర మరేమైన కారణాలు ఉన్నాయా? అనేది తనకు తెలియదని చెప్పారు. తాము అన్ని వివరాలతో ఖేల్ రత్న అవార్డు కోసం కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు సైతం చేసుకున్నామని వివరించారు. ఇటీవల క్రీడల అవార్డుల ప్రకటనలో తన పేరు లేక పోవడం తనకు తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు ఈ నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించి.. అన్ని వివరాలు సమర్పించామని పేర్కొన్నారు. దాంతో తనకు ఖేల్ రత్న అవార్డును ఇవ్వాలని కేంద్రాన్ని హైకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. హైకోర్టు తీర్పుపై కేంద్రం సానుకూలంగా స్పందించి.. తనకు అవార్డు అందజేస్తుందని భావిస్తున్నట్లు జ్యోతి సురేఖ ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరగనున్న టోర్నమెంట్లకు అన్ని విధాలా తాను సిద్ధమవుతున్నానని స్పష్టం చేశారు.

BAJAJ FINSERV

బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్ది, పూణె - 411035

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్‌జ్యువెలరీ "యథాతథంగా మరియు ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యువెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు & షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/- ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్టీ/ఆర్టీజీఎస్/బజాజ్ గోల్డ్ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్ ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత (లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యువెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీ పై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(12-02-25) అమలాపురం - మెయిన్ రోడ్; PGC2SGL9882079, 9941331, 0068809, 0068424, 0096771, 0146084, 0157562. అనకపల్లి - భార్గవి ప్లాజా; PBV8SGL9906872, 0036695, 0032085, 0159325. అనంతపురం - సుభాష్ రోడ్; PGA7SGL9850231. చిరాల - సంత బజార్; PEJ9SGL10029776. కడప - భాగ్యనగర్ కాలనీ; PGA9SGL9846499, 0034365, 0096373. ఏలూరు - వసంత మహల్ స్ట్రీట్; PEG8SGL10025209. గుడివాడ - బిజిఎల్; P563SGL6282590, 0049255, 0096885, 0108774, 0154384. గూడూరు; P5N7SGL8708895, 0079215, 0115490. జంగారెడ్డిగూడెం - ఏలూరు మెయిన్ రోడ్; PGH1SGL9842481, 9945300. కాకినాడ - జగన్నాయకపూర్; PBW1SGL9920367, 9917146, 9944782, 0009202. రాజమండ్రి - దేవి చౌక్; PBW3SGL9847189, 0030629, 0085377, 0094845, 0177319, 0169187. తణుకు - వేల్పూరు రోడ్; P6I4SGL10019196. తుని - సినిమా రోడ్; PBW9SGL9843760, 0021699. వైజాగ్ - కూర్మన్నపాలెం; PI57SGL9848189, 9932263, 9980792, 0100595, 0096145, 0103216, 0101088. వైజాగ్ - కొత్త గాజువాక; PI53SGL9863850, 9868176, 9958784, 9976330, 0003373, 0018372, 0048040, 0128764, 0171212. వైజాగ్ - పాత గాజువాక; PB47SGL9845730, 9971644, 0030522, 0030880, 0066420, 0066909, 0140680, 0177324, 0175137. (13-02-25) గుంటూరు - అరుండేల్‌పేట; PEK1SGL8930548, 9849474. హిందూపురం - ధన లక్ష్మి రోడ్; PEG4SGL9846135, 9859229, 0082116, 0140762, 0170266, 0176016, 0169249. కర్నూల్ - గాంధీ నగర్; PBW2SGL9861142, 0023409, 0023825, 0138508. మదనపల్లె - ఎన్‌టిఆర్ సర్కిల్; PEG6SGL9863448, 9961895, 9965800, 0101696, 0109779. పర్లాకిమిడి; PW03SGL7268576, 7966954, 8225183, 8225849, 9507524. వైజాగ్ - అక్కయ్యపాలెం; PI90SGL10127625. వైజాగ్ - బీజీఎల్; P408SGL9884529, 9885529, 9880577, 9902558, 9956026, 9995625, 0060179, 0060578, 0085619, 0100420. వైజాగ్ - దాబాగార్డెన్స్; PI55SGL9885638, 9996095, 0020557, 0035730, 0034865, 0062040. వైజాగ్ - ద్వారకానగర్; PI52SGL9868710, 9869530, 9928194, 0087632, 0078676, 0101580, 0110433. వైజాగ్ - హెచ్‌బీ కాలనీ; PI58SGL10007180, 0144350. వైజాగ్ - కంచర పాలెం; PI54SGL10067264, 0112989. వైజాగ్ - పెదవాల్తేరు; PI56SGL9850037, 9872224, 0178230. వైజాగ్ - రవీంద్ర నగర్; PI95SGL9917077, 9972087, 0052430, 0049404. (14-02-25) నంద్యాల - శ్రీనివాస్ నగర్; PE01SGL9848308, 9934234, 9952698, 0061626, 0096579, 0096354, 0146866, 0152560. నరసరావుపేట - అరుండేల్‌పేట; PE02SGL9894999, 9927876, 9990888, 0023733, 0086056, 0100900, 0173257, 0170697. నెల్లూరు - బీజీఎల్; P468SGL9958615, 0101404, 0110780, 0146392, 0156608, 0172613, 0174129. నెల్లూరు - కనకమహల్ సెంటర్; P19ISGL9869848, 9997972. నెల్లూరు - నవాబ్‌పేట్; PXB4SGL9860062, 0066853, 0068936, 0127072. నెల్లూరు - వేదయపాలెం; PXB5SGL9923447, 9923750, 9980437, 9990518, 0060494, 0086826. ఒంగోలు అద్దంకి - బస్ స్టాండ్ సెంటర్; P564SGL7791828, 9992012, 0083929, 0152645. పీలేరు - కడప రోడ్; PEG3SGL10053829, 0078803, 0178495. (17-02-25) కాశీబుగ్గ - కెటి రోడ్; PEG5SGL9886422, 9965495. రైల్వే - కోడూరు నేతాజీ రోడ్; PGC5SGL9868219, 9903514, 9958491, 9990736, 0036744, 0046334, 0061371, 0112336. రాయచోటి - బంగ్లా రోడ్; PBW4SGL9843864, 9859621, 9873795, 9920678, 9971874, 0081661, 0084991, 0097792, 0139190, 0159766, 0159567. శ్రీకాకుళం - రామలక్ష్మణ్ జంక్షన్; PBW5SGL9920195, 9990238. సూళ్ళూరుపేట - పాండు రంగ స్ట్రీట్; PBW7SGL9862391, 9897903, 9916660, 9940519, 9969060, 9981962, 0054717, 0080561, 0088210, 0127034, 0144935. తాడిపత్రి - యల్లనూరు రోడ్; PBW8SGL9849878, 9850480, 9872197, 9887058, 9884795, 9885002, 9921332, 9927674, 9939633, 9977284, 0017237, 0016419. విజయనగరం - ఫోర్ట్ ఏ జి రోడ్; PBX1SGL8969523, 8973007, 9215900, 9499991, 9848261, 9868231, 9907076, 9963112, 9963773, 9963435, 9963975, 9977901, 0003508, 0037651, 0085069, 0138727, 0152938. విజయనగరం - ఎంజి రోడ్; PCZ4SGL10037119, 0088439. (18-02-25) శృంగవరపు - కోట; PBW6SGL9873206, 9870092, 9882401, 9907183, 9903617, 0008036, 0095867, 0114779. తెనాలి - గాంధీ చౌక్; PEK2SGL9942367, 0077481, 0097273. తిరుపతి - బైరాగి పట్టెడ; PMB8SGL10077470. తిరుపతి - బీజీఎల్; P442SGL9885402, 9979558, 9995936, 0156604. తిరుపతి - కొర్లగుంట; PNB1SGL8722970, 8965783, 9525590. తిరుపతి - ఆర్‌సి రోడ్; PNB2SGL8149793, 8846316. విజయవాడ - అజీత్ సింగ్ నగర్; PLB9SGL9522032, 9957568, 9957279, 0107898. విజయవాడ - భవానీపురం; PMB1SGL9846901. వైజాగ్ - గోపాలపట్నం; PB91SGL9918940, 9977912, 0176254, 0175613. వైజాగ్ - మధురవాడ; PI93SGL9881867, 9981542. వైజాగ్ - పెందుర్తి; PI92SGL9849172, 9922885, 9916374, 9944288, 9955909, 0022609, 0030719, 0100606, 0111356, 0111513, 0112671, 0111645, 0130633, 0174386, 0174083, 0169921. (19-02-25) విజయవాడ - చిట్టి నగర్; PMB3SGL10052652, 0048423, 0108457, 0155904, 0179572. విజయవాడ - ఏలూరు రోడ్; PMB2SGL9857334, 9956369, 0021791, 0034394, 0155218. విజయవాడ - గురునానక్ కాలనీ; PGH4SGL9990289, 0002493. విజయవాడ - ఇబ్రహింపట్నం; PMB6SGL9886072, 9919557, 0019239. విజయవాడ - మొగల్‌రాజ్‌పురం; PGA8SGL9850996, 0034536, 0179670, 0178141. విజయవాడ - సత్యనారయణపురం; PMB4SGL10006247, 0142134.
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

## కుప్పంలోగ్రీన్ స్కిల్స్ అకాడమీ, కెరీర్ రెడీనెస్ సెంటర్

### సిఎం చంద్రబాబు వెల్లడి

**విజయవాడ జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** కుప్పంలో గ్రీన్ స్కిల్స్ అకాడమీ, కెరీర్ రెడీనెస్ సెంటర్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటిరి అమెరికాకు చెందిన వన్ మిలియన్ వన్ బిలియన్ సంస్థ ప్రారంభించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ వేదికగా తెలిపారు. రాయలసీమలో ప్రతిభావంతులైన యువతకు ఉద్యోగ నైపుణ్యాలు కల్పించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఇదని ఆయన పేర్కొన్నారు. అమెరికా సంస్థ ప్రతినిధులు మంగళవారం ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. వచ్చే ఐదేళ్లలో ఈ సంస్థ ద్వారా 50వేల మందికి శిక్షణ అందించనున్నట్లు సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీ రంగంలో వందమంది పారిశ్రామికవేత్తలను తయారు చేయడంతో పాటు 30వేల మంది యువతకు ఉద్యోగాలు, ఇంటర్న్‌షిప్‌లు కల్పిస్తారని వివరించారు.

## కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి ప్రాధాన్యత

### - మంత్రి సత్యకుమార్‌యాదవ్

**తిరుపతి,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వం అరాచకపాలనతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, ఏడునెలల క్రిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి పాలన సాగిస్తోందని రాష్ట్రమంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. రాయలసీమజిల్లాల్లో బిజెపి కూడా



బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పథకాలు అమలుచేసి వారి కళ్ళలో అనందం చూస్తున్నారన్నారు. కూటమిప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీలను అమలుచేయడం జరుగుతోందన్నారు. వైసిపి ఎన్ని ఆరోపణలు చేసినా, కుట్రలు చేసినా ప్రజలు నమ్మరన్నారు. కూటమిలోని టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు కలిసి ప్రజల కోసం అనేక కార్యక్రమాలు అమలుచేసేందుకు సిద్ధమవుతోందని అన్నారు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా కూడా అభివృద్ధిచేసేందుకు కేంద్రం సహకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ బుధవారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేశారు.

ఈ కార్యక్రమానికి మంత్రి సత్యప్రసాద్ హాజరై పార్టీలో సామాన్యకార్యకర్తగా ప్రవేశించిన సామంచి శ్రీనివాస్ నేడు జిల్లా నూతన అధ్యక్షుడుగా నియమితులవడం బిజెపికి మంచిరోజులేనని అన్నారు. ఆయన నాయకత్వంలో తిరుపతి జిల్లాలో పార్టీనాయకులు అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం పలువురు బిజెపి నాయకులు నూతన అధ్యక్షుడిని దుశ్శాలువలతో, పుష్పకిరీటాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లాకు చెందిన కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, బిజెపి ఎమ్మెల్యేలు, పలువురు నాయకులుపాల్గొన్నారు.

## త్వరలో అక్రెడిటేషన్లిస్తాం: మంత్రి పార్థసారథి



ఎపియుడబ్ల్యుజె ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి

**అమరావతి, జనవరి 29, ప్రభాతవార్త :** అక్రెడిటేషన్ల జీవో పై కసరత్తు పూర్తయిందని, త్వరలో జీవో విడుదలచేసి సకాలంలో అక్రెడిటేషన్లిస్తామని సమాచారా పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి హామీ ఇచ్చారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో తనని కలిసిన ఏపియుడబ్ల్యుజె ప్రతినిధిబృందంకు ఆయన ఈ హామీనిచ్చారు. అక్రిడిటేషన్ల జారీలో గత ప్రభుత్వం విధించిన అడ్డగోలు నిబంధనలు తొలగించి అర్హులయిన వారందరికి అక్రిడిటేషన్లు జాప యం లేకుండా ఇవ్వాలని ప్రతినిధి బృందం కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజెరాష్ట్రాధ్యక్షుడు ఐవి సుబ్బారావు, ఐజెయు జాతీయ కార్యదర్శి డి సోమసుందర్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె జయరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా రవి, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవి సురేష్‌కుమార్‌రెడ్డి వున్నారు.

## సింహాచల భూ సమస్య: దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూములు

### - కోర్టు వ్యాజ్యాల పరిష్కారానికి చర్యలు

**విశాఖపట్నం, జనవరి 29, ప్రభాతవార్త:** ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సింహాచల భూముల సమస్యలకు ప్రభుత్వం శుభం కార్డు వేయబోతోంది. అంతేకాకుండా 12 వేల కుటుంబాలకు శుభవార్త చెప్పింది. సింహాచల దేవస్థానం భూములలో నిర్మించుకున్న భవనాలు రెగ్యులరైజ్ కాక, వేలాది కుటుంబాలు సతమతమవుతున్న సంగతి తెలిసిందే. శిధిలమైన భవనాలను పునర్ నిర్మించుకోవడం, లేదా స్వల్ప మరమ్మతులు చేపట్టిన దేవస్థానం అధికారులు అడ్డుపడుతూ వస్తున్నారు. ఉన్న ఇంటిని విక్రయించి శుభకార్యాలు చేసుకుందామనుకున్న వారికి సైతం ఈ రెగ్యులరైజేషన్ సమస్య అడ్డుపడుతూ వచ్చింది. ఈ భూములకు సంబంధించి కొంతమంది కోర్టులకు ఎక్కడం వలన ఈ సమస్య అపరిష్కృతంగానే నిలిచింది. 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చినప్పుడు దీనికి సంబంధించి చర్యలు చేపట్టాలనుకున్నా సాధ్యం కాలేదు. 201819 మధ్య అప్పటి ప్రభుత్వం ఈ అంశంపై తీసుకున్న చర్యలు కూడా ముందుకు సాగలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యను ఏదో ఒక విధంగా కొలిక్కి తీసుకురావాలని భావించి, పంచ గ్రామాల పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలను అమరావతికి పిలిపించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో బుధవారం జరిగిన సమావేశంలో పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సింహాచల దేవస్థానానికి గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాలలో 420 ఎకరాలు భూమి ఉన్నట్టు గుర్తించారు. ఈ భూమికి బదులు 610 ఎకరాలు భూమిని, సింహాచల దేవస్థానానికి, అనువంశిక ధర్మకర్తలకు సమాన రిజిస్ట్రేషన్ విలువతో బదలాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భూముల విలువ 5,300 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ 420 ఎకరాల భూమిలో ఉన్న భవనాలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల సుమారు 12 వేల కుటుంబాలకు ఎంతో మేలు జరగనుంది. ఇది ఇలా ఉండగా గాజువాకలో ఈనాం భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఆయా భూములకు సంబంధించి వివిధ కోర్టులో ఉన్న కేసులన్నింటిపై గురువారం కౌంటర్ దాఖలు చేయాలని కూడా ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. కాగా బుధవారం జరిగిన ఈ సమావేశానికి సంబంధించిన నిర్ణయాలను క్యాబినెట్ లో చర్చించి దీనికి సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేయబోతోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అనేకమంది జీవితాలలో వెలుగు నింపింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై పంచ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబుతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు పల్ల శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, విష్ణు కుమార్ రాజు, పీలా గోవింద్ గండి బాబ్జి, వి.ఎం.ఆర్.డి.ఏ.చైర్మన్ ప్రణవ్గోపాల్, ఆలయ ఉన్నతాధికారులు ఉన్నారు.

వార్త

అందరితో మర్యాదగా ఉండాలి. కాని సన్నిహితంగా కొందరితోనే ఉండాలి.

న-వి.జాన్సన్

# హృదయవిదారకం..


శ్రవణా నక్షత్రంలో మోని అమావాస్య రావడంతో ప్రయాగ రాజ్‌లో త్రివేణి సంగమం వద్ద కుంభమేళాకు ఇసుకేస్తే రాలనంత మంది భక్త కోటి విచ్చేసారు. ఈ సందర్భంగా బుధవారం తెల్లవారుఝామున సంగం ఘాట్ వద్దజరిగిన తొక్కిసలాటలో కనీసం 30 మంది భక్తులు దుర్మరణం పాలైన విషాద ఘటన యావత్ భక్తుల మనసులనుకలచివేసింది. నిజానికి బుధవారం జరిగిన సంఘటనకు భాష్యాలు చెప్పడం కష్టతరం. త్రివేణి సంగమం ప్రాంతంలో కుంభమేళాలు కొత్తేమీ కాదు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయడంలోనూ, అక్కడి ప్రభుత్వాలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడానికి ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. కుంభమేళా మరో నెల రోజుల పాటు జరుగుతున్నప్పటికీ మోని అమావాస్య రోజున అమృత పుణ్యస్నానం చేయాలని భక్తజనులు ఆత్రుత పడుతుంటారు.అందుకు తగ్గట్టుగా ముందుగానే అన్నీ ఏర్పాట్లు చేసుకుంటారు.ఈ పుణ్య స్నానాలకు దాదాపు పది కోట్లమంది వస్తారని అంచనాతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భారీ స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసింది. కుంభమేళా మొదలైనప్పటినుంచి యావద్భారత దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఎంతోమంది భక్తులు త్రివేణి సంగమ స్నానానికి తరలి వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆ ప్రాంతంలో ఎన్నో వందల స్నాన ఘట్టాలు కూడా ఏర్పాటు చేసారు. గంగానది పొడవునా ఉండే ఈ ఘాట్‌లలో ఎక్కడ్డినా స్నానం ఆచరించేలా జరిగిన ఏర్పాట్ల గురించి భక్తులకు తెలుసు. కానీ పరమ పవిత్ర దినం రోజున త్రివేణి సంగమంలో స్నానం మోక్షాన్ని కలిగిస్తుందనే నమ్మకంతో ఎక్కువ మంది అమృత పవిత్ర స్నానాలు ఆచరించేందుకు వచ్చారు. అక్కడ పుణ్యస్నానం చేస్తే సకల పాపాలూ తొలగిపోయి పుణ్యం లభిస్తుందని అభిలషించారు. స్నానాలలో పాటు దానధర్మాలుచేయడం వలన శుభఫలితాలు,పుణ్యం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. పితృ తర్పణాలు కూడా ప్రతీతి గత పది రోజుల్లో 15కోట్ల మంది పుణ్యస్నానాలు చేయగా, ఈఒక్క రోజునే భక్తకోటి తరలివచ్చారు. సాధు సంతులు,అఖాడాలు, బాగా సాధువులు, కిన్నెరలు తరలి వచ్చారు. సామాన్యులు అదే తపనతో సామాన్యులు వచ్చారు. తెల్లవారుఝామునే పుణ్య స్నానాలు చేసి, దానధర్మాలు, పితృకార్యా లు ఆచ రించుకోగలిగితే రద్దీని తట్టుకోవచ్చునని భక్తులు భావించా రు.ముందు రోజు రాత్రే స్నానఘట్టాలు చేరి అక్కడేఇసుక తిన్నెలపై విశ్రాంతి తీసుకున్నారు. వారు మేలుకునే సరికి బయటి ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఒక్కసారిగా దూసుకు రావడం,అప్పటికే ఉన్న వారు మేలుకొని వారి ప్రయాణ సామాగ్రి శ్రద్ధ చేసు కోలేక జరిగిన తొక్కిసలాటలో దుర్మరణం పాలయ్యారు. ఎన్నో ఘాట్లున్నా త్రివేణి సంగమ ప్రాంతంలో ఉన్న సంఘం ఘాట్ వద్దకే అందరూ చేరుకున్నారు. ఇక్కడ స్నానం చేస్తేనే పుణ్యఫలం దక్కుతుందనే ఉద్దేశంతోఅధిక సంఖ్యలో భక్తులు ఈ ఘాట్‌కి చేరుకున్నారు. అఖాడాలు, సాధు సంతులు ఉదయం పూట రెండుసార్లు స్నందకు చేయాల్సి వస్తుంది. జరిగిన దుర్ఘటనతో వారినిసాయంత్రం వరకు కదలీ రావద్దని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నిలిపివేసి భక్తుల రాకపోకలు నియంత్రించడంలో మరింత పెద్ద ప్రమాదాన్ని తప్పించారు. 1954 లో ఫిబ్రవరి 3న నిర్వహించిన తొలి కుంభమేళాలో దాదాపు 800 మంది భక్తులు ప్రణకు అనంత వాయువుల్లో కలిసి పోయారు. భక్తి పారవశ్యంలో రద్దీని సైతం లెక్కచేయ కుండా తీర్థయాత్రలకు వచ్చే భక్తులకు ఇలాంటి సందర్భాలు ఎదురవుతుంటాయి. నిన్నగాక మొన్న తిరుపతిలో వైకుంఠ ద్వారదర్శనం సందర్భంగా టోకెన్‌ల క్యూ కోసం పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగింది. అదికేవలం అధికారుల మధ్య సమన్వయం లేక మానవ తప్పిదం కారణంగా జరిగింది. ఈసారి అలా కాదు ఒకేరోజు పుణ్య స్నానాలు చేయాలన్న తలంపుతో చిక్కుకున్నారు. నిన్ననే జరిగిన మరో సంఘటన కూడా ఈ కోవలోదే. అయితే ఆ సంఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. జైనుల కొలిచే ఆదినాథ్ దేవుని అభిషేకం కార్యక్రమానికి వచ్చిన భక్తులు సామర్థ్యానికిమించి అక్కడ ఏర్పాటు చేసిన వేదిక పైకెక్కి కిందపడి నలిగిపోయారు. 2003 ఆగస్టు 27న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో కుంభమేళా పవిత్ర స్నానాల సమయంలో జరిగిన తొక్కిసలాటలో 39మంది మృతిచెందారు. 2005 లో రాష్ట్రంలోని సతారాం జిల్లాలో మంధర్ దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 350 మంది భక్తులు మృతిచెందారు. రాజస్థాన్‌లోని చాముండా ఆలయంలో 2008 సెప్టెంబరు 30న జరిగిన తొక్కిసలాటలో 250 మంది మృతిచెందారు. అదే సంవత్సరం హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 162 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంతకన్నా దారుణమై తొక్కిసలాట వదంతిని నమ్మి భక్తులు వంతెన మీద నుంచి ఇటూ అటూ పరుగెత్తడం వల్ల జరిగింది. 2013 అక్టోబరు 13న మధ్యప్రదేశ్‌లోని దాటియా జిల్లాలోని రతన్‌గఢ్ ఆలయం వద్ద వంతెన కూలబోతోందన్న వదంతి 115మందిని బలితీసుకొంది. మరికొన్ని తొక్కిసలాటల్లోనూ పదుల కొద్దీ జనం మృతిచెందారు. భక్తుల రద్దీతో జరిగిన తొక్కిసలాటల గురించి చెప్పుకోవాలంటే గతంలో గోదావరి నది పుష్కర సమయంలో 27 మంది చనిపోయారు. పాలకులు అన్నీ జాగ్రత్తలు తీసుకున్నా, ఎక్కడి కొన్ని లోటుపాట్లు కారణంగా ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తాయి. తాజాగా జరిగిన తొక్కిసలాట కేవలం చీకటి రాత్రులు కావడం, ఒకే ఘాట్‌లో స్నానం చేస్తే పుణ్యం వస్తుందనే భక్తి భావనతో అందరూ ఒకే చోటకు

సర్వ ప్రపంచాన్ని సైతం శాసిస్తూ మనిషి అసంతృప్తితో బాధపడతాడు. తనను తాను సంతోషంగా ఉంచుకోవడం చేతకాకపోతే.



సెనెకా

గౌరవం అన్నది పదవులు హోదాలు పొందడంలో లేదు. పదవులు, గౌరవాదులకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.



అరిస్టాటిల్

# ప్రజావాక్కు



### జమిలి ఎన్నికలు నష్టమే!

ఇకపైదేశంలో జరిగేసార్వత్రికఎన్నికలు జమిలి ప్రాతి పదికపై జరిపేందుకు కేంద్రప్రభుత్వం సమయాత్తమవుతోంది.అయితే జమిలీఎన్నికలు మనదేశానికి నష్టమని, లౌకిక విలువలు, రాజ్యాంగమూలాలకువిఘాతం కలిగిస్తుందని, రాజ్యాంగ బద్ధమే కాదని, అమలులో అసాధ్యమని, రాజకీయ సంక్లిష్ట సంక్షోభాలకు దారితీస్తుందని మేధావులు, విశ్లేషకులు భావిస్తున్నారు.విదేశీ పాలకుల నియంతృత్వం తట్టుకోలేకస్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకోసంపోరాడి ప్రజాస్వామ్య పాలన ఏర్పరుచుకున్నాం. దీన్ని బలహీనపరచడం మంచి చర్యకాదు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే ఎంతఖర్చు అవుతుందనే విషయంపై సెంటర్‌ఫర్ మీడియా సర్వీసెస్ గత ఏడాదిలోనే అంచనాలను విడుదలచేసింది.ఒకేసారిఎన్నికలు నిర్వహిస్తేరూ.10 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి

రాష్ట్ర అసెంబ్లీకి ఎమ్.ఎల్.ఎ.గా ఎన్నికయిన తరువాత సెషన్సు జరుగుతున్నంత కాలం హాజరు అవ్వాలి. వీరికి అత్యధిక జీతాలు ప్రజల సొమ్మునుండి చెల్లింపబడుతున్నాయని తెలుసుకోవాలి.నియోజకవర్గ సమస్యలను సభకునివేదించి పరిష్కారాలనుసూచించాలి.అంతేకాని సభకు హాజరు కాకుండా బయట నుండి విమర్శలు చేయడం సబబుకాదు.ఏవో కొన్ని విపత్కర పరిస్తుతులలో హాజరు కాకపోవచ్చు.అదివేరేసంగతి.తెలంగాణాలోప్రతిపక్ష నాయకుడు చంద్రశేఖర్‌రావు ఆంధ్రప్రదేశ్‌లో మాజీముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమకు అసెంబ్లీకిరావడం ఇష్టం లేకుంటే రాజీనామాలు చేసి మరొకరికి అవకాశం ఇవ్వాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### రిజర్వేషన్ గడువు పెంచాలి

రైల్వే రిజర్వేషన్ ఇంతకుముందు మూడు నెలల ముందు చేసుకునే సౌకర్యం ఉండేది.కాని ఇప్పుడు రెండు నెలలకు కుదించారు. జనప్రయాణ రద్దీ దృష్ట్యా మళ్లీ 90 రోజులు పెడితే బాగుంటుంది. మామూలు ప్రయాణాలు కాకుండా తిరుమల సేవా, దర్శన టిక్కెట్లు, రైలు టిక్కెట్ల సమన్వయం కాకుండా ఉంది. అందువలన కూడా 90 రోజుల ముందు రిజర్వేషన్ సౌకర్యంగా ఉంటుంది.

-తిరుమల దేవి, హైదరాబాద్

### కేసులు రోజు వారీ విచారించాలి!

జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల్లో రోజువారీ విచారణ జరపాలని సిబిఐ కోర్టును సుప్రీంకోర్టు తాజాగా ఆదేశించింది. గతంలో కూడా సుప్రీంకోర్టు ఎం.పి.ల, ఎమ్మెల్యేల కేసులను సత్వరం విచారణజరిపి పరిష్కరించమనిఆదేశించినా అమలుకు నోచుకోలేదు! ఇప్పుడుకూడా రోజువారీ విచారణ చేపట్టామన్నారుకానీ నిర్దిష్టకాలంలో పరిష్కారంచేయమనిచెప్పలేదు? అలాగే మరి ఇతర ప్రజా ప్రతినిధుల కేసుల మాటేమిటి? సుప్రీంకోర్టు ప్రజా ప్రతినిధుల కేసుల విషయంలో మరింత స్పష్టమైన ఆదేశాలుఇవ్వాలి.జడ్జీలకు నాట్ బిఫోర్‌మి సౌలభ్యాన్ని రద్దు చేయాలి. అలాగే విచారణ మధ్యలో జడ్జీలను బదిలీ చేయడం సరి కాదు! న్యాయ కోవిదులు వీటిపై చొరవ చూపాలి.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ట్రంప్ చేతిలో చిన్నదేశాలు

అమెరికా గ్రేట్ అగైన్ నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ తనవిధాన నిర్ణయాలతో అమెరికాకు ఉన్న నాయకత్వ స్థానాన్ని పక్కకు తప్పించేట్టుఉన్నారు. కంచెలతో అల్పాదాయా దేశాలను తన గుప్పిట్లో పెట్టుకోవాలి అనిచూడడం ఎంతవరకు సమంజసం. ఇప్పుడు ఒక్కటిమాత్రం స్పష్టంయూరప్ తన ప్రాభవాన్ని కోల్పోతున్నది. ఇక ఆసియా ప్రపంచ రారాజు కాబోతోంది. ఎందుకని భారత్ లాంటి దేశాలను ఇవ్వాళ ప్రపంచ విదేశాంగ విధానాలను ప్రభావితం చేస్తున్నాయ్‌మరి.ఇకపోతే ఇండో పసిఫిక్‌గా మారడమే దీనికి పెద్ద నిదర్శనం. అవుతే ఇక ప్రపంచ వాతావరణ ఒప్పందం 2015 నాటి పారిస్ ఒప్పందం నుండి బయటికి వచ్చి అమెరికా లాంటి దేశాలు మరింత బాధ్యతా రహితంగా వ్యవహరిస్తూ మరింతప్రభావాన్ని కోల్పోతున్నాయి.

-భారత అవినాష్, జనగామ

### అధికారులను నియమించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య అభివృద్ధికి ఎక్కువగా కృషి చేస్తుంది. టీచర్స్,లెక్చరర్స్,నియామకాలనుచేపట్టడం జరిగింది. అదేవిధంగా మండల విద్యాశాఖ అధికారులను కూడా నియమించాలి. ప్రతి జిల్లాలో చాలా తక్కువమంది మండల విద్యాశాఖ అధికారులుండడం వలన ఇతర మండలాలను ఇన్చార్జిగా అదనపు విధులను నిర్వహించడం వలన పరిపాలన పర్యవేక్షణ ఇబ్బందులున్నాయి. మండల పరిధిలో ఉన్న ప్రతి పాఠశాల విద్యార్థులకు విద్య అభివృద్ధికి కృషి చేయాలి. నియామకాలు పూర్తి అయ్యేవిధంగా ప్రభుత్వం కృషి చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్‌జిల్లా

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# శత ప్రయోగాల వేదిక శ్రీహరికోట

***వందవ ప్రయోగం జిఎస్‌ఎల్వీఎఫ్15 ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా నింగి లోకి ప్రవేశపెట్టడంతో శ్రీహరికోట రికార్డులకెక్కింది. 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ1 రాకెట్‌ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్‌ని మొదటిసారిగా ప్రయోగించింది. 2024 డిసెంబర్ చివరి వారంలో స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా ప్రయోగించిన పిఎస్‌ఎల్విసి 60 షార్ నుంచి చేసిన 99వ ప్రయోగం. తొలి ప్రయోగం చేసిన 46 ఏళ్లలోనే ఈ ప్రగతి సాధించడం విశేషం. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న ప్రతీ ఒక్కరూ అభినందనీయులే! ఇది ప్రతీ భారతీయుని విజయం.***

డి జె మోహన రావు

శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి నుండి జనవరి 29న తన వందవ ప్రయోగం జిఎస్‌ఎల్వీఎఫ్15 ద్వారా ఎన్విఎస్ 02 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా నింగి లోకి ప్రవేశపెట్టడంతో శ్రీహరికోట రికార్డులకెక్కింది. 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ1 రాకెట్‌ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్‌ని మొదటిసారిగా ప్రయోగించింది. 2024 డిసెంబర్ చివరి వారంలో స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా ప్రయోగించిన పిఎస్‌ఎల్విసి 60 షార్ నుంచి చేసిన 99వ ప్రయోగం.తొలి ప్రయోగం చేసిన 46ఏళ్లలోనే ఈ ప్రగతి సాధించడం విశేషం. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న ప్రతీఒక్కరూ అభినందనీయులే! ఇది ప్రతీ భారతీయుని విజయం. ఈ సందర్భంగా ఒకసారి మన అంతరిక్ష విజయ పరంపరను పునరావలోకనం చేసుకుందాం. స్వాతంత్రం వచ్చిన తొలి నాళ్లలోనే దేశరక్షణ అవసరాలు, అభివృద్ధికి అంతరిక్ష పరిజ్ఞాన అవసరాన్ని గ్రహించిన భారత ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనా వ్యవస్థను ఏర్పరిచేందుకు సన్నాహాలు మొదలు పెట్టింది. భారత అంతరిక్ష పరిశోధనావ్యవస్థకు పితామహుడైన విక్రం సారాభాయ్ 1957లో రష్యా మొట్టమొదటి ఉపగ్రహం స్పుత్నిక్‌ను ప్రయోగించిన తరువాత మనదేశానికి కూడా ఉపగ్రహ అవసరాన్ని నాటి ప్రధాని నెహ్రూకు తెలియజేసి సాంకేతిక పరిజ్ఞాన్ని సామాన్యులకుఅందుబాటులోకి తీసుకొచ్చేటప్పుడే మన దేశంలోని ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చని ఒప్పించి, 1962లో భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడయిన హోమీ బాబా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్‌రీసెర్చ్ (ఇన్‌కోస్పార్)ను ఏర్పరిచారు. భవిష్యత్తులో ఇతర దేశాలు ఉపగ్రహానికి కావలిసిన సకల పరికరాలను అందించకపోవచ్చని ముందుగానే ఊహించిన సారాభాయ్ అవసరమయిన అన్ని భాగాలనూ దేశీయంగానే తయారు చేసేదిశగా ప్రయత్నం చేసారు. 1969లో ఇన్‌కోస్పార్ ఇస్రోగా రూపొందింది. ఉపగ్రహాలను తయారు చేయడంతోపాటు వాటిని ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా కలిగిఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించిన సారాభాయ్‌శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎల్వి) ఉపగ్రహ వాహకనౌక రూపకల్పనకు నాంది పలికారు. మొదటి నుండి ఉపగ్రహాల నిర్మాణాన్నే దృష్టిలో పెట్టుకొని దానికి అవసరమైన భూ ఉపరితల లక్షణాలను అధ్యయనం చేసేందుకు కేరళలో త్రివేంద్రం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ నెలకొల్పి అమెరికా, రష్యాలనుండి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగిస్తూ ఉపరితలాన్ని అధ్యయనం చేయడం మొదలు పెట్టారు. కానీ దీని చుట్టూ జనసంచారం ఎక్కువగా ఉండడం, పైగా ఆ కేంద్రం మినీ రాకెట్ ప్రయోగాలకే పరిమితం కావడం కారణాన్న భవిష్యత్తులో చేయబోయే భారీ రాకెట్ ప్రయోగాల దృష్ట్యా భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం మరోచోట రాకెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.అనువైన రాకెట్‌ప్రయోగ కేంద్ర స్థలం కోసం అన్వేషణలో అన్నిప్రాంతాలనూ పరిశీలిస్తూ రాగా శ్రీహరికోట దీవి ఆయన కంటపడింది. రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు ఎంత దగ్గరగా ఉంటే భూమ్యాకర్షణను అధిగమించి పైకి వెళ్లేందుకు రాకెట్‌కు అంత తక్కువ ఇంధనం ఖర్చౌతుంది. శ్రీహరికోట భూమధ్య రేఖకు దగ్గరగా ఉండడం ఇస్రో ఈస్థలాన్ని ఎంచుకోవడానికి ఒక కారణం. భౌగోళికంగా సాంకేతికంగా, ప్రపంచంలోనే



ప్రథమ స్థానంలో ఉన్న ఫ్రెంచి గయానాలోని కౌరు రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు కేవలం ఏడు డిగ్రీల అక్షాంశంలోనూ, ఎంతో గొప్పదిగా చెప్పుకునే అమెరికాలోని కేఫ్ కెన్నెడీ రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు 28 డిగ్రీల అక్షాంశంలోనూ ఉండగా శ్రీహరికోట 13డిగ్రీల 43 సెకండ్ల అక్షాంశం మీద ఉంది. భూమధ్య రేఖకు అత్యంత దగ్గరగా ఉన్నకేంద్రాల్లో ప్రపంచంలో రెండోస్థానంలో ఉంది. ఇంకా రాకెట్ ప్రయోగ దిశలో భూభాగాలేవీ లేకపోవడం, ఒకవేళ ప్రయోగమేదైనా విఫలమైనా రాకెట్ శకలాలు సముద్రంలో పడిపోయేందుకు వీలుండడం లాంటి కారణాలు కూడా కలిసి రావడం దీనిప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. 1969 లో శ్రీహరికోట రాకెట్ కేంద్రంగా ఎంపికైంది. ఇక్కడ నుంచి 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ1 రాకెట్ ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్‌ని ప్రయోగించింది. కానీ ఈ ప్రయోగం సఫలం కాలేదు. షార్‌నుంచి ఇస్రో జరిపిన 99ప్రయోగాల్లో 9 మాత్రమే విఫలమయ్యాయి. విజయవంతమైన ప్రయోగాల్లో 129 స్వదేశీ ఉపగ్రహాలను, 433విదేశీ ఉపగ్రహాలను, రెండు ప్రైవేట్ ఉపగ్రహాలను, ఒక గగనయాన్ టెస్ట్ వెహికిల్ డీ వన్, 18స్టూడెంట్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. 2008 లో చంద్రయాన్1 , 2014లో మంగళ్‌యాన్, 2016లో పునర్వినియోగ లాంచి వాహనపు తొలి పరీక్ష, 2016లో ఒకేరాకెట్టుతో 20 ఉపగ్రహాల ప్రయోగం, 2017లో ఒకే రాకెట్టుతో 104 ఉపగ్రహాల ప్రయోగంతో ప్రపంచ రికార్డు, 2017లోజిఎస్‌ఎల్‌వి మార్క్3 ప్రయోగం, 2023లో చంద్రయాన్ 3విజయవంతమయ్యాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన క్రయోజెనిక్ ఇంజను కూడా విజయవంతమైంది. నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టెలేషన్ (ఎన్విఎస్) అనేది భారతదేశ స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్. ఇది మనదేశంలోని వినియోగదారులకు అలాగే భారతభూభాగానికి మించి1500 కి.మీ విస్తరించి ఉన్న ప్రాంతానికి కచ్చితమైనస్థానం, వేగం, సమయ (పివిటి) సేవలను అందించడానికి రూపొందించబడింది. ఇది రెండురకాల సేవలను అందిస్తుంది. అవి ఒకటి స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్ (ఎస్పీఎస్), రెండు రిస్ట్రిక్టెడ్ సర్వీస్ (ఆర్ఎస్). ఎస్పీఎస్ 20 మీటర్ల కంటే మెరుగైన స్థాన ఖచ్చితత్వాన్ని, సేవా ప్రాంతంలో 40నానోసెకెన్‌కంటే మెరుగైన సమయ కచ్చితత్వాన్ని అందిస్తుంది. రెండో తరం ఉపగ్రహాల్లో మొదటిదైన ఎన్వీఎస్01ను 2023 మే 29న జీఎస్ఎల్వీఎఫ్ 12 ద్వారా ప్రయోగించారు. తొలిసారిగా ఎన్వీఎస్01లో స్వదేశీ అణు గడియారాన్ని ప్రయోగించారు. ఎన్వీఎస్ సిరీస్లోని రెండో ఉపగ్రహం ఎన్వీఎస్02ను ఎల్1, ఎల్5, ఎస్‌బ్యాండ్లలో నావిగేషన్ పేలోడ్తో కాన్ఫిగర్ చేయడంతో పాటు సీబ్యాండ్లోని పేలోడ్ను దాని మునుపటి ఎన్వీఎస్01 మాదిరిగానే రూపొందించారు. ఇది 2250 కిలోల లిఫ్టఆఫ్ ద్రవ్యరాశి, 3కిలోవాట్ల పవర్ హ్యాండ్లింగ్‌సామర్థ్యం తోస్టాండర్డ్ 2కె బస్ ప్లాట్ఫామ్ పై కాన్ఫిగర్‌చేయబడింది. ఐఆర్ ఎన్ఎస్ఎస్ 1ఈ స్థానంలో 111.75 డిగ్రీల ఉష్ణోగ్రతను అమర్చనున్నారు. ఎన్వీఎస్02 కచ్చితమైన సమయ అంచనా కోసం స్వదేశీ, సేకరించిన పరమాణు గడియారాల కలయికను ఉపయోగిస్తుంది. ఎన్వీఎస్02 ఉపగ్రహాన్నిఇతర ఉపగ్రహ ఆధారిత వర్క్ సెంటర్ల సహకారంతో యుఆర్ శాటిలైట్ సెంటర్ (యుఆర్ఎస్సి)లో రూపొందించి అభివృద్ధి చేసి, ఇంటిగ్రేట్ చేశారు. ఉపగ్రహం వివిధదశల్లో దాని పనితీరు సమ్మతి సమగ్ర ప్రీషిప్‌మెంట్ సమీక్ష డిసెంబర్ 27, 2024న పూర్తయింది. ఈ ఉపగ్రహాన్ని 2025 జనవరి 05న భారత ప్రయోగ కేంద్రం ఎస్డీఎస్సీ షార్కు పంపారు. ఇది విజయవంతం అయింది. జై భారత్ ! జై భారత్! •

# ట్రంప్ టారిఫ్ ఆంక్షల బెదిరింపులు

బి.మధుపాళి

డెబ్భైఎనిమిదేళ్ల డొనాల్డ్ ట్రంప్ అమెరికా 47వ అధ్యక్ష ఎన్నికల్లో ప్రచారం నుంచి మొదలుకొని జనవరి 20, 2025 రోజుల ప్రమాణ స్వీకారం చేసే వరకు సంచనాలకు తెరలేపుతూనే ఉన్నారు. అమెరికాలో తిష్టవేసిన అక్రమ వలసదారులంటూ కొందరిని గుర్తించి, అమానవీయంగా వారి కాళ్లకు, చేతులకు బేడీలువేసి, అంతర్జాతీయ నేరస్తుల వలె వారివారి దేశాలకు అమెరికన్ మిలటరీ విమానాల్లో తరలించడం లేదా డిపోర్టేషన్ కూడా చూస్తున్నాం. ఏ దేశమైనా తమ పౌరులను వెనక్కి తీసుకోవడానికి నిరాకరిస్తే ఆ దేశాల వస్తు దిగుమతులకు భారీగా టారీఫ్‌లు లేదా సుంకాలు విధిస్తామంటూ ఆంక్షల కొరడాతో తన అతితెలివిని ప్రదర్శించి ఒప్పిస్తున్నారు. అమెరికా ఫస్ట్ అంటూనే యూఎస్‌కు బంగారు భవిష్యత్తు ఇస్తానని, తన దేశ పౌరులను అధిక ధనవంతులుగా మార్చుతానని పలుమార్లు ప్రకటనలు కుమ్మరించారు. కాళ్లకు, చేతులకు బేడీలు వేసి అమానవీయంగా, అమెరికాకు నష్టం కలిగించే అన్ని దేశాల మెడలపై అధిక సుంకాల కత్తులను ఝులుపుతానని, భారత్‌తో సహా ఏ దేశాన్ని వదలనని బెదిరిస్తున్నారు. విదేశీ వస్తు దిగుమతులపై అధిక సుంకాలను విధిస్తూ, అమెరికన్ పౌరులపై పన్నుభారాన్ని పూర్తిగా తగ్గిస్తానని, అసలు ఆదాయ పన్నువిధానాన్ని తొలగిస్తానని తన వీరప్రతాపం చూపిస్తున్నారు. డిపోర్టేషన్ చేస్తున్న సైనిక విమానాలను అనుమతించేది లేదని అడ్డుకునే ప్రయత్నాలుచేస్తున్న బ్రెజిల్,మెక్సికొలంబియా,గ్వాటెమారా, హోండురస్, ఎల్‌సాల్వడార్ లాంటి దేశాలను టారీఫ్ ఆంక్షల బెదిరింపులతో లొంగదీసుకోవడం జరుగుతుంది. చైనా వస్తువులపై కనీసం 10 శాతం సుంకం విధించడంతోపాటు మెక్సికో, కెనడా దిగుమతులపై 25శాతం సుంకాలు విధిస్తామని నిర్ణయించడంతో ట్రంప్ టారీఫ్ సంక్షోభంతో ప్రపంచ దేశాలు గజగజవణుకుతున్నాయి. నిజానికి ఒక దేశ వస్తు దిగుమతులపై విధించే టారీఫ్ లేదా సుంకం అనేది దేశీయ పన్నుగా మాత్రమే పరిగణించబడుతుంది. విదేశాల నుంచి అమెరికాకుచేరే ప్రతి వస్తువుపై దిగుమతి సుంకం లేదా టారీఫ్ అనే పన్నును అమెరికన్ వినియోగదారులు మాత్రమే చెల్లిస్తారని విశ్లేషిస్తున్నారు. అందుకే కాబోలు, అమెరికన్ పౌరులకై పన్నుల భారాన్ని తగ్గించేందుకు సుంకాలను పెంచుతున్నామని ట్రంప్ ప్రకటనలు చేస్తున్నారు. ఉదాహరణకు చైనాలో తయారై అమెరికాకు దిగుమతి అయిన ఒక కారు ఖరీదు 50,000 అయితే దానిపై 12,500 సుంకాన్ని దిగుమతి చేసుకున్న అమెరికన్ కంపెనీ మాత్రమే చెల్లిస్తుందని తెలుసుకోవాలి. ఇదే కారును అమెరికన్ వినియోగదారుడు కనీసం 70,000 చెల్లించి కొనాల్సి వస్తుంది.అనగా 50,000 ఖరీదైన కారును సుంకం విధించడంతో 70,000లకు అమెరికా వినియోగదారుడే కొనడం వల్ల ట్రంప్ పెంచిన టారీఫ్ భారం దిగుమతిచేసిన దేశంపై (చైనా)కాకుండా దిగుమతి చేసుకున్న దేశంపై (అమెరికా) మాత్రమే పడుతుందని గమనించాలి. అనగా ట్రంప్ పెంచనున్నా టారీఫ్ ఆర్థికభారం అమెరికా వినియోగదారులపై మాత్రమే పడడంతో నేటి ట్రంప్ అమెరికన్లపై పన్నుల భారం ఉండదని తన పిడివాదాన్ని వినిపిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ టారీఫ్‌లను పెంచడం వల్ల ఆయా వస్తువుల ధరలు అమెరికాలో చుక్కలను చూస్తాయని, కొన్నవారికి పరోక్షంగా టారీఫ్ ఆర్థికభారం వాతలు పడతాయని హెచ్చరిస్తున్నారు. అమెరికా ఎగుమతి చేసే వస్తువులకు ఆ దేశాలు సుంకాలను పెంచవద్దని, ఆ హక్కు తమకు మాత్రమే ఉందని నేరుగానే ట్రంప్ చెబుతున్నారు. గెలిచినా, ఓడినా తానదే పైచేయిగా ఉండాలనేతత్వం ట్రంప్‌ది మాత్రమేకాదు. అమెరికన్లదికూడా అని గత చరిత్ర రుజువు చేసింది. ప్రస్తుత ట్రంపరితనం చేస్తున్నది. అమెరికన్ డాలర్‌ను అంతర్జాతీయ ద్రవ్యంగా గుర్తించకపోతే లేదా అలాంటి ఆలోచనలు చేస్తే ఆ దేశాల అంతుచూస్తానని ఆర్థికంగా ట్రంప్ ఆవేశపడుతున్నాడు.మేం ఏంచేసినా ప్రపంచదేశాలు తలవంచుకొని వినాల్సిందేఅంటూ ప్రత్యక్షంగానే హెచ్చరిస్తున్నారు. మేధో వలసలతో అన్ని దేశాల నుంచి సర్వోన్నత మేధావులను ఉచితంగా తమ దేశానికి రప్పించుకొని,పౌరసత్వం ఇస్తూ తను అగ్రరాజ్యంగా వెలు గొందుతున్న అమెరికా, ఒకవేళ వారందరినీ డిపోర్టేషన్ చేస్తే ట్రంప్ అమెరికా చుట్టు అజ్ఞానపు చీకట్లు కమ్ముకుంటాయని డొనాల్డ్ మరిచిపోయారు కాబోలు. •

# ఉద్యోగ కల్పనతోనే దేశాభివృద్ధి సాధ్యం

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ప్రజలచే ఎన్నుకున్న మన పాలకులు ప్రజల క్షేమం కోసం పెట్టుబడిదారుల్లాగా ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించి ఉద్యోగ కల్పన కల్పిస్తే అప్పుడు దేశం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది. అయితే మన పాలకులు మేము పాలించే వాళ్లమే కానీ పెట్టుబడిదారుల్లాగా పెట్టుబడులు పెట్టలేమంటారు.డెమోక్రసీ దేశంలో ప్లూటోక్రసీగా మారింది. దీనిని ఆసరాగా చేసుకుని మన కార్పొరేట్లో పెట్టుబడిదారులు ఉద్యోగ కల్పన చేసేందుకు ఎన్ని రాయితీలు కల్పించిన ఉద్యోగ కల్పన అంతంత మాత్రంగానే ఉంది.అంతేకాకుండా పనిచేస్తున్న ఉద్యోగస్తుల పనిగంటలుపెంచి దేశాన్ని అభివృద్ధి చేస్తామని వారివాదన. పెట్టుబడిదారులకు లాభాలు పెరిగేందుకు పని గంటలు పెంచుతారని 150సంవత్సరాల క్రితమే కార్ల్‌మార్క్స్ అన్నారు.యువజనులు సుదీర్ఘ గంటలపాటు చేసే ఉత్పాదక కృషి ఒక వర్తమాన దేశాన్ని ధనిక దేశంగా మారుస్తుందని యువతరం మనసుల్లో నాటుకు నేందుకే వారానికి 70 లేదా 90గంటల పాటు పనిచేయాలని నారాయణమూర్తి సుబ్రహ్మణ్యం చెప్పారు. వారి ఆ వ్యాఖ్యలు నేటి యువతరాన్ని జాతి నిర్మాణానికి పురిగొలిపే పిలుపులు అని భావించవచ్చు కానీ యువత నిరుద్యోగాన్ని తగ్గించేది ఎట్లా? యువతలో నిరుద్యోగత 2011-12లో ఆరుశాతం ఉండగా 2022-23లో 11 శాతానికి పెరిగింది. లక్షల్లో నిరుద్యోగ యువత ఉంటే వేళల్లో కూడా ఉద్యోగాలు నేడు దేశంలో లేవు. ఇక పనిగంటలు పెంచి ఉన్న యువ ఉద్యోగుల ద్వారా పనిచేయిస్తే కొత్తగా ఉద్యోగాలు అసలే ఉండవుకదా? మన యువతకు సాంకేతిక పరిజ్ఞానం లేదని అసలు ఉద్యోగాలు లభించని ఈ రోజుల్లో ఈ ఆలోచన విధానం సరైనదేనా? మరొకవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేడు సాంకేతిక రంగాని శాసించే పరిస్థితి వచ్చింది. యువతకు ఈ సాంకేతిక పరిజ్ఞానం లభించినదే కొత్త ఉద్యోగాలు కల్పనకు. కానీఉన్న ఉద్యోగాలు పోయే పరిస్థితి రాబోయే రోజుల్లో జరుగుతుందని ఈ ఏఐతో 9 కోట్లకు పైగా ఉండే ఉద్యోగాలు పోతాయని, 40శాతం పైగా కంపెనీలు ఉద్యోగులను తగ్గించుకుంటాయని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగులుపై ఈ ప్రభావం ఉంటుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తాజా నివేదిక తెలియజేసింది. ఈ నేపథ్యంలో పని గంటలు పెంచడం నిరుద్యోగాన్ని నిర్మూలించడం ఆర్థిక అభివృద్ధిని సాధించడం అభివృద్ధిబాటలోయువత అడుగులు వేయడం సాధ్యమేనా? ముందుగా యువతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి. నిరుద్యోగంతో విదేశాలకు పోయేవారు 2011నుంచి నేటివరకు 16 లక్షల మంది భారతదేశ పౌరసత్వం వదులుకున్నారు. మరొకవైపు విద్యార్థులు కూడా దేశంలో తగిన విద్యా ఉపాధి సౌకర్యాలు లేక విదేశీ విద్యకు ఉపాధికి పరిగెడుతూ అక్కడే స్థిరపడిపోతున్నారు. 2024 నాటికి భారతీయ విద్యార్థులు 8.5 బిలియన్ డాలర్లకు విదేశీ విద్యపై ఖర్చు పెడుతున్నారంటే మన




దేశం ఎటుపోతున్నది అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి అంటే అందరి వృద్ధి అంతేగాని కొందరి వృద్ధి కాదని గాంధీజీ అన్నారు. దేశ ఆదాయం ఎంత అనేది ముఖ్యం కాదు, ప్రజలకు కనీస అవసరాలు తిండి వసతి విద్యా వైద్యం మేరకు జరుగుతున్నది అనేది ముఖ్యం.దేశ ప్రజల స్వయం పోషకత్వం ఉద్యోగ కల్పనతోనే సాధ్యం. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత ప్రతిష్టంగా ఉందో నిర్ణయించడంలో కీలక అంశం నిరుద్యోగమే. ఉత్పత్తి కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొంటే ఆదాయాలు పెరిగి వస్తు సేవలకు గిరాకీ ఏర్పడి వస్తు సేవల ఉత్పత్తి అవసరం ఇంకాపెరిగే, ఉద్యోగ కల్పన జరిగే అవకాశాలు మెరుగవుతాయి. దేశ భవిష్యత్తు యువశక్తిపై ఆధారపడి ఉంటుందనేది తెలిసిందే. జనాభాలో పని చేసే వయసులో ఉన్న వారి శాతం పెరగడం యువశక్తి పెరుగుదలకు చిహ్నం.ఆర్థికాభివృద్ధిలో క్రియాశీలకంగాపాలు పంచుకునేది దేశాన్ని మునుముందుకు నడిపించేది యువతే. అటువంటిది వారే నిరాశ నిస్పృహలతో పనిపాట లేకుండా ఉంటే ఈదేశానికి దిక్కెవరు? పాలకులు నిరుద్యోగ యువతను నిరక్ష ్యం చేస్తున్నందున యువతి జాతి నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోతున్నారు.అటు ఆర్థికాభివృద్ధికి ఇటు సామాజిక భద్రతకు నష్టం వాటిల్లేది యువతలో అశాంతి హెచ్చరిల్లడం వల్లేకదా? యువకుల్లో 15ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఉద్యోగం కోరుకుంటారు. ఎందుకంటే పేదల ఆస్తి వారి శ్రమే. అయితే శ్రమ ఒకటే సరిపోదు. వృత్తిపరమైన నైపుణ్యం కావాలి. అంతకుముందు అక్షరాస్యత తప్పనిసరి. ఇవి మన యువతకు ఉన్నాయా అంటే లేవనే చెప్పాలి. యువత నైపుణ్యం కొరవడి ఉద్యోగాలు పొందలేకపోతున్నా రని బహుళ జాతి కంపెనీలు, అనేక సర్వేలు చెబుతున్న మాటలు వాస్తవదూరంకాదు.ఇంతవరకు దేశంలో పాలకులు వ్యవహరించే తీరు వలన కోట్ల కొలది యువతి యువకులు నిరాశ నిస్పృహలతో నీరసించిపోతున్నారు.ఇప్పుడు బహుళ జాతి కంపెనీల యజమానులు కూడా పని గంటలు పెంచి ఉన్న ఉద్యోగుల ద్వారా పనిచేయించాలనుకోవడం దీర్ఘంగా ఆలోచించవలసిన అవసరం ఉంది. దీని వల్ల కుటుంబం సమాజం దేశం అశాంతికి గురి కాబడుతున్నది. యువతలో నూతన ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి అలాంటి విధాన కార్యక్రమాలు రూపొందించి చేపడితే పాలకులు త్రికరణ శుద్ధిగా యువతీ యువకులను అధునాతన ప్రపంచంలో మమేకం చేయగలిగితే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కాలాన్ని మించిన వేగంతో యువత పరిగెత్తగలదు. చదివిన చదువుకు సరైన ఉద్యోగం దొరకక కనీస సంపాదనకు సైతం నోచుకోక దుర్భర పరిస్థితిలో మన యువత ఉండటం శోచనీయం. డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న వైనం పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం చాలా వేగంగా అభివృద్ధి చెందడం, జాబ్ మార్కెట్ కూడా సాంకేతిక విద్య అభివృద్ధి చెందడం వలన యువతకు అనుకూలమైన కావలసిన నైపుణ్యాలను కల్పించగలిగితే సాంకేతిక సాధికారికతతో దేశం మెరిసిపోతుంది. మొత్తం శ్రామికులలో కేవలం 4.69శాతం మాత్రమే శ్రామికులకు ఎంతో కొంత నైపుణ్యం కలిగిఉన్నారు.మొత్తం శ్రామికులలో చైనాలు 24శాతం, అమెరికాలో52శాతం,యునైటెడ్ కింగ్డమ్ 68శాతం, జర్మనీలో 75శాతం, జపాన్‌లో 80శాతం, సౌత్ కొరియాలో 96శాతం శ్రామికులకు పూర్తి నైపుణ్యాలతోఆర్థిక అభివృద్ధికి ఆయా దేశాలలో సహాయపడుతున్నారు. నేడు మౌలిక వసతుల కల్పనకోసం ప్రభుత్వాలు భారీగా ఉద్యోగకల్పనతో ఆర్థికాభివృద్ధి జరిగి ప్రజల ఆదాయాలు, డిమాండు

## రాష్ట్ర మంత్రి నారాయణను కలిసిన దర్శి ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ప్రభాతవార్త**

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను మంగళవారం అమరావతిలోని ఆయన ఛాంబర్‌లో టీడీపీ దర్శి ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై, దర్శిలో నిలిచిపోయిన అన్న క్యాంటీన్ సమస్యలు తెలియజేశారు. వెంటనే స్పందించిన మంత్రి దర్శి మున్సిపాలిటీకి కొంత నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభించుటకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన మంత్రికి గొట్టిపాటి లక్ష్మీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైద్యాధికారులతో డియంహెచ్‌ఓ సమీక్షా సమావేశం



**ఒంగోలు టౌన్, జనవరి 29, ప్రభాతవార్త**

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై యుహెచ్‌సి వైద్యాధికారులు, ఎఎన్ఎంలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు సమీక్ష నిర్వహించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ లక్ష్యం అధిగమించేందుకు పరీక్షలు కొనసాగించాలని, ఎన్‌సిడి 3.0 యాప్ ప్రకారం ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో లోపాలు గమనిస్తే సపోర్ట్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. సమావేశంలో ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ భగీరధి పాల్గొన్నారు.

## పెంపుడు జంతువులకు నాణ్యమైన ఫీడ్



**ఒంగోలు టౌన్, జనవరి 29, ప్రభాతవార్త**

మెప్మా పొదుపు సంఘ మహిళ ఎస్‌బిఐ సహకారంతో నెహ్రూ నగర్ వద్ద ఏర్పాటు చేసిన జ్యోతి ఏజెన్సీస్ (పెట్ యానిమల్ ఫీడ్)ను ప్రాజెక్ట్ డైరెక్టర్ తేళ్ళ రవికుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెంపుడు జంతువుల యజమానులు నాణ్యమైన ఫీడ్ కొనుగోలు చేసి పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్,మార్కెటింగ్ అసిస్టెంట్స్ జయకుమార్,సంతోష్‌కుమార్, సిటీ మిషన్ మేనేజర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి గొట్టిపాటిని కలిసి డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు



**ముండ్లమూరు, ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తనకు చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన మంత్రి రవికుమార్‌కు, దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీకి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మోదేపల్లి మేజర్ పరిధిలో చివరి భూములకు సైతం నీరు అందించేలా పని చేసి రైతులు మెప్పు పొందాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కంచుమాటి శ్రీనివాసరావు ఇరువురికి అభినందనలు తెలిపారు.

## ముప్పవారిపాలెంలో పశువులకు వైద్య పరీక్షలు



**చీమకుర్తి, జనవరి 29, ప్రభాతవార్త**

చీమకుర్తి మండలం గోనుగుంట గ్రామ పంచాయతీ పరిధి ముప్ప వారి పాలెం గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగానే 1500 గొర్రెలు మరియు మేకలకు నట్టల నివారణ, 15 దూడలకు, 55 ఆవులకు గేదెలకు నట్టల నివారణ చేయడం జరిగింది. 4 చూడి పరీక్షలు 3 ఎద ఇంజెక్షన్లు 7 ఎదకురాని పశువులకు వైద్యం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక పల్లామల్లి పశు వైద్యాధికారి డాక్టర్ టి మనురూప్, పశుసంవర్థక అసిస్టెంట్స్, పల్లామల్లి పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. రేపు కేవిపాలెంలో ఆరోగ్య శిబిరం వున్నందున ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

## విద్యార్థులు ఉన్నతికి బాటలు వేసుకోవాలి



**చీమకుర్తి, జనవరి 29, ప్రభాతవార్త**

విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదివి, తమ ఉన్నతికి బాటలు వేసుకోవాలని శిద్దా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ప్రముఖ పారిశ్రామిక శిద్దా సుధాకర్ కోరారు. వారి తండ్రి శిద్దా వెంకట సుబ్బారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్ బండ్లమూడి నందు బుధవారం టెన్త్ క్లాస్ పిల్లలకు శిద్దా సుధాకర్ జయలక్ష్మి భారతి దంపతులు జామెంట్రీ బాక్సు, అట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మొత్తం కూడా జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ కాంతారావు, వద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి నూకల సుబ్రహ్మణ్యం, చలవాది వెంకట శివప్రసాద్, ఆలపాటి శ్రీనివాసరావు, మద్ది వెంకట్రావు, స్కూల్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు

## పామూరు మండలంలో త్వరలో వైసీపీ ఖాళీ కానుందా..?

- లక్షలాది వ్యయం చేసుకున్న సీనియర్ నాయకులకు విలువ లేదని ఆవేదన



**పామూరు, జనవరి 29, ప్రభాతవార్త**

పామూరు మండలంలో ప్రతిపక్ష పార్టీలో విభేధాలు పొడచూపుతున్నాయి. త్వరలో పార్టీని వీడి ఇతర పార్టీలో చేరేందుకు పలువురు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. లక్షలాది రూపాయలు ఎలక్షన్‌లో, ఇతరత్ర కార్యక్రమాలకు వ్యయం చేసి ఎంతో కష్టపడినప్పటికి నియోజకవర్గ మండల స్థాయి నాయకత్వం దగ్గర తమకు విలువ లేదంటూ సీనియర్ నాయకులు వాపోతున్నారు. ఎన్నికల ముందు తమకెన్నో ప్రలోభాలు పెట్టినా భవిష్యత్తు రాజకీయాలు మీదేనని తెలుగుదేశం నాయకులు ఇళ్ల చుట్టూ తిరిగినప్పటికి నమ్మిన పార్టీ, సిద్ధాంతాల కోసం వైసీపీని అంటు పెట్టుకుని ఇతరులతో పగ పెంచుకుని సైతం రాజకీయాల్లో కొనసాగామని, ప్రస్తుతం తమకు విలువ లేకపోగా తమపై అబాండాలు వేస్తున్నారని నలుగురు ఐదుగురు ముఖ్య నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బంధువులతోనూ, స్నేహితులతో సైతం అధికార పార్టీ లీడర్లతో సైతం కలిసి తిరగకూడదని ఒక నాయకుడు హుకుం జారీ చేసినట్లు సీనియర్ నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు. వారు చేస్తే ఒప్పు తాము చేస్తే తప్పా అని ప్రశ్నిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఏదైనా కార్యకర్తకు అన్యాయం జరిగితే ప్రశ్నించే నాధుడే లేడని అన్నారు. కార్యకర్తలకు తామున్నామంటూ భరోసా కల్పించే వారు కనుమరుగు అయ్యారని, అందువలన పార్టీ తీవ్రంగా నష్టపోవడమే కాక కోలుకోలేని విధంగా దెబ్బతింటుందని వైసీపీకి చెందిన ముక్య నాయకులు అసంతృప్తి వెలగక్కుతున్నారు. ఇప్పటికే కొందరు నూతన సంవత్సర వేడుకల్లో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి పార్టీని వీడుతున్నట్లు సంకేతాలు అందించారు. అదే విధంగా ప్రతి గ్రామంలో వైసీపీ నాయకులు ఉగ్రకు టచ్‌లో ఉండటం గమనార్హం. ఇప్పటికైనా పార్టీలో జరుగుతున్న అంతర్గత వ్యహారాలను చక్కబెట్టకపోతే వైసీపీ మండలంలో భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని వైసీపీ విశ్లేషకులు అంటున్నారు.

# ప్రకాశం



వార్త తెలుగు జాతీయ దినపత్రిక

## జిల్లా అభివృద్ధి గురించి ప్రస్తావించిన ఎంపి మాగుంట



**ఒంగోలు టౌన్, జనవరి 29, ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి జిల్లా అభివృద్ధిపై పలు అంశాలు ప్రస్తావించారు. జిల్లా కేంద్రంలో సంగీత,నృత్య కళాశాల ఆవశ్యకత,కంభం చెరువు అభివృద్ధితో పాటు చెరువులోని 8 కొండలకు అష్ట దిగ్గజాల పేర్లు పెట్టడం గురించి వివరించారు. ఒంగోలు దగ్గర విమానాశ్రయం ఏర్పాటు ప్రకటన చేసిన ముఖ్యమంత్రికి ,కేంద్ర పౌరవిమానశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

### మోపాడు రిజర్వాయర్

## పటిష్టతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- ఆయకట్టు రైతులకు సకాలంలో నీరందించేలా కృషి చేయాలి
- అనవసరంగా నీరు వదిలితే కఠిన చర్యలు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

**పామూరు, జనవరి 29, ప్రభాతవార్త**

జిల్లాలోనే చెప్పుకోదగిన మోపాడు రిజర్వాయర్ పటిష్టతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. బుధవారం మోపాడు రిజర్వాయర్‌ను స్థానిక ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇరిగేషన్ అధికారులు, టీడీపీ సీనియర్ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీనివాసులు, యారవ ప్రసాద్‌రెడ్డి, సూపర్ చైర్మన్ చెంచుకొండయ్య, మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి రిజర్వాయర్‌ను సందర్శించారు. ఇరిగేషన్ అధికారులను రిజర్వాయర్ సామర్థ్యం, పూర్తి నీటి మట్టం వస్తే ఎన్ని ఎకరాలకు నీరు అందించగలరు తదితర వివరాలను అడిగారు. రూ.34కోట్లతో జరుగుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. లీకేజీ అవుతున్న నీటిని తక్షణమే నిలుపుదల చేయాలని తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి రిజర్వాయర్‌కు





ఘన చరిత్ర ఉందని, అదే విధంగా ఆనాటి బంగ్లా నేటికి చెక్కుచెదరకుండా ఉండటం అప్పటి నిజాయితీకి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. చేపల కోసంచెరువలో నీటిని వదిలారన్న విమర్శలు రాకూడదని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయకట్టు రైతులు సమస్యలపై విన్నవించారు. ప్రత్యేక నిధులు కావాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కలెక్టర్‌ను కోరారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

- తులసిబాబును మూడు రోజులు విచారించిన పోలీసులు
- ఆ ఒక్క ప్రశ్నకు మాత్రమే సమాధానం చెప్పిన తులసిబాబు

**ఒంగోలు, ప్రభాతవార్త**

అప్పటి ఎంపీ, ఇప్పటి ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరిస్తున్న రఘురామకృష్ణమరాజుపై 2021లో జరిగిన హత్యాయత్నంకేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న తులసిబాబు గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. వైసీపీ సానుభూతి పరుడిగా కృష్ణాజిల్లాలో హడావుడి చేసే అతని ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న అతణ్ణి రఘురామకృష్ణమరాజు కేసులో విచారిస్తున్నారు. విచారణలో తులసిబాబు తీరుతో పోలీసులు ప్రస్టేషన్‌కు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్ని ప్రశ్నలు అడిగిన దేనికి సమాధానం చెప్పని అతని తీరు చర్చగా మారింది. బాపట్ల జిల్లాకు చెందిన తులసిబాబు కృష్ణా జిల్లాలో అందులో గుడివాడ రాజకీయాలతో అతడికి ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన నేతలతో తిరిగే అలవాటు ఉన్నతులసిబాబు తీరును ఆరా తీస్తున్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం విచారణ కొనసాగింది. వైద్య పరీక్షలు అనంతరం ఆయనను పోలీసులు గుంటూరు తరలించారు. మూడు రోజుల పాటు తులసిబాబును సుమారు వంద ప్రశ్నలు అడిగారు. ఆయన నుంచి పలు వివరాలు రాబట్టారు. 2021 మే 14నాటి ఎంపీ రఘురామకృష్ణమరాజుపై హత్యాయత్నం కేసులో తులసిబాబు నిందితుడు. రిమాండ్‌లో ఉన్న అతడిని సోమవారం ఉదయం 11గంటలకే కస్టడిలోకి తీసుకున్నారు. హైబీపీ కారణంగా తులసిబాబు ఆ రోజు సాయంత్రం 5.30గంటల వరకు గుంటూరు జీజీహెచ్‌లోనే ఉండటంతో రాత్రి ఒంగోలు తీసుకువచ్చి గంటన్నర పాటు విచారించారు. మంగళవారం ఉదయం 8.56గంటలకే ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్ నుంచి ఎస్పీ కార్యాలయానికి తీసుకొని వెళ్లారు. రోజంతా దర్యాప్తు చేసినట్లు సమాచారం. న్యాయవాది సమక్షంలో సాక్షాలు చూపుతూ ప్రశ్నించడంతో జావాబు చెప్పడానికి తులసిబాబు తడబడినట్లు తెలిసింది. బాపట్ల జిల్లా వాసివి నీకు కృష్ణా జిల్లా గుడివాడ రాజకీయాలకు సంబంధం ఏమిటి..? ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ ప్రజాప్రతినిధులతో అంటకాగుతున్నావు. ప్రభుత్వ కార్యాలయాల్లో తిరుగుతావు. ఏమి లాభం చేకూరుతుంది. ఎవరి అండతో స్థిరాస్థి దందాలు చేశావు. భూ వ్యవహారాల్లో మధ్యవర్తిత్వం వహించడానికి సహకరించిందెవ్వరూ. దుబాయిలో ఏ వ్యాపారాలు ఉన్నాయి. నీవు ఇక్కడే ఉంటూ అక్కడ వాటిని ఎలా నడుపుతున్నావు అంటూ గత రెండు రోజుల విచారణలో తులసిబాబును ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రశ్నించినట్లు తెలిసింది.

ప్రశ్నలు వేసివేసి పోలీసులు అలిసిపోయారే తప్పించి అతని మాత్రం నోరు విప్పలేదని అంటున్నారు. అదే పనిగా ప్రశ్నలు సంధించిన సమాధానం చెప్పని అతను వైసీపీ సర్కారులో సీఐడీకి న్యాయ సలహాదారుగా వ్యవహరించావా అన్న ప్రశ్నకు అవును అనే మాత్రమే బదులిచ్చాడని, మిగిలిన ప్రశ్నలకు ఎలాంటి సమాధానం చెప్పకుండా ఉండిపోయినట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా తాజాగా తులసిబాబు టీడీపీకి చెందిన వ్యక్తిగా ప్రచారం జరుగుతున్న వేళ అలాంటిదేమి లేదంటూ తాజాగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేయడం గమనార్హం. ఈ క్లారిటీ ప్రకటన ఏదో ముందే ఇచ్చి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

## హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలి: మేయర్



**ఒంగోలు, ప్రభాతవార్త**

జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉప రవాణా కమిషనర్ ఆర్ సుశీల ఆధ్వర్యంలో మహిళలచే ద్విచక్ర వాహనము నడుపున్నుడు హెల్మెట్ ధరించుటపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జండా ఊపి ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ మహిళలు ద్విచక్రవాహనము నడుపునప్పుడు హెల్మెట్ ధరించి, రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని, వారి కుటుంబ సభ్యులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలని సూచించారు. ఈ ర్యాలీ కలెక్టర్ ఆఫీస్ సెంటర్ నుండి కోర్టుసెంటర్, పద్మాలయ బేకరిసెంటర్, సాయి బాబా గుడి, కళానికేతన్ సెంటర్, మంగమూరు జంక్షన్, ఎస్పీ ఆఫీస్, అద్దంకి బస్టాండ్, కొత్తపట్నం బస్టాండ్ మీదుగా కలెక్టర్ సెంటర్ వద్దకు చేరుకుని మానవహారం చేయడం జరిగింది. కార్యక్రమంలో మహిళా సబ్‌ఇన్స్‌పెక్టర్లు, కానిస్టేబుల్‌లు, మెప్మా మహిళా ఉద్యోగులు, మహిళా విద్యార్థులు, ఎన్జీవో మహిళా నాయకులు, యంవిఐలు ఏ కిరణ్‌ప్రభాకర్,కె రామచంద్రారావు, ఎల్ సురేంద్ర ప్రసాద్, జి భాస్కరరావు, యు ధర్మేంద్ర, భానుప్రకాష్, ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.



## బంగారు బాల్యంతోనే పిల్లలందరికి భరోసా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

**కనిగిరి, జనవరి 29, ప్రభాతవార్త**






బంగారు బాల్యంతో బాలల హక్కులను పరిరక్షించడానికి, వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించి వారికి సహాయం చేయడానికి సంఘాలు, పాఠశాలలు, స్థానిక పాలన వ్యవస్థలు కలిసి పని చేసే కార్యక్రమం అని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కనిగిరి పట్టణంలో బంగారు బాల్యంపై బుధవారం షాది ఖానా మందిరంలో డివిజన్ స్థాయి ఎంపీడీఓలు, ఎంఈఓ, సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సిబ్బందితో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించి సాధికారిత దిశగా బాలికలను ఎదిగేందుకు కృషి చేయాలని, అందుకే బంగారు బాల్యం కార్యక్రమం రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లాలో బాలికల ఆరోగ్యం, విద్య, సమగ్ర ఎదుగుదలపై దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ బాలల బంగారు భవిష్యత్తు కోసం అధికార యంత్రాంగాన్ని సమన్వయంతో సమర్థంగా నడిపే కలెక్టర్ ప్రకాశం జిల్లాకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. గర్భం దాల్చిన దగ్గర నుంచి ప్రసవం వరకు తల్లీబిడ్డ ఆరోగ్యం, ఆసుపత్రిలో ప్రసవాలు అయ్యేలా చూడటం, నవజాత శిశువులకు అవసరమైన టీకాలు, తల్లిబిడ్డకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, ఆరేళ్ళలోపు పిల్లలకు ఆధార్ కార్డుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలు తదితర అంశాలపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంతో పాటు నియోజకవర్గంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రజాప్రతినిధిగా తన వంతు సహకారం అందిస్తానని, అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆయన చెప్పారు. బాల్య వివాహాలు జరుగుతున్నప్పుడు అడ్డుకోవడం కంటే ఆ ఏర్పాట్లను ముందుగానే నిలువరించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. ఈ దిశగా దృష్టి సారించి పని చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గండ్లూరు కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్పీ సాయి ఈశ్వర్, యశ్వంత్, తహశీల్దార్ ఆకుల వెంకట రవికుమార్, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వైకాపా ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ దివాళా..

- ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఏడాదికి రూ. 71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లింపు భారం లక్షా 40 వేల కోట్లు చెల్లింపు భారంతో వైకాపా ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన 7 నెలల్లో ఆరోగ్య శ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రియంబర్స్ మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ. 22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిఉందన్నారు. అప్పుకుడా పుట్టని స్థితి ఏర్పడిందని, ఏడాదికి రూ. 71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. ఇవి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండల మారిందని ఎమ్మెల్యే జనార్ధన్ సూచించారు. ఇలా మొత్తం జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయి. 1.40 లక్షల కోట్లు ఉన్నవి. ఈ స్థాయిలో గత ప్రభుత్వంలో బకాయిలు పెట్టలేదు. తెచ్చిన అప్పులు ప్రభుత్వం ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలసాలు, జల్సాలకు ఖర్చు చేసిన తినేశారని దామచర్ల జనార్దన్ రావు మండిపడ్డారు. 5 సంవత్సరాలలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్ రెడ్డి 8.లక్షల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. భూకేటాయింపులో గనులు తవ్వకాలు సోలార్ లకు అనుమతులు.. ఇలా ప్రతి దంట్లో ఆశ్రీత పక్షపాతనికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారు. ఆంధ్రప్రదేశ్ గుండెకాయి లాంటి సచివాలయాన్ని కుడా తాకట్టు పెట్టాడు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివటం చూపారు. చివరికి చిన్నారుల పోషణకు పెట్టె చిక్కీలు, కొడుగుడ్లు వంటి వాటిల్లో కుడా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడు అని శాసనసభ్యులు జనార్దన్‌రావు మీడియా తెలియజేసారు.

## ప్రజలకు పథకాలే ముఖ్యం..కారణాలు కాదు..?

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఏపీ సీఎం చంద్రబాబునాయుడు నీతి అయోగ్ ఇచ్చిన రిపోర్టును ప్రజల ముందు పెట్టి పథకాల అమలుకు తాము ఎంత కింద మీద పడుతున్నామో వివరించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల అమలుకు వెసులుబాటు దొరకడం లేదని, దొరికినప్పుడు అమలు చేస్తామని చెప్పారు. ఇదే విషయాన్ని విపక్ష నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పథకాల అమలుపై చంద్రబాబు మోసం చేశారని అంటున్నారు. అయితేటీడీపీ మాత్రం చంద్రబాబు మాటలను వక్రీకరిస్తున్నారని హామీ ఇచ్చిన ప్రకారం ఖచ్చితంగా సూపర్‌సిక్స్ అమలు చేస్తామని చెప్తున్నారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తున్నామని గుర్తుచేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలనలో ఏం జరిగిందో అందరూ చూశారని, ఆ విధ్వంసం కళ్లముందే ఉందని టీడీపీ అధినేత తరచూ చెప్తున్నారు. తాజాగా డేటా రూపంలో బయటపెట్టారు. నీతిఅయోగ్ నివేదిక సాక్ష్యమని ప్రజల ముందు పెట్టారు. ఎంత మందికి అర్థమవుతుందో, ఎంత మంది దానిని పట్టించుకుంటారన్నది పక్కన పెడితే ఓ వాస్తవానికి ప్రజల ముందు ఉంచారు. అయితే చంద్రబాబు ఇప్పుడు ఈ కారణం




చూపి సూపర్‌సిక్స్ విషయంలో వెనకడుగు వేయలేదు. అలా చేస్తే పథకాల విషయంలో మోసం చేశారని వైసీపీకి నేరుగా ప్రజల్లోకి వెళ్లే అవకాశం కల్పించినట్లే అవుతుంది. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి పథకాలకు వచ్చిన నిధులను మళ్లించలేమని చంద్రబాబు స్పష్టం చేశారు. అలాగే అప్పులు చేసి పథకాలు అమలు చేయడం అనే విధానానికి చంద్రబాబు వ్యతిరేకం, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఆస్తులను సృష్టించాలన్నదే ఆయన విధానం. కాని ఇప్పుడు మరో మార్గం లేదు. సూపర్‌సిక్స్‌లో రెండు అత్యంత కీలక పథకాలు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అమలు చేయాల్సి ఉంది. ఈ రెండు పథకాలను ముందుగా అమలు చేస్తే ఇతర వాటి విషయంలో సమయం తీసుకున్న ప్రజలు ఆలోచిస్తారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నక్యాంటీన్లు, గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నారు.జగన్ చేసింది విధ్వంసం కారణంగా ఆ కారణం ఇవ్వలేకపోతున్నామని చెప్పడాన్ని ప్రజలు హర్షించరు. అందుకే చంద్రబాబు అప్పులు చేసైనా ఇస్తామని అంటున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి జగన్ చేసిన అప్పులపై ప్రకటనలు చేసినప్పుడే తెలుగుదేశం పార్టీకి ఒక స్పష్టత ఉంది. అలాంటి సమయంలో పథకాలను ప్రకటించకుండా రాష్ట్రానికి చక్కదిద్దుతామని చెప్పి ఎన్నికలకు వెళ్లాల్సి ఉండగా అలా చెప్పకుండా అప్పుడు మాత్రం సంక్షేమ పథకాలు మాత్రం ఇస్తామని ప్రకటించి ఇప్పుడు ఇవ్వకుండ ఉండటం మంచి నిర్ణయం కాదు. అప్పుడు ప్రజలు ఏమి అర్థం చేసుకున్నారన్న అభిప్రాయం ఉంది. కానీ హామీలు ఇచ్చేశారు. గెలిచారు కాబట్టి ఎలాంటి పరిస్థితులు అయినా అమలు చేయాల్సిందే. చేయలేక పోయామని చెప్తే అది పెద్ద మైనస్ అవుతుంది. ఇది కూటమి ప్రభుత్వం ఆలోచించాల్సిన విషయం ఎంతైనా ఉంది.

## భూ ఆధార్‌తోనే భవిష్యత్‌లో రైతులకు అన్ని పథకాల లబ్ది

### - వ్యవసాయాధికారిని లావణ్య



**అద్దంకి రూరల్ ,జనవరి 29, ప్రభాతవార్త**
రైతులకు అన్ని రాయితీలు,రుణాలు, సంక్షేమ పథకాలు ఇకపై భూఆధార్ తోనే జరుగుతాయని సంతమాగులూరు మండల వ్యవసాయాధికారిని లావణ్య పేర్కొన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం పాతమాగులూరులో రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు భూఆధార్ ఆ్రపదాన్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ భూఆధార్ పొందేందుకు పిబ్రవరి 1 నుండి రైతు సేవాకేంద్రాలలో రైతులు తమ హక్కు పత్రాలు, ఆధార్ కార్డులతో వచ్చి నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతుకు ఒక ప్రత్యేక యునిక్ నంబర్ ఇవ్వడం ద్వారా భూఆధార్ కార్డు జారీ చేయడం జరుగతుందన్నారు. భవిష్యత్ లో వ్యవసాయ రుణాలనుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రైతు ప్రోత్సాహకాలు, ఎరువులు, పీఎం కిసాన్, రైతు భరోసా లాంటి సంక్షేమ పథకాలు, పంటరుణాలు కూడా భూఆధార్ ద్వారానే లావాదేవీలు జరుగుతాయని అంతటి ప్రధాన్యతక కలిగిన భూఆదార్ కోసం రైతులు అందరూ రైతు సేవా కేంద్రాల వద్దకు వచ్చి నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం పంట పొలాల వద్దకు వెళ్లి క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి మొక్క జొన్న పైర్లు సాగు, సస్యరక్షణ, దిగుబడులకు మ్రపభుత్వ మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి లావణ్య సహాయకులు అశోక్ , సర్పంచ్ జిర్రా విజయబాబు, పంచాయితీ కార్యవర్గ సభ్యులు . టీడీపీ జనసేన నాయకులు చల్లా సుబ్బారావు, చల్లా వెంకట క ృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో 439వ రక్తదానం



**అద్దంకి రూరల్ ,జనవరి 29, ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం 439వ రక్తదానం చేశారుజ అద్దంకి పట్టణంలో రక్త హీనతతో బాదపడుతున్న కొత్తమాసు లక్ష్మికోటేశ్వరమ్మ కు వైద్యులు అత్యవసరంగా బి.పాజిటివ్ రక్తం ఎక్కించవలసి ఉందని చెపారు. ఆమె కుటుంభ సభ్యులు రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ వారిని సం ప్రదించగా వారు రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు,పాత బస్టాండ్‌సెంటర్‌లోని చీమకుర్తి వెంకట అజయ్‌బాబును ప్రోత్సహించి రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడ వీరయ్య, చుండూరి మురళి సుధాకరరావు, మాలాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొణిదెన, నక్కబొక్కలపాడులో పశు ఆరోగ్య శిబిరాలు



**బల్లికురవ, జనవరి 29, ప్రభాతవార్త**
మండలంలోని కొణిదెన, నక్కబొక్కల పాడు గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలలో నట్టల నివారణ మందులు 106 దూడలకు, 90 గేదెలకు, 1400 గొర్రెలు, మేకలకు తాపించడం జరిగింది. 29 పశువులకు గర్భకోస వ్యాధులకు చికిత్స అందించారు. 300 గొర్రెలకు బొబ్బ టీకాలు వేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.మహేశ్వరరావు, డాక్టర్ ఆర్.పావని కుమారి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### - పశు సంవర్ధక ఉప సంచాలకులు రాఘవయ్య




**కొనకనమిట్ల, జనవరి 29, ప్రభాతవార్త**
పశు ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు కే.రాఘవయ్య కోరారు. బుధవారం పెద్దారికట్లలో ఫెర్టిలిటీ క్యాంపు, పశు ఆరోగ్య శిబిరంను ప్రారంభించి ఆయన మాట్లాడాఉ. పశువులు వ్యాధుల భారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పశు ఆరోగ్య శిబరాలు ఏర్పాటు చేసిందన్నారు. క్రమం తప్పకుండా గొర్రెలు, మేకలకు టీకాలు వేయించాలని సూచించాఉ. ఈ శిబిరంలో 40 దూడలకు నట్టల నివారణ మందును తాగించారు. 30 గేదెలకు గర్భకోశ చికిత్సలు, 22 గేదెలకు సాధారణ చికిత్సలు చేసినట్లు పెద్దారికట్ల పశువైద్యాధికారి డాక్టర్ కే.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పశు పోషకులు, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

## 3165 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు



**కొనకనమిట్ల, జనవరి 29, ప్రభాతవార్త**
3165 గొర్రెలు, మేకలకు, 21 దూడలకు నట్టల నివారణ మందును తాపించినట్లు గొట్లగట్టు పశువైద్యాధికారి వి.రాజ్యలక్ష్మీ తెలిపారు. బుధవారం కాట్రగుంట గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న పశువులకు మందులు పంపిణీ చేయడం జరిగిందని, పశువులకు చలికాలంలో వచ్చే వ్యాధులు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పశుపోషకులకు గొర్రెల కాపరులకు తెలియజేశారు. గొర్రెల మేకలలో వచ్చే బొబ్బ వ్యాధి టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోంగిటి మిరియమ్మ లేవి, వైస్ ఎంపీపీ గోంగిటి జెనిఫా, కరుణయ్య, మాజీ ఎంపీటీసీ కందేప నాసరయ్య, నాయకులు బాల గురువయ్య, పశుపోషకులు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మీ, పశు వైద్య సహాయకులు అఖిల, బరిగే శ్రీనివాసులు, మేఘవత్ శివాజీ నాయక్, ఆఫీస్ సబార్డినేట్ కాసు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గృహనిర్మాణ సంస్థ మంత్రి పార్ధసారధిని కలిసిన ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం రూరల్, జనవరి 29, ప్రభాతవార్త**
మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అమరావతిలో బుధవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలోని ఇందిరమ్మ ఫేజ్ -1, ఫేజ్ -2 గృహాల సముదాయాలలో మౌలిక సదుపాయాలైన మంచినీరు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ కల్పనకు రూ.33కోట్ల రూపాయల అంచనాలు తయారు చేసి ఇవ్వడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే దీనికి ఆమోదం రానుందన్నారు. 2007 నుంచి మౌలిక వసతులు లేక అసంపూర్తిగా ఉన్న సుమారు 2వేల ఇళ్లను చూసి ఆవేదన చెందిన శాసనసభ్యులు వారికి న్యాయం చేసి అందరూ గృహాలు పూర్తి చేసుకుని నివాసం ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కందుల నారాయణ రెడ్డి ప్రత్యేక చొరవతో సంబంధిత హౌసింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇందిరమ్మ కాలనీలను ఇప్పటికే జిల్లా హౌసింగ్ అధికారులతో, కలెక్టర్, సంబంధిత అధికారులతో పలుమార్లు సందర్శించి లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి వారికి భరోసా కల్పిస్తున్నారు. అందులో భాగంగా మంత్రిని కలవడం జరిగిందని తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుండి మూలనపడిన ఇందిరమ్మ ఫేజ్ -1, ఫేజ్ -2 గృహ సముదాయాలకు మహర్దశ పట్టనుందని లబ్ధిదారులు గంపెడు ఆశతో ఎదురు చూస్తున్నారు.

## తూర్పుగంగవరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



**తాళ్ళూరు, జనవరి 29, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి టి.వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఓపీ విభాగం, ఐపీవిభాగం, డెలివరీ గది పీహెచ్ అన్ని విభాగాలను పరిశీలించి అన్ని భాగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడారు. లేబరేటరీ విభాగంలో ఎన్ని రకాల పరీక్షలు చేస్తారని ల్యాబ్ టెక్నీషియన్ ను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ లేబర్ రూము, ఫార్మసీ వివిధ రకాల విభాగాలను తనిఖీ చేశారు. గర్భిణులకు సంబంధించి జరుగుతున్న రక్త పరీక్షల వివరాలు పీఎంఎస్ఎంఏ పథకం అమలు, రోగులకు అందించే మందుల వివరాలు, పీహెచ్ జరుగుతున్న కాన్పుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు అన్ని పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గర్భం దాల్చిన మొదటి నుంచి మెడికల్ సిబ్బంది పర్యవేక్షణలో ఉండాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే చేయాలని ఆదేశించారు. ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కావలి మౌనిక, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది కే.చంద్రశేఖర్‌బాబు, ఎంపీ రమణమ్మ, వి.సుశీల పాల్గొన్నారు.

## బీసీ, ఈడబ్ల్యూఎస్ రుణాలకు దరఖాస్తులు చేసుకోండి

**జరుగుమల్లి,జనవరి 29, ప్రభాతవార్త**
బీసీ, ఈడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్ కింద 2024-25 సంవత్సరానికి ఓబీఎంఎంఎస్ బ్యాంకు లింక్డ్ స్కీంల ద్వారా స్వయం ఉపాధి కల్పించుటలో భాగంగా ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7వరకు పోర్టల్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని, ఫిబ్రవరి 8 నుంచి 11వ తేదీ వరకు ఎంపీడీఓ లాగిన్ నందు దరఖాస్తులు పరిశీలిస్తారని, కావున లబ్దిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉపాధి పనులలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం

### - ఏపీడీ నిర్మలాదేవి



**పెద్దదోర్నాల, జనవరి 29, ప్రభాతవార్త**
ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని, ఉపాధి పనులలో అవకతవకలకు పాల్పడిన లేదా నిబంధనలను ఉల్లంఘించిన చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ పథకం ఏపీడీ నిర్మలాదేవి అన్నారు. పెద్దదోర్నాల ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాలలోకి వెళ్లి కూలీలతో మాట్లాడి వారి జీవనోపాధులు మెరుగుపరుచుటకు ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందికి సూచించాఉ. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలలోని కూలీలను చైతన్యపరిచి ఉపాధి పనులు కల్పించాలని, వలసలను నివారించాలని సూచించారు. కూలీలు పొలాలలో మిరప కోతలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని పొలాలలో వారికి కూలి వేతనం ఎక్కువగా ఇస్తున్నారని దీంతో కూలీలు ఉపాధి పనులకు రావడం లేదని ఈ సమావేశంలో ఏపీడీ నిర్మలాదేవికి ఉపాధి సిబ్బంది సాకులు చెప్పినట్లుగా తెలుస్తుంది. ఉపాధి పనులకు అవకాశం కల్పిస్తే ఉపాధి పనులు చేసేందుకు కూలీలు ఆసక్తిగా ఉన్నారని విలేకర్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. మిర్చి కోతకు వెళ్లిన కూలీలకు సాయంత్రం వరకు పని చేస్తే యజమాని కూలి వేతనం మూడు వందల రూపాయలు ఇస్తున్నారని, ఉపాధి పనికి ఉదయం వెళ్లి 10గంటల లోపల పని చేసుకుని వస్తే అంతే కూలి పడుతుందని, తర్వాత కూడా ఉపాధి కూలీలు మిర్చి కోత పనులకు వెళ్ళవచ్చునని ఆమె దృష్టికి తెచ్చారు. ఏపీడీ నిర్మాలాదేవి స్పందిస్తూ ఏదీ ఏమైనప్పటికి ఒక కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలని, పని కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అందుకే ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి కూలీలతో చర్చించి చైతన్యపరిచి ఉపాధి కూలి పని కల్పించాలని, వారితో మాట్లాడుతూ ఫొటో కూడా పంపాలని ఆదేశించారు. ఉపాధి పనులలో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తిస్తే సస్పెండ్‌తో పాటు తొలగించడం కూడా జరుగుతుందన్నారు. ఎడవల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో కాకుండా ఫారంఫండ్స్, ఇతర పనులు జేసీబీ యంత్రాలతో పనులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అక్కడ చేసిన పనులను తనిఖీలు నిర్వహించినట్లు ఏపీడీ నిర్మలాదేవి తెలిపారు. తమ తనిఖీలో కూలీలు చేసినట్లు కాకుండా జేసీబీ యంత్రాలతో చేసినట్లుగా అనుమానిస్తున్నామని, ఆ ఫీల్డ్ అసిస్టెంట్ కూలీల మస్టర్ల కూడా తమకు పంపలేదని వివరించారు. తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏపీడీ నిర్మలాదేవి వివరించారు. ఈ సమావేశంలో ఈసీ చాణక్య టెక్నికల్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, నితిన్ భాష, ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఎం 27వ రాష్ట్ర మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ



**హనుమంతునిపాడు, జనవరి 29, ప్రభాతవార్త**
సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలో నెల్లూరు పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్న నేపధ్యంలో గోడ పత్రికను మండల నాయకులు బడుగు వెంకటేశ్వర్లు హనుమంతుని మండల కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం గోడలకు పత్రికలను అంటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాలకు త్యాగాలకు నిస్వార్ధ సేవలకు ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతతో నిజాయితీతో సీపీఎం ముందుండి పోరాటం చేస్తుందని, గత మూడు సంవత్సరాల పోరాటాలకు రూపాలను కార్యచరణ సమీక్షించుకుని నూతన కార్యచరణ సిద్ధం చేస్తున్నట్లు ఈ మహాసభ అందుకు వేదిక కానుంది తెలిపారు. ఈ సందర్భంగా బహిరంగ సభ మూడో తేదీ జరుగుతుందని, ఈ సభకు సీపీఎం పార్టీ అఖిల భారత నాయకులు బ్యూరో సభ్యులు బృందాకర్త్ కామ్రేడ్ బేబి కామ్రేడ్ బీవీ రాఘవులు హాజరవుతారని ఈమె బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనిజయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఏలియా, వెలుగొండయ్య, రాములు, వినయ్, రమణయ్య, ఎస్‌కే కాశీం తదితరులు పాల్గొన్నారు.

## చింతగుంపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**చిన్నగంజాం, జనవరి 29, ప్రభాతవార్త**
విత్తనాల ద్వారా ఆశించే పురుగులు, తెగుళ్ళను నివారించుటకు అదే విధంగా మొలకదశలో నేలలో ఉండే కీటకాలు, శిలీంద్రాల నుంచి విత్తనాలను కాపాడుటకు విత్తనాలను సరైన పద్దతిలో విత్తన శుద్ధి చేయాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి, డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఉష రైతులకు తెలిపారు. మండలంలోని చింతగుంపల్లి గ్రామంలో బుధవారం మండల ఏవో కే.భాస్కరరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి, డాట్‌స ఎంటర్ శాస్త్రవేత్త ఉష హాజరై శనగ పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ శనగ పంటలో వచ్చు ఎండు తెగులును పంట మార్పిడి పద్ధతి ద్వారా నివారించవచ్చని తెలియజేశారు. అలాగే విత్తు దశలో ఆశించే పురుగులు, శిలీంద్రాల తెగుళ్లను నివారించుటకు ట్రకోడెర్మా విరిడితో విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కే.భాస్కరరావు, సర్పంచ్ యార్లగడ్డ నారాయణ, వీఏఏ సంధ్య, రైతులు పాల్గొన్నారు.

## భూమిలో పోషకాల విలువలు పెరిగే పైర్లు సాగుచేసుకోవాలి

### - ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు



**మార్కాపురం రూరల్, జనవరి 29, ప్రభాతవార్త**
రైతులు భూమిలో పోషకాల విలువలు పెంచే పైర్లను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొండేపల్లి, భూపతిపల్లి గ్రామాలలో ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరిగ, మిరప పంటలను పరిశీలించి రైతులు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అనంతరం కొండేపల్లి, భూపతిపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి రాబోయే తొలకరి తరువాత పచ్చిరొట్ట పైర్లు అయిన జీలుగ,జనుము, పిల్లిపెసర వంటి పైర్లు వేసుకోవడం ద్వారా భూమిలో పోషకాలవిలువలు పెరుగుతాయని తెలిపారు. అలాగే ప్రస్తుతం చిరు ధాన్యాల వలన మంచి ఆరోగ్యంతోపాటు వాటికి మద్దతు ధర కూడా పెరుగుతుందని, దీని వలన రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుందని తెలిపారు. కావున రైతులు చిరు ధాన్యాలు అయిన సజ్జలు, కొర్రలు, రాగులు, వరిగలు వంటి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండేపల్లి, భూపతిపల్లి గ్రామాల రైతు సేవాకేంద్రాల సిబ్బంది హైమావతి, రమణి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి ఆదేశాలను అమలుపరచని పంచాయితీలు

### - ప్రాణాంతకమైన మొక్కలతో ప్రజలు ఇక్కట్లు





**యర్రగొండపాలెం రూరల్, జనవరి 29, ప్రభాతవార్త**
చెట్లు ప్రగతికి మెట్లు అని చదువుకున్నాం. ఆక్సిజన్ ప్రసాదించే మహా ప్రసాదాలు అని పొగుడుకున్నాం. కానీ ఈ చెట్లు మానవుల మనుగడకే ఎసరు పెట్టేలా ఉందంటూ ఇప్పుడు వింటున్నాం.. యర్రగొండపాలెం పంచాయితీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో పంచాయితీ నిధులలో నుంచి లక్షలకు లక్షల రూపాయలు తగలేసి నర్సరీల నుంచి ఈ విషపు మొక్కను కొనుగోలు చేసి సంబంధిత అధికారులు తీసుకొచ్చారు. ఆ మొక్కలను పట్టణంలోని జాతీయ రహదారి డివైడర్లలో నాటారు. వాటిని బతికించడం కోసం ఖర్చుచేసి నీళ్ళ ట్యాంకర్లతో డివైడర్లలోని ఆ మొక్కలకు నీళ్ళను పోసి పెంచారు. 5ఏళ్ళ ప్రభుత్వ కాల పరిధిలో అవి ఏపుగా పెరిగి చెట్టుగా మారాయి. ప్రస్తుతం ఆ చెట్టు డేంజర్ గంటలు మ్రోగిస్తున్నాయంటే నమ్మశక్యంగా లేదు. ఆ చెట్టే డేంజర్ అనుకుంటే ఆ డివైడర్లలో ఏపుగా పెరిగి పట్టణంలోని జాతీయ రహదారి వచ్చిపోయే వాహనాలతో మలుపులవద్ద ప్రమాద ఘంటికలను మ్రోగిస్తుంది.

### పర్యావరణానికి హాని చేస్తున్న కోనోకార్పస్ చెట్లు :



పర్యావరణానికి హాని చేస్తూ మనుషుల ప్రాణాలను హరించే చెట్లు కూడా ఉన్నాయని కోనోకార్పస్ చెట్లు రుజువు చేస్తున్నాయి. వీటిపై పరిశోధన చేసిన శాస్త్రవేత్తలు చెబుతున్న మాటలు వింటుంటే ఈ చెట్లు చేసే చేటు విస్తు గొలుపుతున్నాయి. ఆ చెట్లు ఉన్నచోటు పర్యావరణం నాశనం అవుతుందని తెలుస్తుంది. ఈ చెట్లపై పక్షులు కూడా వాలవని చెబుతుంటే వాటితో పట్టణ ప్రజలు సహజీవనం చేస్తున్న తీరు భయం గొలపక మానదు. యర్రగొండపాలెం మేజర్ పంచాయితీలో రోడ్లపై చెట్లు అందంగా ఉండాలనే ఉద్దేశ్యంతో డివైడర్లు, ఫుట్‌పాత్‌లపైన ఈ మొక్కలను నాటారు. అవి ఇప్పు ఏపుగా పెరిగి చెట్లుగా మారి మానులుగా రూపుదిద్దుకొని భయం గొలిపేవిధంగా డివైడర్ల మీద దర్శణమిస్తున్నాయి. ప్రాణాంతకమైన కోనోకార్పస్ మొక్కలను తొలగించమని సాక్షాత్తు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన శాఖలో భాగమైన పంచాయితీలకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ పంచాయితీ అధికారులు పవన్ కళ్యాణ్ ఆదేశాలను పాటించకపోవడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పలు స్వచ్ఛధ సంస్థల వారు, నిరసనలు తెలిపినా యర్రగొండపాలెం ప్రెస్‌క్లబ్ అసోసియేషన్ తరపున విన్నపాలు సమర్పించినా పంచాయితీ అధికారులు ఆలకించడం లేదని తెలుస్తుంది. ఏది ఏమైనా కోనోకార్పస్ చెట్లు పర్యావరణానికి హానికరమనే విషయాన్ని అధికారులు ఎప్పుడు గ్రహిస్తారో వేచిచూడాలి.

## ఘనంగా చొల్లంగి అమావాస్య వేడుక



**బల్లికురవ, జనవరి 29, ప్రభాతవార్త**
పుష్య మాసంలో జరుపుకునే చొల్లంగి అమావాస్య వేడుక అత్యంత మహిమా న్వితమైనది. పుష్య మాసంలో వచ్చే ఆఖరి రోజు అమావాస్య చొల్లంగి అమావాస్య దీని ప్రత్యేకత భూమి మీద విష్ణుమూర్తి వైద్య వీర రాఘవ స్వామిగా అవతరించిన దినం. త్రిసామా సామగ: సామ నిర్వాణం భేషణం భిషక్..? విష్ణు సహస్రనామం లోని నామాన్ని నిరూపించడం కొరకు విష్ణుమూర్తి వైద్య వీర రాఘవ స్వామిగా భూమి మీద అవతరించారు. ఈ రోజు రోగ హరణ శక్తి గల రోజు. ఈ మూడు పనులతో ఎవరైతే వైద్య వీర రాఘవస్వామిని ఆరాధిస్తారో వారి యొక్క అన్ని రోగాలు హరించి పోతాయి అని ప్రతీతి. వైద్య వీర రాఘవ స్వామి ఫొటోను ప్రత్యేక దీపంతో స్వామిని ఆరాధించారు. ఒక ప్లేట్లో బియ్య పిండి పంచదార పొడి సమానంగా తీసుకు కలిపి కొద్దిగా ఏలకపొడి కలిపి మధ్యలో గుంతలా చేసి ఆవు నేతితో తడిపిన పువ్వొత్తి వేసి వెలిగించి భక్తులు తమ యొక్క రోగా హరణ చేయమని ప్రార్థించారు. ఇంట్లో ఎవరికైనా ఇంట్లో ఎవరికైనా దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న ఎడల వారికి ఒక వెండి తీగ కడియం తీసుకువచ్చి స్వామివారి పూజలో ఉంచి మాకు కాని మీ దయవలన స్వస్థత చేకూర్తే తిరువళ్లూరు వచ్చి మీ హుండీలో ఆ కడియం వేస్తామని సంకల్పం చెప్పుకోవాలి. మీ ఇంటి దగ్గర మీ ఇంటి దగ్గర ఏదైనా కోనేరు గాని చెరువు గాని బావి గాని ఉంటే ఇంటిళ్ల పాది ప్రతి ఒక్కరు చిన్న బెల్లం ముక్క అందులో వేసి దాని చుట్టూ ప్రదక్షణ చేసి తిరువళ్లూరు లోని పుష్కరిణి హృత్ పాపనాసినిలో స్నానం చేస్తూ ప్రదక్షిణ చేస్తున్నాం అని తలచుకోవాలి. ఈ విధమైన ఆచార వ్యవహారాలు తెలిసిన తిరువళ్లూరు వైద్య వీర రాఘవస్వామి భక్తులు వెంకటేశ్వరస్వామి ఆలయాలలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను నయనానందకరంగా అలంకరించారు.

## 'ఘాటు' తగ్గిన మిర్చి - నిరాశలో మిర్చి రైతులు

### - ధరలు ఇంకా పెరుగుతాయనే ఆశతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వలు

### - కూలీలకు డబ్బులు ఇవ్వలేని దుస్థితిలో మిర్చి రైతన్నలు



**త్రిపురాంతకం, జనవరి 29 ప్రభాతవార్త**
మిర్చి ధర రోజురోజుకు తగ్గుతుండడంతో అమ్మబోతే అడవి ... కొనబోతే కొరివి... అన్న చందంగా మారింది మిర్చి రైతున్నల పరిస్థితి. మార్కెట్‌లో మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయని కోటి ఆశలతో పంటను అమ్ముకునేందుకు వచ్చిన మిర్చి రైతులు చివరికి నిరాశే మిగులుతుంది. పంట రానంతవరకు ఊరించిన మద్దతు ధర పంట చేతికంది వచ్చేసరికి ధర అమాంతంగా తగ్గుతుంది. దీనికి కారణం దళారి వ్యవస్థ ? లేకా కొనుగోలుదారులు లేకపోవడమా ? ఏమిటి ఈ ఆంతర్యం అని ఏమీ అర్ధంకాని పరిస్థితుల్లో రైతన్నలు ఆలోచనలో పడ్డారు. ప్రస్తుతం ఎర్ర బంగారం ధరలు నేల చూపులు చూస్తుండడంతో రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

### అమాంతంగా పడిపోయిన మిర్చి ధరలు :



మిర్చి ధరలు అమాంతంగా పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. నెలరోజుల వ్యవధిలోనే క్వింటా ధర రూ.5వేలకు పైగానే తగ్గింది. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు ఆశాజనకంగా ధరలు ఉండడంతో భవిష్యత్తులో ఇంకా పెరుగుతాయనే ఆశతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది సాగు చేసిన మిర్చి పొలాల్లో కాక కోతకు రావడం, ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అసలే మిర్చి పంట సాగు చేయడానికి పెట్టుబడి భారీగా వెచ్చించాల్సి వస్తుంది. అయినప్పటికీ రైతన్నలు సాహసోపేతం చేసి పంటను సాగు చేసినప్పటికీ తీరా పంట కోతకు వస్తున్న సమయంలో ధర తగ్గుముఖం పట్టడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది తేజా డీలక్స్ అనే రకం క్వింటా ధర రూ.21వేల వరకు పలికింది. నెలరోజులుగా మిర్చి ధరలు రూ.5వేల నుండి రూ.6వేలవరకు దిగజారాయి. ఒక్కసారిగా ధర తగ్గడంతో ప్రస్తుతం మిర్చి రైతులు కూలీలకు డబ్బులు ఇవ్వలేని దుస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది. కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్న తేజా రకం 341 రకం ధరలు రూ.11వేల నుంచి రూ.13వేల ధర మాత్రమే పలుకుతుంది. ఆరుమూరు బేడిగ రూ.10వేల నుండి రూ.12వేలు, సీడ్ రకాలు రూ.8వేల నుండి రూ.10వేల వరకు ధరలు పలుకుతున్నాయి. ధరలు పూర్తిగా దిగజారడంతో గతంలో స్టోరేజ్‌లో సరుకు నిల్వ చేసిన రైతులతోపాటు ఈఏడాది మిర్చి సాగుచేసునతన్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పులు తెచ్చి శ్రమించి మిర్చి సాగు చేసిన రైతులు రోజురోజుకు పతనమవుతున్న ధరలను చూసి ఆందోళన చెందుతున్నారు. పంపై తెచ్చిన అప్పులు తీర్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

### గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం అంతా నష్టమే :

మిర్చి ధర గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం భారీగా తగ్గడంతో నష్టం ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేసునతన్నారు. గత ఏడాది మిర్చికి డిమాండ్ ఉండడతో రైతులు ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచారు. మిర్చికి మంచి ధర వస్తే నాలుగు రూపాయలు మిగులుతాయని ఆశించి పెట్టుబడికోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేశారు. ప్రకృతి ఒడిదుడుకులను ఎదుర్కొని పంటలను సాగుచేస్తే చివరికి నష్టాల ఘాటు మిగులుతోంది. సీజన్‌లో ఆశాజనకంగా ఉన్న మిర్చి ధరలు వేసవి సెలవుల అనంతరం నేలచూపు చూస్తున్నాయి. అటు వ్యాపారులు, ఇటు రైతులు ఊహించని విధంగా ధరలు తగ్గుతున్నాయి. విదేశాలతోపాటు దేశీయంగానూ ఎగుమతులు నిలిచిపోవడంతో ఆ ప్రభావం మిర్చి ధరలపై పడింది. ఫలితంగా క్రయవిక్రయాలు మందగిస్తున్నాయి. ధరలు తగ్గుముఖం పడుతుండడంతో రైతులు వేచిచూసే ధోరణిని అవలంభిస్తున్నారు.

## ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా మాదిగ మేధావుల సదస్సు కరపత్రం విడుదల



**యర్రగొండపాలెంరూరల్, జనవరి 29 ,ప్రభాతవార్త**
మాదిగ మేధావుల సదస్సు కరపత్రాన్ని యర్రగొండపాలెం పట్టణంలోని పంచాయితీ కార్యాలయ ఆవరణంలో బుధవారం మాదిగ మేధావుల ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు తిరుమలయ్య మాదిగ, ఎంఆర్‌పిఎస్ వినయ్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు చేదూరి అశోక్ మాదిగలు ముఖ్య అతిధిగా పాల్గొని కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును అమలు పరచాలని డిమాండ్ చేశారు. మాదిగలకు న్యాయమైన డిమాండ్ అయిన 15శాతం రిజర్వేషన్ సాధనకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారని తెలిపారు. మాదిగ మేధావుల సదస్సు కొనసాగిస్తున్న ఈ తరుణంలో జాతి అస్తిత్వం ఉద్యమంలో జాతి బిడ్డలు అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 4వ తేదీన యర్రగొండపాలెం అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించే మాదిగ సంఘాల నియోజకవర్గ సదస్సు కార్యక్రమాన్ని మాదిగలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీటర్ మాదిగ, సింగా ప్రసాద్ మాదిగ, కొర్రపోలు వేస్లీ మాదిగ, రాచేటి ప్రసాద్ మాదిగ, కొండయ్య మాదిగ, రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**మద్దిపాడు, జనవరి 29, ప్రభాతవార్త**
మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో వేచి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు వాసవి అన్నదాన సత్రం నందు శుక్రవారం నాడు నిర్వహించనున్నట్లు మద్దిపాడు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిన్ని అమర్నాథ్ తెలియజేశారు. ప్రత్యేక పూజల నందు ముందుగా గణపతి పూజ, అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన అనంతరం అన్నదాన కార్యక్రమం, కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొనాలని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం వాసవి అన్నదాన సత్రం నందు మద్దిపాడు మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించినట్లు ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట హనుమంతరావు ఓ ప్రకటనలో తెలిపారు.

## ఏలూరులో పశు ఆరోగ్య శిబిరం



**కొనకనమిట్ల, జనవరి 29, ప్రభాతవార్త**
పొదిలి మండలం ఏలూరులో బుధవారం పశు ఆరోగ్య శిబిరాన్ని ఉన్న గురవాయపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల్లో బొబ్బ నివారణ టీకాలు వేయడం దూడలకు చూడి పరీక్షలు చేయడం జరిగిందన్నారు .అనారోగ్యాని కి గురైన పశువులను, తిరగకట్టే పశులను పరీక్షించి తగు వైద్యం నిర్వహించారు. గొర్రెలు, మేకలకు, దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది, పశు పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో పని దినాలను తప్పక పూర్తి చేయాలి

### - డ్వామా పీడీ జోసఫ్ కుమార్



**మద్దిపాడు, జనవరి 29, (ప్రభాతవార్త**

ప్రతి గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్ టార్గెట్ ప్రకారం పని దినాలు ఏర్పాటు చేయకపోతే ఇంటికి వెళ్లిపోవచ్చని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిపై మండిపడ్డారు. బుధవారం మండల సమావేశం మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పని దినాలు తక్కువగా ఉండటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో కేవలం 360 పనిదినాలు మాత్రమే నడుస్తుండటంతో కనీసం వెయ్యి పని దినాలు గురువారం నుండి కల్పించాలని వారం తర్వాత 2000 దినాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఒక్కొక్కరు 2వేల పని దినాలు కల్పించాల్సి ఉంటుందని కానీ మద్దిపాడులో ఆ విధంగా లేనందున టెక్నికల్ అసిస్టెంట్లు బదిలీపై పశ్చిమ ప్రాంతానికి వెళ్లి అక్కడ పనులు చేయించాలని అన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు కూడా సవ్యంగా పని చేయాలని లేదంటే ఒకరిని మద్దిపాడు నుంచి బదిలీ చేస్తామని అన్నారు. టెక్నికల్ సమస్యలు పరిష్కరించుకోకుండా పనులు పెండింగ్ పెడితే పని దినాలు కల్పించలేమని కంప్యూటర్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు ఉన్న టార్గెట్లను పూర్తి చేయలేకపోతే జారీ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ వి.జ్యోతి, ఏపీడీ వెంకటస్వామి, ఏపీవో ధనుంజయ, టెక్నికల్ ఇంజనీర్ కిషోర్ కుమార్, ఫీల్డ్అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నందిపాడు మాజీ సర్పంచ్ మండవ వెంకటాద్రి కన్నుమూత

**మద్దిపాడు, జనవరి 29, (ప్రభాతవార్త**

నందిపాడు మాజీ సర్పంచ్ మండువ వెంకటాద్రి బుధవారం ఉదయం తుది శ్వాస విడిచారు. గత 30 సంవత్సరాలు సర్పంచ్‌గా విధులు నిర్వహించారు. నందిపాడు గ్రామ అభివృద్ధికి మండవ వెంకటాద్రి కృషి చేశారు. ఆయన గత నాలుగు రోజుల నుండి ఆరోగ్యం సహకరించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణ వార్త తెలియడంతో పొగాకు బోర్డు ఎక్స్టెన్షన్ మేనేజర్ మారెళ్ళ మారుతీరావు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంతిబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మండవ రంగారావు మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు.

## బొల్లాపల్లి, తాటివారిపాలెంలో పొలం పిలుస్తోంది



**మార్టూరు, జనవరి 29, (ప్రభాతవార్త**

మార్టూరు మండలంలోని బొల్లాపల్లి, తాటివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.అంజిరెడ్డి శనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రస్తుతం శనగ పంటలో చివరి దశలో మెట్టకు వచ్చి తొలుగింజ ఏర్పడే అవకాశం ఉన్నందున పొటాషియం నైట్రేట్ ఎకరాకు 1 కిలో పిచికారి చేసుకోవాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శ్రీచైతన్య, రైతు సంఘం నాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా కొట్టి యువకుడి దుర్మరణం

### - ఏల్చూరులో విషాదఛాయలు





**సంతమాగులూరు,జనవరి 29, (ప్రభాతవార్త**

గ్రానైట్ ముడి(వేస్ట్)రాళ్లతో వెళ్తున్న ట్రాక్టర్, ప్రమాదవశాత్తు ట్రక్కు కింద పడి యువకుడు దుర్మరణం చెందిన సంఘటన పల్నాడు జిల్లా శ్యావల్యాపురం మండలం గంటవారిపాలెం వద్ద బుధవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన బండారు ఫణీంద్ర(25) సంతమాగులూరు మండలంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో వేస్ట్ రాయిని ట్రాక్టర్‌పై లోడు చేసుకుని శావల్యాపురం వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో గంటవారిపాలెం దాటిన తర్వాత ట్రాక్టర్ ఇంజిన్ ముందు టైరు ఒక్క సారిగా పేలి, రోడ్డుకు కుడి వైపు పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఆందోళన చెందిన ఫణీంద్ర, స్టీరింగ్ వదిలేసి కిందకు దూకాడు. అదే సమయంలో ట్రక్కు పక్కకు ఒరిగిపోయి బోల్తా పడింది. ట్రక్కు పక్కనే ఉన్న ఫణీంద్ర ప్రమాదవశాత్తు దానికింద పడిపోయాడు. ట్రక్కులోని రాళ్ల అతనిపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా ప్రయాణిస్తున్న కూలీలు, వాహన చోదకులు హుటాహుటీన ప్రమాదస్థలికి వెళ్లి అతికష్టం మీద ట్రక్కును పైకి లేపారు. రాళ్లను తొలగించి చూడగా, ఫణీంద్ర విగతజీవిగా పడి ఉన్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**ఏల్చూరులో విషాదఛాయలు :**

ఫణీంద్ర మృతి పట్ల ఏల్చూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని తల్లిదండ్రులు పెద్ద వీరయ్య నాగమ్మ, భార్య, బంధువులు, సన్నిహితులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏడాది క్రితమే ఫణీంద్రకు వివాహమైనట్లు సమాచారం.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎండాకాలం సెలవులు



**అర్ధవీడు, జనవరి 29, (ప్రభాతవార్త**

అర్ధవీడు మండలంలోని యాచవరం గ్రామంలో చెంచు కాలనీకి సంబంధించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎండాకాలం సెలవులు మొదలయ్యాయి. దేశ ప్రధానమంత్రి చెంచు గిరిజనుల అభివృద్ధి కోసం జనజాతి ఆదివాసి అభియాన్ అనే పథకాలను పెట్టి చెంచు గిరిజనుల అభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికి అర్ధవీడు మండలంలోని యాచవరం గ్రామంలో గల చెంచు కాలనీకి నియమించినటువంటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లేక రాక పాటశాలకు తాళం వేసి ఉంది. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఇప్పటికైనా చెంచు కాలనీపై ప్రత్యేక దృష్టి సారించి వారి పిల్లలను చదువే ఆయుధంగా మలిచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని యాచవరం గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలి



**వెలిగండ్ల, జనవరి 29, (ప్రభాతవార్త**

వెలిగండ్ల మండలంలోని హుస్సేన్ పురం, కొటాలపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారి పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రంగకృష్ణ వరి, కంది, అలసంద పంటలలో సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కంది పంటలలో మారుకా మచ్చల పురుగు పూతను, పిందెలను, కాయలను అన్నింటిని గూడు చేసి గూడు లోపలే ఉంటూ విత్తనాలను తిని డొల్లచేస్తుందన్నారు. వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. త్వరలో ప్రతి రైతు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని, ఇందుకు కావాల్సిన డాక్యుమెంట్స్‌ని తీసుకుని తమ వీఏఏలని సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ నెంబరును పీఎం కిసాన్‌కు త్వరలో లింక్ చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం విజయవంతం చేయాలి



**యర్రగొండపాలెం,జనవరి29,(ప్రభాతవార్త**

యర్రగొండపాలెం మండంలోని గంజివారిపల్లె, వెంకటాద్రిపాలెం, గ్రామాలల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వాహించారు. ముందుగా రైతులతో కలిసి అధికారులు సాగుచేసిన పంటపోలాలను కంది,పొగాకు పంటలను పరిశీలించారు.అనంతరం రైతు సేవ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో మండల వ్యవసాయదికారి కె.వి.శేషారెడ్డి హజరైనారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో పంటలు వేసిన ప్రతి ఒక్క రైతు సోదరులు ఈ క్రాప్ నందు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.ఆదేవిదంగా ఖరీఫ్ లో కంది పంట వేసిన రైతులు మీ గ్రామల్లో ఉన్న రైతు సేవ సిబ్బంది ద్వారా ఆన్లైన్లో నమోదు చేయించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి యాల్.మాల్యాద్రిరెడ్డి,రైతుసేవ కేంద్ర సిబ్బంది మీరావలి,శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాదారుల చెరల నుండి చెరువును రక్షించండి

### - ఎమ్మెల్యేను కోరిన 9వ వార్డు ప్రజలు



**మార్కాపురం, జనవరి 29, (ప్రభాతవార్త**

కబ్జాదారుల చెరల నుండి మార్కాపురం చెరువును రక్షించాలని మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డు ప్రజలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కలిసి విన్నవించారు. మన ఊరు మన ఎమ్మెల్యే కార్యక్రమం బుధవారం ఉదయం తొమ్మిదో వార్డులో జరిగింది. ఈ కార్యక్రమానికి వార్డు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మార్కాపురం చెరువు శివారు ప్రాంతంతో పాటు చెరువు కట్ట ప్రాంతాన్ని ఆక్రమణదారులు సొంతం చేసుకున్నారని కట్టపై నడిచేందుకు కూడా వీలు లేకుండా పోయిందని వారు పేర్కొన్నారు. వార్డులో డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని, ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్లలో గల వ్యర్థపు నీరు రోడ్లపైకి విస్తరించి దుర్వాసన వెదజల్లుతూ ఉంటుందని, ఆర్టీసీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన పరిష్కార దిశగా వారి చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సీసీ రోడ్ల నిర్మాణం కూడా అంతంతమాత్రంగానే ఉన్న అందని అంతర్గత రహదారులన్నింటికి సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరారు. ఉన్న సీసీ రోడ్లపై లేయర్ వేయడంతో రోడ్డు ఎత్తు పెరిగి డ్రైనేజీలో మురుగు కాలువ పారుదలకు ఇబ్బందిగా మారిందని ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రజలు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారం కోసం ఎప్పుడైనా తన వద్దకు రావచ్చునని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యను ప్రతి ఒక్కటి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చెరువు కట్టతో పాటు చెరువు శివారు ప్రాంతాలలో జరిగిన ఆక్రమణల విషయాన్ని విచారణ జరిపిస్తానని కాలిబాటకు మార్గం సులువు చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని భరోసా కల్పిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నారాయణరావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు డాక్టర మౌలాలి, వార్డు ఇన్‌ఛార్జ్ పఠాన్ ఇబ్రహీం ఖాన్, నాగూర్ వలి, ఖాన్, సయ్యద్ వలి, శేఖర్ నాయుడు, మున్సిపాలిటీ వివిధ శాఖల అధికారులు టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

### - మంత్రి పార్థసారధిని కలిసిన ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం, జనవరి 29, (ప్రభాతవార్త**

ఇందిమ్మ గృహాల అభివృద్ధికి సహకారం అందించి తగిన నిధులు మంజూరు చేయాలని కోరుతూ మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి బుధవారం అమరావతిలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని కలిసి విన్నవించారు. ఇందిరమ్మ ఫేజ్-1, ఫేజ్-2, గృహాల సముదాయాలలో తాగునీరు రహదారులు డ్రైనేజీ, విద్యుత్ కల్పన, ఇలాంటి మౌలిక సదుపాయాల కోసం 33 కోట్ల రూపాయలతో అంచనాలను తయారు చేసి మంత్రికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న ఇందిరమ్మ వన్, ఇందిరమ్మ టూ గృహ సముదాయాలకు త్వరలోనే మహర్దశ కలిగిందని అన్నారు. ఇటీవల కాలంలో సంబంధిత కాలనీలను సందర్శించి అక్కడి పరిస్థితులను గమనించడం జరిగిందని ప్రజల నుండి కూడా సమస్యలను అడిగి తెలుసుకుని విషయాన్ని మంత్రికి తెలపడం జరిగిందన్నారు. త్వరలోనే ఇచ్చిన అంచనాలకు ఆమోదం రానుందని ఎమ్మెల్యే తెలిపారు.

## రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### - ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం, జనవరి 29, (ప్రభాతవార్త**

రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకల గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఫిబ్రవరి 4వ తేదీన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారి రథసప్తమి వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఆయన దేవస్థానం కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. రథసప్తమి నాడు వాహనాల ఉత్సవం అట్టహాసంగా నిర్వహించడం జరుగుతుందని, గతంలో కన్నా వినూత్నంగా మిన్నగా వేడుకలను నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వెండి రథోత్సవం మార్కాపురం పట్టణానికి తలమానికమని, వీక్షించేందుకు చుట్టు పక్క ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని కనుక ఎక్కడ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉత్సవం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు యక్కలి కాశీ విశ్వనాథం, అప్పన ఆచార్యులు, ఎం.వెంకటరెడ్డి, మల్లిఖార్జున, సత్యనారాయణ, అల్లంపల్లిలతో పాటు పలువురు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుండి సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

### - ఎంపీడీఓ మహబూబ్ భాషా



**వెలిగండ్ల, జనవరి 29, (ప్రభాతవార్త**

మండలంలోని 21 పంచాయతీల పరిధిలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించిన రుణాల మంజూరుకు అర్హత ఉన్న లబ్దిదారులు 30వ తేదీ గురువారం ఉదయం నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఓబీఎం ఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్‌భాషా బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు.పూర్తి సమాచారం కోసం మీ పరిధిలో ఉన్న సచివాలయాన్ని సందర్శించాలని తెలిపారు.

## వెలగలపాయ, రంగాపురం గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రం బంద్

### - పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు నిదర్శనం

### - నిఘా పెంచి వైద్యులు సక్రమంగా వచ్చే విధంగా చూడాలని ప్రజల విన్నపం






**అర్ధవీడు, జనవరి 29, (ప్రభాతవార్త**

అర్ధవీడు మండలంలోని వెలగల పాయ, రంగాపురం గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రం సరిగ్గా మధ్యాహ్నం మూడు గంటల సమయాన కనిపించిన దృశ్యం ఇది. ఆరోగ్య ఉప కేంద్రమునకు నియమించినటువంటి వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించి గ్రామాలలో నుంచి వచ్చిన రోగులకు వైద్యం అందించడం వారి బాధ్యత.. కానీ రంగాపురం వెలగల పాయ ఆరోగ్య ఉప కేంద్రాలలో వైద్యులు వచ్చినప్పుడే ఆ గ్రామ ప్రజలు వెళ్లి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరోగ్య ఉప కేంద్రానికి ఆరుగురిని నియమించినప్పటికి వారిలో ఏ ఒక్కరు కూడా ఉప కేంద్రంలో లేకపోగా కేంద్రానికి తాళాలు వేసి నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారు. అసలే అడవి ప్రాంతం ఎక్కువగా విష కీటకాలు సర్పాలు కాటు వేస్తే ప్రథమ చికిత్స చేయడానికి కూడా ఆరోగ్య ఉప కేంద్రాలను పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా నామమాత్రంగా తనిఖీలు చేసి వదిలేస్తున్నారు. కాబట్టి వారు మనల్ని ఎవరు రా ఆపేది అనే సినిమా డైలాగు తరహాలో వైద్యులు వ్యవహారిస్తున్నారు. కన్నబిడ్డ కోసం కన్న తల్లి ఎదురుచూస్తున్నట్లు ఈ ఆరోగ్య ఉప కేంద్రాలకు నియమించినటువంటి వైద్యుల కోసం రోగులు ఎదురుచూడాల్సి వస్తుంది. ఈ రెండు గ్రామాలలో సుమారు 4 వేల కుటుంబాలకు పైగా ఉంటున్నప్పటికి వారిలో డబ్బు ఉన్న వాళ్ల ప్రైవేటు వైద్యశాలకు తరలిపోగా బీదవారం మాత్రం కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ ఈ వెలగలపాయ రంగాపురం పంచాయతీలలో ఏర్పాటు చేసినటువంటి ఆరోగ్య ఉప కేంద్రంలో ఉండవలసిన వైద్యులు మాత్రం సమయానికి ఉండరు ఆరోగ్య ఉప కేంద్రానికి వచ్చినటువంటి సక్రమంగా విధులుకు హాజరు కారు అని విమర్శలు వినిపిస్తున్నాయి. తద్వారా ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వారి వారి ఆరోగ్య ఉప కేంద్రాలలో సరైన సమయానికి ఉండే విధంగా మార్గం చూపి వృత్తి ధర్మం పాటించాలని వెలగలపాయ రంగాపురం గ్రామ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

## కందిపంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



**గిద్దలూరు రూరల్, జనవరి 29 ,(ప్రభాతవార్త**

నియోజకవర్గంలోని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట మరియు కంభం మండలాల్లో డా. ఎం మోహన్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు), లాంఫార్మ్, గుంటూరు వారి ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు ఆ తరువాత వాతావరణంలో మార్పుల వలన దెబ్బతిన్న కంది పంటను పరిశీలించడం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్. సాంబశివరావు, సీనియర్ శాస్త్రవేత్త, లాం శివారెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త లాం గుంటూరు, పి సంధ్యారాణి, గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి బాలాజి నాయక్, మండల వ్యవసాయ శాఖాధికారి వై విజయభాస్కర్ రెడ్డి, విస్తరణాధికారులు గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## మొక్క జొన్న విత్తన ఉత్పత్తి దారులుకి ఒప్పంద పత్రాలు తప్పనిసరి..



**దొనకొండ,జనవరి 29,(ప్రభాతవార్త**

ఈ సంవత్సరం రబీ పంట కాలంలో మొక్క జొన్న విత్తనాలు ఉత్పత్తి చేసే ప్రతి రైతు కంపెనీ లతో ఒప్పందం చేసుకొని అగ్రిమెంట్ కాపీ తీసుకోవాలని మండల వ్యవసాయధికారి వి. లక్ష్మీనారాయణ కోరారు. ఈ రోజు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొచర్ల కోట రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతు లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలో సుమారు 100 ఎకరాల్లో పలు కంపెనీ ల మొక్క జొన్న విత్తనోత్పత్తి కోసం నాటా రని రైతులు తప్పని సరిగా వారితో ఒప్పందం చేసుకొని అగ్రిమెంట్ కాపీ తీస్కొని భద్ర పరచుకోవాలని కోరారు. లేనిచో భవిష్యత్‌లో వచ్చే పరిణామాలకి వారే పూర్తి భాద్యత వహించు కోవలసి వస్తుందని హెచ్చరించారు. తక్కువ కాలంలోనే ఎక్కువ దిగుబడి, ఎక్కువ ధర ఇస్తామని నోటి మాటలను నమ్మవద్దని, ఏ విషయమైనా అగ్రిమెంట్ బాండ్‌లో వ్రాత పూర్వకంగా ఇవ్వాలని కంపెనీ వాళ్ళతో మాట్లాడు కోవాలని సూచించారు.తర్వాత బసిరెడ్డిపల్లి, సిద్దయపాలెం, కొచర్ల కోట గ్రామాల్లో సాగులో వున్న మొక్కజొన్న, మినుములు, మిరప పంటలని రైతులతో కలిసి పరిశీలించి వారడిగిన సమస్యలకి సలహాలిచ్చారు.ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు డి. ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## అగ్గి తెగులు నివారణకు చర్యలు



**సింగరాయకొండ, జనవరి 29,(ప్రభాతవార్త**

అగ్గి తెగులు నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వి. సుధాకర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పాకల, మూలగుంటపాడు గ్రామాలలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి సుధాకర్, త్రీవినీ స్టాఫ్ ఎస్తే రమ్మా,వెంకటరమణ పాల్గొన్నారు. వ్యవసాయ అధికారి రైతులతో మాట్లాడుతూ పీఎం కిసాన్ లబ్ధి పొందే ప్రతి రైతు మార్చి 31 కల్లా రైతు రిజిస్ట్రేషన్ స్థానిక రైతు సేవా కేంద్రాలలో చేయించుకోవాల్సిందిగా తెలియజేశారు. అనంతరం పాకల గ్రామంలో క్షేత్ర సందర్శనలో భాగంగా వరి పంటను పరిశీలించడం జరిగినది చలి వాతావరణం వల్ల అగ్గి తెగులు అక్కడక్కడ గమనించడం జరిగినది దీనికి నివారణ చర్యలుగా ట్రైసైక్లాజోల్ 75 జూశి ఎకరానికి 120 గ్రాములు పిచికారి చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పాకల గ్రామంలోని షేక్ సుభాని ప్రకృతి సిద్ధంగా సాగు చేస్తున్న వివిధ దేశవాళీ వరి వంగడాలను వ్యవసాయ అధికారి పరిశీలించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ జహీర్, గ్రామ వ్యవసాయ సహాయకులు కిషోర్ మరియు సురేష్, భవాని పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

### - సత్వరం నోటీసులు జారీ చేయాలని ఆదేశం



**బల్లికురవ, జనవరి 29, (ప్రభాతవార్త**

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలుతప్పవనిఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని కొనిదెన సర్వే నెంబర్ 789లో ప్రభుత్వ భూములను, ప్రజలు వినియోగించే దారి భూములను గ్రానైట్‌డంపులుగా వినియోగించడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 20వ తేదీన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో భూ ఆక్రమణలపై ఆర్డీఓకు ఫిర్యాదు చేయడం జరిగింది. గ్రానైట్ వ్యర్థాలు నిల్వ చేస్తున్న భూములను పరిశీలించి తక్షణం వారికి నోటీసులు జారీ చేయాలని తహశీల్దార్ రవినాయక్‌ను ఆదేశించారు. స్థానికతహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వాగు పోరంబోకు భూములు, కొండ పోరంబోకు భూములు దేవాదాయ శాఖ భూములు ఆక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే నెంబర్ 789ఏ లో వాగుపోరంబోకు భూములలో గ్రానైట్ ఫ్యాక్టరీల నిర్వాహకులు వ్యర్థాలను డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో దీనిపై ఆయన స్పందించారు. అనంతరం గుంటుపల్లిలో జరుగుతున్న రీ సర్వేను తనిఖీ చేశారు. రీ సర్వేకు ప్రజలంతా తమ వంతు సహకారం అందించి తమ భూముల సమస్యలు సత్వరం పరిష్కారం అయ్యే విధంగా అధికార యంత్రాంగానికి సహకరించాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ రవి నాయక్, డిప్యూటీ తహశీల్దార్ ప్రహర్ష, సర్వేయర్ చంద్ర వీఆర్వోలు సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు భద్రత చర్యలను ప్రతి ఒక్కరూ పాటించాలి

### - ఎస్సై మాధవరావు



**హనుమంతునిపాడు, జనవరి 29, (ప్రభాతవార్త**

వాహనదారులు అందరూ కూడా రోడ్డు భద్రత చర్యలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని ఎస్సై కే.మాధవరావు సూచించారు. బుధవారం కంభం- కనిగిరి రహదారి అడ్డరోడ్డు వద్ద విజిబుల్ పోలీసింగ్లో భాగంగా వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తమ యొక్క వాహనాలకు సంబంధించిన పత్రాలు అన్నింటిని వెంట పెట్టుకోవాలని లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, వాహనాలకు సంబంధించిన కాగితాలు అన్ని కూడా ఖచ్చితంగా ఉండాలని, లేని పక్షంలో జరిమానాలను విధించడం జరుగుతుందని ఆయన అన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని వారికి జరిమాన విధించారు. అనంతరం హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## లెదర్ పార్క్ భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్న మంత్రి డోలా



**రాచర్ల, జనవరి 29 (ప్రభాతవార్త**

మండలంలోని ఎడవల్లి గ్రామ సమీపంలో లెదర్ పార్క్ భవన నిర్మాణానికి రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డితో కలిసి భూమిపూజ చేయనున్నట్లు మండల పార్టీ యువ నాయకుడు, ప్రముఖ కాంట్రాక్టర్ భవనం శ్రీధర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ శనివారం ఉదయం 11.15గంటలకు భూమిపూజ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. భవన నిర్మాణం, రోడ్డు నిర్మాణం, లెదర్ పార్కు అభివృద్ధి శిక్షణ కొరకు తీసుకోవలసిన చర్యలు, నిరుద్యోగ భృతి కల్పిస్తున్న అవకాశాలు తదితర అంశాల గురించి ఆయన మాట్లాడుతారని ఆయన తెలిపారు. మండలంలోని తెలుగుదేశం, జనసేనా, బిజేపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఈ కార్యక్రమ విజయవంతానికి కృషిచేయాలని ఆయన కోరారు.

## రైతులను గుర్తించేందుకే ప్రత్యేక వెబ్సైట్

### - పొలం పిలుస్తోందిలో ఏఓ రాజశ్రీ



**కొమరోలు, జనవరి 29 ,(ప్రభాతవార్త**

కొమరోలు మండంలోని దద్దవాడ, తాటిచెర్ల గ్రామాలలో మండల వ్యవసాయ శాఖాధికారి కె రాజశ్రీ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని గురించి రైతులకు వివరించి, దీని ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను(ఐడి నంబర్) కేటాయించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ వ్యవసాయ, ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ సహాయకులు ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత రైతుకు సంఖ్యను కేటాయిస్తారు. అన్ని రైతు సేవా కేంద్రాలలో వెసలుబాటును కల్పించనున్నారని తెలిపారు. భూమి అర్హతగల రైతు కౌలు వ్యవసాయ కూలీ అధారిత వృత్తులపై జీవించే వారు అర్హులని ఆమె తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీకి రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం, చరవాణి నెంబర్ అవసరమని అన్నారు. అర్హులైన రైతులను గుర్తించడం, ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలు, భూ ఆధారిత చెల్లింపులు అయిన పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటభీమా, పంట నష్టపరిహారం, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీ ద్వారా వ్యవసాయ పనిముట్లు అందించుట తదితర ప్రయోజనాలు దీని ద్వారా కలుగుతాయని తెలిపారు. ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ మిరప పంటలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు. రసంపీల్చు పురుగుల నివారణకు పసుపు నీలం జిగురు అట్టల ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ పొలంలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రాయితీపై మినీ ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఈఓ మల్లీశ్వరి, గ్రామ పట్టు పరిశ్రమ సహాయకులు షేక్ నాగూర్‌బీ మరియు రైతులు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలపై అధికారులు విచారణ చేపట్టాలి

**- మాజీ కౌన్సిలర్ శీలం శ్యాం**

**- అధికారులను తప్పుద్రోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి**

**చీరాల టౌన్, జనవరి 29, ప్రభాతవార్త**



జాతీయ రహదారి నిర్మాణంతో భూమిరేట్లు పెరగడంతో తమకు చెందిన భూమికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఉన్నతాధికారులను తప్పుద్రోవ పట్టిస్తూ తాము భూ కబ్జాలకు బెదిరింపులకు పాల్పడినట్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంపై చీరాల మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు శీలం శ్యామ్‌బాబు, పంచమర్తి వెంకట సాయిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. తాము ఇరువురం కలిసి 2011 సంవత్సరంలో నాశన చంద్రశేఖర్ వద్ద 65 సెంట్ల పొలం భూమిని ప్రభుత్వ నిబందనల మేరకు కొనుగోలు చేయడంతో పాటుగా ఆ భూమిపై సర్వ హక్కులు కలిగిన నాశన చంద్రశేఖర్‌తో పాటుగా ఆ భూమిపై హక్కు కలిగిన అతని కుమారుల నుంచి చట్టప్రకారం రిజిస్ట్రేషన్ సైతం చేయించుకున్నామన్నారు. అయితే అప్పటి నుంచి తాము ఆ పొలంలో వ్యవసాయం చేస్తూ అనుభవంలో కూడా ఉన్నాం అన్నారు. అయితే ఇటీవల కాలంలో పిడుగురాళ్ల- వాడరేవు జాతీయ రహదారి అటుగా నిర్మాణం జరుగుతున్న క్రమంలో అటువైపు భూమి రేట్లు విపరీతంగా పెరగడంతో తమ పొలానికి పెన్సింగ్ వేస్తున్న క్రమంలో పరిశామురళీ ప్రసాద్ దంపతులు ఈ భూమి తమదని తమను అడ్డుకుని పెన్సింగ్ ఆపేసి పొలంలో సాగు చేసిన మొక్కలను తీసివేశారని అన్నారు. అదేవిధంగా రేకుల షెడ్ కూడా తొలగించి గొడవలు సృష్టించారుఅన్నారు. దీని విషయం గతంలో తాము సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సమస్యను పరిష్కరించమని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఆ దంపతులు తమ వద్ద 65 సెంట్ల పొలానికి సంబంధించిన ఒరిజనల్ దృవీకరణ పత్రాలు కూడా ఉన్నాయని అన్నారు. ఈ తరుణంలో ఉద్దేశపూర్వకంగానే ఆ దంపతులు నకిలీ దృవీకరణ పత్రాలను ఉన్నతాధికారులకు చూపుతూ వారిని తప్పుదో పట్టిస్తూ తమపైన అసత్యమైన ఆరోపణలు చేస్తున్నారని వారుఆరోపించారు. కావున ప్రభుత్వ ఉన్నతాధికారులు భూమి చట్ట ప్రకారం ఎవరిదో తేల్చి తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

## ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

**- మిరియం శ్రీనివాసులు డిమాండ్**

**ఒంగోలు టౌన్, జనవరి 29, ప్రభాతవార్త**



బిసిల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మార్కాపురం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని 139 బిసి కులాల జెఎసి రాష్ట్ర ఛైర్మన్ మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంసిఎ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పొదిలి మండలం సల్లూరు గ్రామంలో దహన సంస్కారాలు అడ్డుకున్న టిడిపి సానుభూతి పరులను ఎమ్మెల్యే వెనకేసుకురావడం సిగ్గుచేటన్నారు. అమానుషంగా వ్యవహరించిన వారిని మందలించకపోగా బిసిలకు వైసిపి ముద్రవేయడం అజ్ఞానమే అన్నారు. బాధ్యత కుటుంబాన్ని బిసివై జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ పరామర్శించి ధైర్యం చెబితే ఓర్వలేని స్థితిలో ఎమ్మెల్యే అవాకులు చవాకులు పేలడం శోచనీయం అన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేను కట్టడి చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు. విలేకర్ల సమావేశంలో బిసి నేతలు సామ్రాజ్యం,పిన్నిక శ్రీనివాస్,చిరుమామిళ్ల గోపి,బిసివై నేత నర్రావుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అనుమతులు లేని ఇసుక రవాణాపై ఉక్కుపాదం

**- ఎస్ఐ వెంకటేశ్వర్లు**

**వేటపాలెం, జనవరి 29, ప్రభాతవార్త**



వేటపాలెం మండలం బైపాస్ నందు బుధవారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ బుధవారం తెల్లవారుజామున రాబడిన పక్కా సమాచారం మేరకు వేటపాలెం బైపాస్ నందు గల గాయత్రీ రెస్టారెంట్ జంక్షన్ నందు అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేయడం జరిగిందని అక్రమంగా ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదని తెలియజేశారు.

## పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**నాగులుప్పలపాడు, జనవరి 29, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశు ఆరోగ్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని నాగులుప్పలపాడు పశువైద్యశాల ఏడీ డాక్టర్లు ఎస్.నాగభూషణం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఉప్పుగుండూరులో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశు పోషకులకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ తగిన నిధులు కేటాయించి వారి ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందని తెలిపారు. అందులో భాగంగా గోకులం షెడ్లు మంజూరు చేయడంతో పాటు ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు వివిధ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. నట్టల నివారణ పశుగ్రాసాల సాగు, పశు భీమా పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా జనవరి 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 150 పశువులకు గర్భకోశ వ్యాధులు చూడి పరీక్షలు నిర్వహించారు. 5 వేల గొర్రెలు 150 పశువులు, 50 దూడలకు నట్టల నివారణ మందు త్రాగించారు. అదే విధంగా చేకూరపాడు, దాసరివారిపాలెం తదితర గ్రామాల్లో ఆయా ఆసుపత్రి పరిధిలోని డాక్టర్లు ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నట్టల నివారణ మందు తాగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జాస్మిన్, లావణ్య, వెంకట సురేఖ, అనురాధ, వివిధ గ్రామాల పశు వైద్యశాలల సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## దర్శి శ్రీ పొట్టి శ్రీరాములు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

**దర్శి, జనవరి 29, ప్రభాతవార్త**

ఈనెల 31న దర్శిలోని శ్రీ పొట్టి శ్రీరాములు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వివి నారాయణ, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి.పెద్దిరాజు తెలిపారు. హెట్రో డ్రగ్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, ఎయిర్టెల్ పేమెంట్‌బ్యాంకు కంపెనీలు ఈ జాబ్ మేళాలలో పాల్గొంటాయి. హెట్రో డ్రగ్స్‌లో 50 ఖాళీలు, ఎస్‌బీఐ క్రెడిట్‌లో 20, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకులో 20 ఖాళీలు ఉన్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు 19 నుంచి 28 ఏళ్ల వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, విజయవాడ ప్రకాశం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు డిగ్రీ కళాశాల, దర్శి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మరిన్ని వివరాలకు కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.నగేష్, స్కిల్ హబ్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎస్.రమేష్ నెంబర్లు 9247433273, 9949914337 సంప్రదించాలన్నారు.

## ఫుడ్ పాయిజన్ కాలేదు - డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

**దర్శి, జనవరి 29, ప్రభాతవార్త**



ఈనెల 26,27న దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులో గల శ్రీ గౌతమి విద్యాసంస్థలలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల అనంతరం మరుసటి రోజు ఉదయం ముగ్గురు విద్యార్థులకు జ్వరం రాగా దర్శిలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఈ లోపు ఫుడ్ పాయిజన్ జరిగిందని వార్తలు షికార్లు చేశాయి. ఈ క్రమంలో డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు క్యాంపస్‌కి విచ్చేసి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించగా ఇవి సాధారణ, వాతావరణ మార్పులు వల్ల జలుబు, జ్వరం వచ్చిందని, భయపడాల్సిన విషయం ఏమి లేదని తేల్చి చెప్పడంతో పుకార్లకు చెక్ పడింది. అలాగే ఈ కాలంలో వచ్చే వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు .ఈ కార్యక్రమంలో అర్బన్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## చందలూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

**దర్శి, జనవరి 29, ప్రభాతవార్త**



దర్శి మండలంలోని చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని, అనారోగ్య సమస్యలతో వస్తున్న వారి పట్ల ఆప్యాయంగా ఉండాలన్నారు. హాస్పిటల్‌కి వచ్చే రోగులకు అవసరమైన అందుబాటులో ఉన్న అన్ని పరీక్షలను చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని రికార్డ్స్ ఇమ్యూనిజషన్ రూమ్, ల్యాబ్, ఫార్మసీ పరిశీలించారు. వార్డులోని పేషెంట్స్‌తో మాట్లాడారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సక్రునాయక్, మెడికల్ ఆఫీసర్ చందలూరు, సూపర్‌వైజర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.

## ముండ్లమూరు, వేంపాడులో పొలం పిలుస్తోంది

**ముండ్లమూరు, జనవరి 29, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని ముండ్లమూరు, వేంపాడు గ్రామాల్లో రైతు రాయితీపై ఎఫ్ఎన్ఎస్ పథకం క్రింద మొక్కజొన్న సాగు చేయు రైతులకు దర్శి సహాయక వ్యవసాయ సంచాలకులు కే.బాలాజీ నాయక్ పురుగు మందులు అందజేశారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులకు పొగాకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని తెలియజేశారు. మొక్కజొన్న పంటలో లింగాకర్షక బుట్టలు వాడటం వలన పురుగు ఉధృతిని తగ్గించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు టి.శోభారాణి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఇస్రో ఛైర్మన్ నారాయణన్ చిత్రపటానికి పాలాభిషేకం

**దర్శి, జనవరి 29, ప్రభాతవార్త**



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రపంచ దేశాలు గర్వపడేలా శ్రీహరికోట నుండి జీఎస్ఎల్‌వీ -ఎఫ్15 నావిక్2 ను 100వ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి దిగ్విజయంగా పంపించి ఘన విజయాన్ని సొంతం చేసికొన్న సందర్భాన్ని పురష్కరించుకుని దర్శి మండలంలోని తూర్పు వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటీవ్ మెంబరు కపురం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి 350 మంది విద్యార్థులందరూ కలిసి ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు ప్రకాష్‌రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా మానవత సంస్థ ఛైర్మన్ దేవతి వరప్రసాద్, కపురం శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులందరూ ఈ పర్వదినం సందర్భంగా మిఠాయిలు పంచుకుని జయహో భారత్ అనే నినాదాలు చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈదరలో దాబా దగ్ధం

**ముండ్లమూరు,జనవరి 29, ప్రభాతవార్త**



మండలంలోని ఈదర గ్రామంలో బుధవారం ఎర్రబోలు చంద్రశేఖర్‌రెడ్డికి సంబంధించిన రెస్టారెంట్ 11కేవీ కరెంట్ వైర్ కట్ అయ్యి పడింది. ఆ నిప్పు రవ్వ వాళ్ల గుడిసెలో మంటలు రేగాయి. గుడిసె తగలపడిపోవడం జరిగింది. దీంతో రూ.1,20,000 ఆస్తినష్టం వాటిల్లిందని చంద్రశేఖర్‌రెడ్డి వాపోయారు. వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన అన్నారు.

## గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

**- ఎస్ఐ వై.నాగరాజు**

**ముండ్లమూరు, ప్రభాతవార్త**



మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల తోటి పోలీసు స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే గ్రామాల్లో దొంగతనాల్ని అరికట్టవచ్చని అన్నింటికి ఉపయోగకరంగా ఉంటుందని వెంటనే సీసీ కెమెరాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

**- వ్యవసాయాధికారి రాధ**

**పొమూరు, జనవరి 29, ప్రభాతవార్త**



వివిధ పంటలు సాగు చేస్తున్న రైతాంగం ఈ క్రాప్ పంట నమోదు చేయించుకుని విపత్తుల ద్వారా నష్టపోతే భీమా పొందే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి కంచెం రాధ తెలిపారు. మండలంలోని తిరగలదిన్నె, తాతయపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వివిధ పంటలను పరిశీలించారు. చీడపీడల నివారణపై చర్యలు చెప్పారు. కందిలో మారుకా మచ్చల పురుగు, గూడు పురుగు ఆశించినందున వాటి నివారణకు నోవాల్యూరాన్ 2మి.లీ లీటరు నీటితో పాటు లాండాసైహేలోథ్రిన్ 1.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. మిగిలిన పంటలకు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఉంటే అసిస్టంట్లతో సంప్రదింపులు జరిపి పంట బాగు కొరకు సరైన సూచనలు పొంది సరైన దిగుబడి సాధించాలన్నారు.

## కలెక్టర్ తమీమ్ అన్సారియాకు గోడు వెలబోసుకున్న గుమ్మలంపాడు రైతులు

**- గత ప్రభుత్వం హయాంలో అక్రమంగా భూములు దోచుకున్నారని ఆవేదన**

**పొమూరు, జనవరి 29, ప్రభాతవార్త**



పొమూరు తహశీల్దార్ కార్యాలయానికి ఆకస్మికంగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పలువురు రైతులు తమ గోడు వెలబోసుకున్నారు. సట్టుమడుగు గ్రామానికి చెందిన అబ్బూరి శేషయ్య గత ప్రభుత్వంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, సర్వే నెంబరు 2,3,4,5లో గల 42 ఎకరాల భూమిని 40 ఏళ్లుగా గుమ్మలంపాడు రైతులు సాగు చేసుకుంటున్నప్పటికి 2002లో అప్పుడు అధికారాని వెలగబెట్టిన మండల నాయకుడు తప్పుడు రికార్డులు సృష్టించి ఈ ప్రాంతంలో లేని వారికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. సర్వే నెంబర్లలో గల భూములు ఎస్ఎల్ఆర్‌లో గయాల్‌గా నమోదై ఉన్నప్పటికి ఏ విధంగా రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ చేస్తారని అబ్బూరి శేషయ్య ప్రశ్నించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామస్తుల మీద నాలుగైదు అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేశారని, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి లక్షలాది ముడుపులు తీసుకుని ఇతరుల మీద పాస్ పుస్తకాలు ఇవ్వడంపై కలెక్టర్ దృష్టికి తీసుకురాగా గుమ్మలంపాడు సర్వే నెంబరు 2,3,4,5లను గయాల్ భూములను గత 40 సంవత్సరాలు నుంచి ఎవరెవ్వరూ సాగు చేసుకుంటున్నారో నివేదిక అందించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. తప్పు జరిగినట్లు రుజువు అయితే అందుకు కారకులపై తగిన చర్యలు తీసుకుంటామని, వాస్తవమైన రైతులకు న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు తోడుగా శ్రీ శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్

**- విద్యార్థుల్లో ప్రతిభను గుర్తిస్తూ.. ఆత్మవిశ్వాసం పెంచుతూ**

**- 13ఏళ్లు విద్యావేత్తల మన్ననలు పొందుతున్న శ్యామల కాశిరెడ్డి**

**కనిగిరి, జనవరి 29, ప్రభాతవార్త**



విద్య అంటే కేవలం పుస్తకాల్లో కాదు, ప్రతిభను వెలికితీయడమేనని నమ్ముతూ, విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం అందిస్తున్న సేవా సంస్థ శ్రీ శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్. ఈ సంస్థ ద్వారా ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి గత 13 సంవత్సరాలుగా నిరంతరం పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తూ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తూ ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతున్నారు.

**ప్రతిభ పరీక్షల ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహం:**

ప్రాథమిక దశలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించి, అర్హత సాధించిన వారికి నగదు బహుమతులు అందజేసేవారు. అయితే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మరింత సహాయం అందించాలనే లక్ష్యంతో ప్రస్తుతానికి ప్రభుత్వ పాటశాల విద్యార్థులకే ప్రత్యేకంగా ఈ ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిలో విజయం సాధించే ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా ప్రోత్సహిస్తున్నారు. పేద విద్యార్థులకు విద్యార్జనలో ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా చేయాలనే శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

**- శ్యామలకాశిరెడ్డికి అభినందనలు తెలుపుతున్న ప్రజలు:**

ఈ గొప్ప సేవా కార్యక్రమాన్ని పలువురు విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, తల్లిదండ్రులు, ఉద్యోగస్తులు అభినందిస్తూ, శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ శ్యామల వెంకటరెడ్డి చేస్తున్న కృషిని ప్రశంసిస్తున్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు ఈ ఫౌండేషన్ మద్దతుగా నిలవాలని కోరుకుంటూ, సేవా కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరుతున్నారు.

## గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఆర్థిక లబ్దికోసమే సంత

**కనిగిరి,జనవరి 29, ప్రభాతవార్త**






కనిగిరి ప్రాంతంలో గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఆర్థిక లబ్ది చేకూర్చడం కోసమే సంత ఏర్పాటు చేస్తున్నట్లు కలిగించే ఉద్దేశంతోనే ఈ సంత ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి గొర్రెలు, మేకల సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకల పెంపకం దారులతో సూమావేశమై , అధికారులతో చర్చించి మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంపకం దారులు ప్రత్యక్షంగా లాభపడే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, మార్కెట్ అనుకూలమైన ధరలు పొందేందుకు ఈ సంతలు ఉపయోగపడతాయని తెలిపారు. రైతులకు మేలు కలిగించే విధంగా పశుసంవర్ధక రంగంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కూడా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గండ్లూరి కేశవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ ఆకుల వెంకట రవిశంకర్, కనిగిరి ఏరియా బస్సు వైద్యశాల సహాయ సంచాలకులు గజ్జల శ్రీనివాసరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, తమ్మినేని సురేంద్రరెడ్డి, అచ్చాల రవి, చిరంజీవి, దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు, పెంపకం దారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## టంగుటూరులో పశువైద్య శిబిరం

**టంగుటూరు, జనవరి 29, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులో బుధవారం పశు వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ బెల్లం జయంతిబాబు, ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ ఈ శిబిరాన్ని ప్రారంబించారు. ఈ శిబిరంలో అసిస్టెంట్ డైరక్టర్ కే.సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బెజవాడ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు, కోటపాటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్, పశువైద్యులు ధనలక్ష్మి, విజయమాధవి, సోమశేఖర్, రమేష్‌బాబు, పాల్గొన్నారు.

## జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెంలో పొలం పిలుస్తోంది

**టంగుటూరు, జనవరి 29, ప్రభాతవార్త**

మండలంలోని జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెంలో మండల వ్యవసాయాధికారిణి జి.స్వర్ణ లత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారిణి మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సాగు చేసిన శనగ, పొగాకు పంట పొలాలను సందర్శించి ప్రస్తుత వర్షాల వలన శనగ పంట సాగు చేయడం ఆలస్యం అయిన కారణంగా శనగ పంటకు తుప్పు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున వాటి నివారణ చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు వ్యవసాయాధికారి ప్రావీణ్యం, విస్తరణాధికారి సీహెచ్ఎన్ శ్రీనివాసరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



30-1Pg5.qxd:30-1Pg5.qxd 01/01/01 9:33 AM Page 1



# అందరికి ఆరోగ్యం.. రూ. 25 లక్షల బీమా

## ఢిల్లీ ఎన్నికలకోసం కాంగ్రెస్ మేనిఫెస్టో



**న్యూఢిల్లీ, జనవరి 29:** దేశరాజధాని అసెంబ్లీ ఎన్నికలంటేనే అన్ని రాజకీయపార్టీలకు ప్రతిష్టాత్మకం అవుతుంది. ఎవరికి వారు హామీల వర్షం కురిపిస్తున్నారు. బిజెపి అయితే రెండు మేనిఫెస్టోలు విడుదలచేసింది. ఇక అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీపార్టీ అయితే రోజుకొక కొత్త హామీ వినిపిస్తోంది. అన్ని పార్టీలతోను పోలిస్తే చివరికి కాంగ్రెస్ పార్టీకూడా తన మేనిఫెస్టో రెండోసారి విడుదలచేసినట్లే భావించాలి. అందరికీ ఆరోగ్యం పథకం కింద రూ.25 లక్షల వరకూ ఆరోగ్య బీమా కల్పిస్తామంటూ ముందుకువచ్చింది. కీలకంగా ఐదు గ్యారంటీలతో కూడిన మేని ఫెస్టోతో ముందుకువచ్చింది. మహిళలకు ప్రతినెలా రూ.2500 ఆర్థికసాయం ఇస్తామని వెల్లడించింది. మెహంగై ముక్తియోజన కింద సిలిండర్‌కు రూ.500 చప్పున వంటగ్యాస్; ఉచితరేషన్ కిట్, సీనియర్ సిటిజన్లు, వితంతువులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, నిరుపేదలకు నెలకు ఐదువేల చొప్పునపింఛన్ ఇస్తామని ప్రకటించింది. యువతకోసం ప్రైవేటు లేదా ప్రభుత్వరంగంలో ఒక ఏడాది అప్రెంటిస్‌షిప్ నెలకు రూ.8500 భృతి కల్పిస్తామని వెల్లడించింది. ప్యారీదీదీ కింద మహిళలకు ప్రతినెల రూ.2500 ఆర్థికసాయం చేస్తామని ప్రకటించింది. 300 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలు హస్తం పార్టీప్రకటించింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్‌రమేష్ పార్టీ అధ్యక్షుడు దేవేంద్రయాదవ్ బుధవారం ఈమేనిఫెస్టోను విడుదలచేసారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ ఢిల్లీప్రజలకోసం ఐదు గ్యారెంటీలుప్రకటించారు.

గ్యారంటీ అంటే పౌరుల హక్కు. అర్థం. ఆప్, బిజెపిలు ఢిల్లీ కాలుష్యాన్ని కట్టడిచేయలేక పోతున్నాయని విమర్శించారు. ఇక ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే కులగణన నిర్వహిస్తామని పూర్వాంచల్ వాళ్లకోసం ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని దేవేంద్ర యాదవ్ తెలిపారు. కాగా ఫిబ్రవరి ఐదున ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆప్ బిజెపి, కాంగ్రెస్‌లు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి.

## సెంచరీ కొట్టేశాం.. రాకెట్, ఉపగ్రహ నమూనాలు చూపిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు



సెంచరీ కొట్టేశాం.. రాకెట్, ఉపగ్రహ నమూనాలు చూపిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

# ఇస్రో, నాసా సంయుక్త ఉపగ్రహం నిసార్ ప్రయోగం త్వరలోనే

### ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్

**శ్రీహరికోట (తడ), జనవరి 29 ప్రభాతవార్త:** ఇస్రో, నాసాలు కలిసి సంయుక్తంగా నిసార్ ఉపగ్రహాన్ని శ్రీహరికోట నుంచి త్వరలో ప్రయోగిస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పేర్కొన్నారు. జిఎస్ఎల్వి-ఎఫ్16 రాకెట్‌ద్వారా ఈ ప్రయోగం ఉంటుందన్నారు. బుధవారం ఆయన షార్‌లోని మీడియా సెంటర్లో సహచర శాస్త్రవేత్తలతో కలిసి మాట్లాడారు. రాకెట్ ప్రయోగం జరుగుతున్నంత సేపు నూతన సారధి నారాయణన్ కొంత ఉద్విగ్నతతో కనిపించారు. మూడు దశలు రాకెట్ ప్రయోగం ముగిసిన తర్వాత ఆయన ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పక్కనే ఉన్న షార్ డైరెక్టర్ తదితరులను హత్తుకొని ఆనంద భాష్పాలు కార్చారు. బుధవారం తమిళులకు అత్యంత ఇష్టమైన తైఅమావాస్య కావడంతో పక్కా తమిళవాసి నారాయణన్‌కు అదేరోజు తొలి విజయం లభించింది. అనంతరం మీడియా సెంటర్లో ఆయన సహచర శాస్త్రవేత్తలతో కలిసి ఉపగ్రహం, రాకెట్ నమూనాలు ప్రదర్శించారు. భవిష్యత్ ప్రయోగాల గురించి ఆయన మాట్లాడుతూ గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీహరికోటలో మూడవ ప్రయోగ వేదిక శంకుస్థాపన కోసం ప్రధాని నరేంద్రమోడీని ఆహ్వానిస్తున్నామని, త్వరలోనే కార్యక్రమాల వివరాలు అందుతాయన్నారు. నాలుగవ ప్రయోగ వేదిక తమిళనాడులోని కులశేఖరపట్టణంలో నిర్మాణంలో ఉన్న సంగతిని గుర్తుచేస్తూ అక్కడ మరో రెండేళ్ల తర్వాత మాత్రమే రాకెట్ ప్రయోగాలు ఉంటాయని చెప్పారు. మిషన్ డైరెక్టర్ థామస్ కురియన్ మాట్లాడుతూ ఖచ్చితమైన ప్లేస్‌కి నావిక్ ఉపగ్రహం ప్రవేశించినట్లు చెప్పారు. వెహికల్ డైరెక్టర్ ధన, అసోసియేట్ వెహికల్ డైరెక్టర్ మేరీ మాథ్యూ, శాటిలైట్ డైరెక్టర్ కార్తీక్‌తోపాటు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ కున్హికృష్ణన్, యుఆర్ రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ శంకరన్, శాట్ డైరెక్టర్ నీలేష్ దేశాయ్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ మోహన్, ఇశాక్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్ఆర్ఎస్‌సి డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్, హెచ్ఎఫ్ఎఫ్‌సి డైరెక్టర్ టికె సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పశు ఆరోగ్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలి

**కారంపూడి, జనవరి 29 ప్రభాతవార్త:** పశు ఆరోగ్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య అన్నారు. కారంపూడి మండలం చింతపల్లి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశుఆరోగ్య శిబిరానికి



ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పశువైద్యాధికారి డా|| డి.దిలీప్ పశువులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, చింతపల్లి గ్రామ సర్పంచ్ ఉన్నం మాధవి - మల్లికార్జునరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు గమిడి పూర్ణయ్య, తెదేపా నాయకులు నేలపాటి శివయ్య, బేతపూడి బాపనయ్య, చిరుమామిళ్ల చిన్న సాంబయ్య, పశు వైద్య సిబ్బంది బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# 30 లక్షల ఉద్యోగులకు ట్రంప్ ఉద్వాసన!

## ఖర్చు ఆదా పనిలో ట్రంప్ సర్కార్



**వాషింగ్టన్, జనవరి 29:** అమెరికాలోప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా ట్రంప్ సర్కారు బై ఔట్‌ను ప్రకటించింది. ఆఫీస్ ఆఫ్ పర్సనల్‌మేనేజ్‌మెంట్ నుంచి ఒక మెమో కూడా జారీ అయింది. ప్రభుత్వ ఉద్యోగుల ప్రమాణాలు ప్రవర్తన, అనుకూలతలను పెంచేందుకు ఈనిర్ణయం తీసుకున్నట్లుతెలిపారు. ఈ మేరకు ఒక ఈమెయిల్ 20 లక్షలమంది ఉద్యోగులకు పంపించారు. స్వచ్ఛందంగా ఉద్యోగాలు వదులుకుంటే ఎనిమిదినెలల జీతం ఇస్తారని అందులో ఉంది. ఫిబ్రవరి ఆరవతేదీలోపు తమ నిర్ణయం వెల్లడించాలని స్పష్టంచేసారు.

ఉద్యోగాలు మానేద్దామని అనుకుని ఆగిపోయిన వారు ఈ విధానంఎంచుకోవచ్చని కొవిడ్ తర్వాత చాలా మంది ఉద్యోగులు రిమోట్ విదానంలో పనిచేస్తున్నారని, తాజాగా వారు వారానికి ఐదురోజులు ఆఫీసులకు రావాలని ట్రంప్ సర్కారు తేల్చిచెప్పింది. విధులకు హాజరుకావడం ఇష్టలేని ఉద్యోగులు ఈకొత్తపద్ధతి ఎంచుకోవచ్చని చెపుతున్నారు. పదినుంచి 15శాతం మంది ఈ కొత్త వ్యవస్థను ఎంచుకోవచ్చని భావిస్తున్నారు. ఇది విజయవంతం అయితే అమెరికా ప్రభుత్వ ఖర్చులు ఏటా 100 బిలియన్ డాలర్లవరకూ తగ్గుతాయనిఅంచనా. ఓవైపు ఫెడరల్ నిధులు రుణాలను నిలిపివేసిన వేళ ఈ వార్త వెలుగులోకి రావడం ఇపుడు సర్వత్రా చర్చనీయాంశం అయింది. స్థానిక సంస్థల ప్రభుత్వాలు, లాభాపేక్షలేని సంస్థలపై ఈప్రభావం ఎక్కువ ఉంటుంది.

2023 చివరినాటికి సుమారు 30 లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు లెక్కలు చెపుతున్నాయి. దేశం మొత్తం ఉద్యోగుల్లో 1.9శాతానికి సమానం. ప్యూ రీసెర్చి కేంద్రం లెక్కలప్రకారం ఒక్కో ప్రభుత్వ ఉద్యోగి సగటున 12 ఏళ్లపాటు పనిచేస్తాడు. తాజాగా ట్రంప్ ఆఫర్‌ను కొద్దిశాతం మంది ఆమోదించినా అది ప్రభుత్వపాలన ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావంచూపుతుంది. అనుభవం ఉన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, నీటిపరీక్షల విభాగం వైమానిక రంగం నిత్యావసర వస్తువుల రక్షణకు సంబంధించిన ఉద్యోగుల సంఖ్య తగ్గవచ్చని అంచనా. మరోవైపు అమెరిన్ ఫెడరేషన్ ఆఫ్‌గవర్నమెంట్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు ఎవరెట్ కెల్లీమాట్లాడుతూ వలంటరీ బైఔట్‌గానే చూడాలని డిమాండ్‌చేస్తున్నారు.

# కాంగ్రెస్, ఆప్‌ల పాలనలో చితికిన ఢిల్లీ ప్రజల బతుకులు

## ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, జనవరి 29:** దేశరాజధానిలో వచ్చేనెల 5వ తేదీ తర్వాత ఆప్ సర్కారు పోయి బిజెపి ప్రభుత్వం వస్తుందని, ఈమాట తాను చెప్పడంలేదని యావత్ ఢిల్లీప్రజలంతా ఆదే అంటున్నారని ప్రధానిమోడీ అన్నారు. ఢిల్లీ ప్రజలు ఇంటింటికీ నల్లానీళ్లు కావాలని ట్యాంకర్ మాఫియానుంచి విముక్తికల్పించాలని కోరుకుంటున్నారని ప్రధానిచెప్పారు. గత 11 ఏళ్లుగా అదికారంలో ఉన్న ఆమ్ ఆద్మీపార్టీ వారి ఆశలను నెరవేర్చడంలో విఫలం అయిందని విమర్శించారు. ఆప్ అబద్ధపు ఆహామీలను ఇపుడు ఢిల్లీప్రజలు నమ్మేపరిస్థితిలో లేరని, ప్రజలు డంబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని ఈసభకు హాజరయిన జనసంఖ్యే చెపుతోందన్నారు.

ఢిల్లీ బిజెపి విడుదలచేసిన మేనిఫెస్టోను ప్రధాని ప్రశంసించారు. అన్ని వర్గా లకు సంక్షేమఫలాలు అందించేలా మానిఫెస్టో ఉందన్నారు. 21వ శతాబ్దంలో ఢిల్లీని కాంగ్రెస్ పార్టీ 14 ఏళ్లు, ఆప్ 11 ఏళ్లు పాలించాయని, అయినా ఢిల్లీప్రజల బతుకుల్లో చెప్పుకోదగిన మార్పులు రాలేదని ప్రధాని విమర్శించారు. నిత్యం ట్రాఫిక్ జామ్‌లు పేలవమైన మౌలిక సదుపాయాలుడ్రైనేజి వ్యవస్థ కాలుష్యం మురుగునీరు తదితర సమస్యలు ఢిల్లీప్రజలను వేధిస్తున్నాయన్నారు.

కాగా సుమారు 27 ఏళ్లుగా ఢిల్లీలో అధికారానికి దూరమైన బిజెపి ఈసారి కచ్చితంగా అదికారంలోకి రావాలని పట్టుదలగా ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ కూడా పూర్వవైభవాన్ని సంతరించుకునేందుకు ప్రయత్నిస్తోందని మళ్లీ అధికారం తమదేనని ఆప్‌కూడా ధీమాతో ఉంది. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో ఢిల్లీ నియోజక వర్గాల్లో ప్రధానిమోడీ తన ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. ప్రధానితోపాటు పలువురు కేంద్ర మంత్రులు, పార్టీ అధ్యక్షుడు జెపినడ్డా తదిత రులు కూడా ప్రచారంలో తమ జోరుహోరును కొనసాగిస్తున్నారు. మోడీ తన ప్రచారం మొత్తం కాంగ్రెస్, ఆప్‌లపైనే ఎక్కుపెట్టారు. హర్యానా యమునానదిని కలుషితం చేస్తోందని విష పూరితంచేస్తోందని ఆరోపించడంపై మోడీ మండి పడ్డారు.

హర్యానా ఢిల్లీలో నివసించేప్రజలు ఒకరు కాదా అని హరియానా ప్రజల బంధు వులు ఢిల్లీలోలేరా, తమ సొంతప్రజలు తాగే నీటిని హర్యానా విషపూరితంచేస్తుందా అని ప్రశ్నించారు. హర్యానాపంపిస్తున్న నీటిని ఢిల్లీలో ప్రతి ఒక్కరు వాడుకుంటున్నారని, అందులో ఈ ప్రధాని కూడా ఉన్నారనికేజ్రీవాల్ వ్యాఖ్యలను ప్రధాని తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో ట్రాఫిక్ జామ్‌లు, నీళ్ల నిలవడం కాలుష్యం అన్ని సమస్యలు అలాగే ఉన్నాయని, మీ ఓటుమాత్రమే వీటికి విముక్తి కల్పిస్తుందని అన్నారు.



## కేజ్రీవాల్‌పై హర్యానా ప్రభుత్వం కేసునమోదు

**న్యూఢిల్లీ,జనవరి 29:** ఆమ్ ఆద్మీ పార్టీఅధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై హరియాణాప్రభుత్వం కేసునమోదుచేస్తున్నట్లు మంత్రి విపుల్‌గోయల్ వెల్లడించారు. యమునా నదిని బిజెపి ప్రభుత్వం విషపూరితంచేస్తోందని కేజ్రీవాల్ చేసిన అసంబద్ధమైన ఆరోపణల నేపథ్యంలో ఈచర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కేజ్రీవాల్ మా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ఆరోపణల వల్ల హర్యానా ఢిల్లీప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆయన నిరాధార ఆరోపణలు చేస్తుంటే మేం ఊరికే విడిచిపెట్టమని దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని కేజ్రీవాల్‌మాటలు అవాస్తవమని నిరూపిస్తామని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేసారు. హర్యానాలోని అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం యమునానదిలోకి కావాలనే పారిశ్రామిక వ్యర్థాలను వదులుతోందని కేజ్రీవాల్ సోమవారం ఆరోపించారు.

నదిలో విషం కలపడంద్వారా ప్రజలను హతమార్చాలని చూస్తోందన్నారు. ఉద్దేశ పూర్వకంగానే పారిశ్రామిక వ్యర్థాలను డంప్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇదే అంశంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశి విలేకరులతో మాట్లాడుతూ యమునను కలుషితంచేయడం జల ఉగ్రవాదం అని అభివర్ణించారు. హరియాణా నుంచి ఢిల్లీకి ప్రవహిస్తున్న యమునా నదిలో అమ్మోనియం స్థాయిలు ఆరురెట్లు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. కాగా కేజ్రీవాల్‌చేసిన ఆరోపణలను ఢిల్లీ జల్‌బోర్డు కొట్టిపడేసింది. ఈ ఆరోపణల్లో నిజం లేదని ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని ఢిల్లీ జల్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి హితవుపలికారు. ఈ అంశాన్ని ఎల్జీదృష్టికి తీసుకెళ్లాలని చీఫ్ సెక్రటరీని కోరారు.

# లోక్‌సభలో మెజారిటీ లేకున్నా బిజెపికే అధికారం..

## అందుకు కాంగ్రెస్ పార్టీనే కారణం! : మమతా బెనర్జీ



**కోల్‌కతా, జనవరి 29:** గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి అధికారం రావడానికి కాంగ్రెస్సే కారణమంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన సందర్భంగా బంగ్లార్ నిర్బచోన్ ఒ అమ్రా పేరుతో తాను రాసిన మూడు పుస్తకాలను ఆమె విడుదల చేశారు. ఆ పుస్తకంలో 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై లోతైన విశ్లేషణ చేశారు. అయితే బిజెపి గెలుపుకు కాంగ్రెస్ కారణమని అందులో దీదీ పేర్కొన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ఓటమి లక్ష్యంగా ప్రతిపక్షాన్నీ ఓ కూటమిగా ఏర్పడ్డాయి. అన్ని కార్యక్రమాలను ఉమ్మడిగా ముందుకు తీసుకెళ్లాయి.

కానీ నాయకత్వం కోసం కూటమి లోని అభ్యర్థులు పరస్పరం పోటీకిదిగారు. తృణమూల్ కాంగ్రెస్ శాయశక్తులా కృషి చేసి నప్పటికీ కాంగ్రెస్ వైఫల్యం కారణంగా ఇండియా కూటమికి గెలుపు దక్కకుండా పోయింది. మెజారిటీ రాకపోయినా బిజెపి అధికారం దక్కింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు కూడా మిత్రపక్షాల మద్దతు వల్లే దక్కాయి. ఇండియా కూటమికి ఎక్కువ మద్దతు రావడానికి తృణమూల్ కాంగ్రెస్ కారణం. మా ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా ప్రజా మద్దతు లభించింది. రాష్ట్రంలో సిపిఎం నేతృత్వంలోని వామపక్షాలతో కాంగ్రెస్ సీట్ల పంపకాల ఒప్పందం చేసుకున్నప్పటికీ టిఎంసికి వ్యతిరేకంగా తీవ్రంగా పనిచేసింది. బిజెపితో రహస్య ఒప్పందం చేసుకుంది అని ఆమె ఆరోపించారు.

గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 240 స్థానాలు గెలుచుకుని భారీ విజయం సాధించింది. మూడోసారి అధికారం చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. మరోవైపు, ఇండియా కూటమి కూడా గట్టిపోటీ ఇచ్చింది. అయినప్పటికీ అధికారం సొంతం చేసుకోలేక పోయింది. దీనికి కాంగ్రెస్ అతివిశ్వాసమే కారణమంటూ భాగస్వామ్య పార్టీలన్నీ విమర్శలు చేస్తున్నాయి. తాజాగా టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ తన పుస్తకంలో లోక్‌సభ ఎన్నిలపై లోతుగా విశ్లేషణ చేశారు.

# బెస్ట్ ఫ్రీడమ్ ఫైట్ డాక్యుమెంటరీ చిత్రంగా వీరస్థలి తెనాలి

### -దర్శకుడు రత్నాకర్ వెల్లడి

**తెనాలి, జనవరి 29 (ప్రభాతవార్త) :** వీరస్థలి తెనాలి, ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ అవార్డుకు, అర్హత సాధించినట్లు దర్శకులు రత్నాకర్ కనపర్తి పేర్కొన్నారు. బుధవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం రత్నాకర్ వివరాలు వెల్లడించారు. తెనాలి సమీపంలోని కంచర్లపాలెం గ్రామానికి చెందిన స్వతంత్ర సమరయోధులు చుక్కపల్లి రామయ్య జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన వీరస్థలి తెనాలి చిత్రానికి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ తరపున అవార్డు దక్కడంపై దర్శకుడు రత్నాకర్ చిత్ర యూనిట్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్శిటీలో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. చుక్కపల్లి రామయ్య యదార్ధ జీవిత చరిత్రను ఐదేళ్ళ రీసెర్చ్ చేసి వాస్థవికతను అద్దం పట్టేల మలిచినట్లు రత్నాకర్ వివరించారు. తెనాలి స్వాతంత్ర్య చరిత్రను 1920నాటి గ్రామీణ వాతావరణం నాటి ప్రజా ఉద్యమాలను సంస్కృతి సంప్రదాయాలు గ్రామీణ క్రీడలను అద్భుతంగా చిత్రీకరించిన ఫలితంగా ఉత్తమ ఫ్రీడం ఫైట్ డాక్యుమెంటరీ చిత్రంగా వీరస్థలి తెనాలి ఎంపికైనట్లు పేర్కొన్నారు. జ్ఞానశేఖర్, గల్లా నిర్మాతగా చిత్రాన్ని రూపొందించామని చెప్పారు. తన తదుపరి ప్రాజెక్టు శిశిరం సినిమా త్వరలో పూర్తి చేయనున్నట్లు, వాస్తవానికి దగ్గరగా ఉండే కధాంశమని, ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకముందన్నారు. కార్యక్రమంలో పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, ఐనాలమల్లేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, బడుగు మోహన్‌రావు, దర్శి జీవన్, శ్రీతులసీ, సంజీవరావు, ఎస్ఎన్ జహీర్, పట్నాల సాయి, పి.పున్నయ్య, అంబటి శ్యామ్‌సాగర్, మునిపల్లి శ్రీకాంత్, ప్రకాశరావు, మహేష్, మధు, వి.భూషణం, శేఖర్, రవికిరణ్, కోటేశ్వరరావు, మేకల సుబ్బారావు, సినీ కొరియోగ్రాఫర్ అమ్మ సుధీర్, కిరణ్, హేమంత్, కనపర్తి బెన్‌హర్, చిత్ర నటీనటులు పాల్గొన్నారు.

# శిశువు కడుపులో పిండం..

### మహారాష్ట్రలోని బుల్దానా ఆసుపత్రిలో చోటు చేసుకున్న ఘటన..

**ముంబయి, జనవరి29:** మహారాష్ట్రలో ఓ అరుదైన ఘటన వెలుగు చూసింది. ఓ గర్భిణి కడుపులో పెరుగుతున్న శిశువు కడుపులో పిండం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర బుల్దానా జిల్లాలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో 32 ఏళ్ల గర్భిణి వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఆ పరీక్షల్లో గర్భస్థ శిశువు కడుపులో పిండం ఉన్నట్లు బయటపడింది. దీన్ని ఫీటస్ ఇన్ ఫీటుగా పిలుస్తుంటారని వైద్యులు తెలిపారు. కవలలు ఏర్పడే క్రమంలో అడ్డంకులు కలిగి ఇలాంటివి జరుగుతాయట. ఇలాంటి అరుదైన కేసులు ప్రపంచవ్యాప్తంగా 200 నమోదు కాగా భారత్‌లో 15,20 కేసులు వెలుగచూశాయని అక్కడి డాక్టర్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యంగానే ఉన్నారని ఆమెకు సాధారణ కాన్పు అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. అయితే పుట్టిన వెంటనే ఆ బిడ్డకు ప్రత్యేక సంరక్షణ అవసరమన్నారు.

## విశ్వశాంతిని కోరుతూ అహింసామూర్తి గాంధీజీ మార్గాన్ని అనుసరిద్దాం

### -వజ్రాల రామలింగాచారి

తెనాలి, జనవరి 29 (ప్రభాతవార్త) : విశ్వశాంతి కోసం పూజ్య బాపూజి అహింసా, సేవా మార్గాన్ని అనుసరిద్దామని శ్రీమహాత్మ సేవా శాంతి ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు వజ్రాల రామలింగాచారి పేర్కొన్నారు. ఈనెల 30వ తేదిన దేశ వ్యాప్తంగా నిర్వహించే మహాత్మాగాంధీ ఆత్మార్పణ దినోత్సవాన్ని మహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో ఆరాధనావారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆశ్రమంలో మహాత్మాగాంధీజీకి కస్తూర్బా గాంధీలకు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగాచారి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా నిరాశ్రయ వృద్దులకు ఆశ్రయం కల్పించి గాంధీజీని సేవా మార్గాన్ని శాంతి అహింసల విశిష్టతను ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. గురువారం ఆశ్రమ ప్రాంగణంలో విశేషంగా విశ్వశాంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలలో ఆశ్రమ వృద్దులు పాల్గొన్నారు.

## వర్ధమాన దర్శకులను ప్రశంశించిన ఎమ్మెల్యే అరవిందబాబు

**తెనాలి, జనవరి 29 (ప్రభాతవార్త) :** తెనాలి పట్టణానికి చెందిన దర్శకులు నరేష్ దోనే, మణివర్ధన్‌లు మహాశివరాత్రి సందర్భంగా చిత్రీకరించిన కోటప్పకొండ స్థలపురాణం యదార్ధ గాథ చిత్రం టీజర్‌ను నరసరావుపేట శాసన సభ్యులు డా.చదలవాడ అరవిందబాబు బుధవారం నరసరావుపేటలో విడుదల చేసిన సందర్భంలో దర్శకుల ప్రతిభను ప్రశంశించారు. కాగా కోటప్పకొండ స్థలంపురాణ కథను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు సారధ్యంలో ఓటీటీ సినిమాగా రూపొందించినట్లుగా దర్శకులు నరేష్ దోనే, మణివర్ధన్ తెలియజేశారు. ఎమ్మెల్యే అరవిందబాబు టీజర్‌ను చూసిన అనంతరం దర్శకులను ప్రశంశిస్తూ సత్కరించడం పట్ల మా ఎపి సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



## సీసీ రోడ్ల నిర్మాణనికి రూ.2.25 కోట్లు మంజూరు

### రూపురేఖలు మారనున్న రహదారులు

**కారంపూడి, జనవరి 29 ప్రభాతవార్త:** గత వైకాపాల పాలనలో సిమెంటు రహదారులు అంగుళం కూడా వేయలేదు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు పాడైపోవడంతో వాటిపై రాకపోకలు సాగించడానికి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధిపై దృష్టి సారించిది. అందులో భాగంగా లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. పేటసన్నెగండ్ల గ్రామంలో సీసీ రోడ్డు పూర్తి కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా నడవడానికి ఇబ్బంది ఉన్న రహదారిర రూపురేఖలు మార్చారని గ్రామస్థులు ఆనందంగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం సిమెంటు రహదారుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఇంకేముంది గ్రామాల్లో రోడ్ల రూపురేఖలు మారిపోతున్నాయి. మండలంలో మూడు నాలుగు నెలల్లోనే 17 రహదారులు నిర్మాణాలు పూర్తయ్యాయి. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లి, మిర్యాల గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఏఈ సత్యం మాట్లాడుతూ కారంపూడి మండలంలోని 15 గ్రామాల్లో 20 రోడ్లకు రూ.2.25 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే దాదాపు 90 శాతం పూర్తి చేశాము. మిగిలిన నిర్మాణాలు ఫిబ్రవరి 10 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.



## 300 మందికి అన్నదానం

కారంపూడి, జనవరి 29 ప్రభాతవార్త: కారంపూడి పట్టణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద వాసవీ సేవా అన్న ప్రసాద కమిటీ పర్యవేక్షణలో బుధవారం 300 మందికి అన్నదానం చేశారు. సూరే వెంకట రామాంజనేయులు జ్ఞాపకార్థం వారి వారసులు సూరే జ్యోతి, ఈశ్వర్‌కుమార్, మౌనిక, తమన కేదార్, ప్రత్యూషలు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కళాసిల్క్స్ సూరే బాబు, కమిటీ కన్వీనరు భవిరిశెట్టి రామారావు, పొట్టుమూర్తి నాగబాబు, భవిరిశెట్టి గురవయ్య, వెచ్చ రాము, చిన్ని లక్ష్మీ, సీతామహాలక్ష్మి, పల్లా పద్మ, కందుకూరి దేవి, అనంతలక్ష్మి, శారద, ధనలక్ష్మి, మహేశ్వరి, రమాదేవి, హైమావతి, సుశీల, రేణుక తదితరులు పాల్గొన్నారు.

30-1Pg6exHMNWJQE.qxd:30-1Pg6exHMNWJQE.qxd 01/01/01 9:46 AM Page 1



# పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి

## - కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్

**విజయవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ దక్కిన అరుదైన గౌరవం దక్కిందిజ న్యూఢిల్లీలో జరుగుతున్న అఖిల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రుల సమావేశంలో కేంద్ర మంత్రివర్యులతో పాటుగా వేదికను పంచుకునే అవకాశం దక్కడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేసార వేదిక పైన అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మిక సంస్కరణలలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో ముందంజలో ఉందన్నారు. విజనరీ లీడర్ అయినటువంటి నారా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో కార్మిక సంస్కరణలు 2015 నుండే అమలు చేశారని వాటినే ఇప్పుడు కేంద్రము చాలావరకు అమలు చేస్తుంది అని చెప్పారుఆంధ్రప్రదేశ్ రాష్ట్రము పెట్టుబడుల ఆకర్షణతో పారిశ్రామికీకరణలో ముందంజలో ఉండడంతో పాటు కార్మికుల సంక్షేమం పట్ల కూడా ఎంతో శ్రద్ధ వహిస్తుందని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా 4000 నుండి 15000 వరకు పెన్షన్లను అందిస్తున్నారని, ఇది దేశంలోనే అత్యధికమని, ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 25 లక్షల వరకు బీమా అందిస్తున్నారని ఇది కూడా దేశంలోనే అత్యధికమని, గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి పేదల ప్రజల పట్ల కార్మికుల పట్ల ఉండే నిబద్ధతకు ఇది నిదర్శనం అని కేంద్రమంత్రి కొనియాడారు. ప్రస్తుతం కేంద్రం అమలు చేయాలనుకుంటున్న చాలావరకు కార్మిక సంస్కరణలు 2015 లోనే చంద్రబాబు నాయుడు గారు అమలు చేయడం ఆయన విజనరీ నాయకత్వానికి నిదర్శనమని కేంద్ర మంత్రి కొనియాడారు అని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు స్వర్ణాంధ్ర సాధన 2047 లక్ష్యంగా ఒక విజన్ తో పనిచేస్తున్నారన్నారు.. వికసిత్ భారత్ లో స్వర్ణాంధ్రను భాగ్యస్వామ్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులు, రాష్ట్రంలో అమలవుతున్న వివిధ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా, అభివృద్ధే తారక మంత్రంగా ఒక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారన్నారు.సీఎం చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఏటువంటి చర్యలు తీసుకుంటే ఈ రాష్ట్రంలో రాబోయే కాలంలో కార్మికుల భవిష్యత్తుకు పునాదులు వేసే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఏ రాష్ట్రానికి లేని విధంగా మన ముఖ్యమంత్రి గారి ఆలోచనతో ఎన్నో విషయాలను పొందుపరిచి రాబోయే తరానికి ఒక దిక్సూచిగా ఉండే విధంగా ప్రణాళికలు తయారు చేయడం జరిగిందని , రాష్ట్రంలో పరిశ్రమ ప్రోత్సాహకాల విషయంలోను, ఉద్యోగ అవకాశాల విషయంలోను ప్రణాళిక బద్ధంగా సాగుతున్నాం. పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూటమిగా పని చేస్తున్నామని మంత్రి తెలిపారు.


హత్య కేసులో పట్టుబడ్డ అక్కాతమ్ముడు

# వృద్ధురాలి హత్య కేసులో అక్కా, తమ్ముడు అరెస్టు

## - రూ.12 లక్షలు విలువైన బంగారం స్వాధీనం

**బంగారుపాళ్యం, జనవరి 29 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం సమీపంలోని ఆర్ఆర్ నగర్ నందు ఈ నెల 19వ తేదీన ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి వారి నుండి 12 లక్షల రూపాయలు విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు డిఎస్పీ ప్రభాకర్ బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడిస్తూ ఆర్ఆర్ నగర్ నందు జిఆర్ సునందమ్మ(71) హత్యకు గురైందన్నారు. సునందమ్మ, వసంతమ్మలు ఒకే కాంప్లెక్స్‌లో వేరు వేరుగా అద్దె ఇళ్ళల్లో వుంటున్నారు. సునందమ్మ కుమారుడు హైదరాబాదులో ఒకరు వుండగా మరో కుమారుడు సంతోష్‌కుమార్ ఆర్ఆర్ నగర్‌లోనే మరో అద్దె ఇంట్లో నివాసం వుంటున్నాడు. సునందమ్మ ఒక్కటే అద్దె ఇంట్లో వుండి జీవనం సాగిస్తుండేది. ప్రక్కఇంట్లో వున్న వసంతమ్మ కుటుంబసభ్యులతో కలిసి మెలసి వుండేది. ఈ నేపథ్యంలో వసంతమ్మ కుమార్తె దుర్గ పలమనేరు రూరల్ మండలం కన్నమాకులపల్లిలో వివాహం చేసుకుంది. దుర్గకు చెందిన బంగారు నగలను దుర్గ తమ్ముడు లీలా మనోహర్ బ్యాంకులో తాకట్టు పెట్టి 8 లక్షలు రుణం తీసుకున్నాడు. ఈ బంగారు నగల విషయమై దుర్గను అత్తింటి వారు ప్రశ్నించడంతో ఆర్ఆర్ నగర్‌లోని తల్లి ఇంటికి దుర్గ చేరుకుంది. బెంగళూరులో వుంటున్న తమ్ముడు లీలా మనోహర్ ఇంటికి రావడంతో తాకట్టు పెట్టిన బంగారు నగల విషయంపై అక్క తమ్ములు ఇద్దరు చర్చించుకున్నారు. అదే సమయంలో ప్రక్క ఇంట్లో వున్న సునందమ్మ ఒంటరిగా వుందని ఆమె వద్ద బంగారు నగలు వున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 19న ఒంటరిగా వున్న సునందమ్మ ఇంట్లోకి లీలా మనోహర్, దుర్గలు ప్రవేశించి సునందమ్మ ముక్కు, గొంతును దుర్గ పట్టుకోగా కాళ్ళను లీలా మనోహర్ అదిమిపెట్టి హత్య చేశారు. అనంతరం సునందమ్మ ఒంటిపై వున్న రెండు బంగారు గాజులు, ఒక చైను, బీరువాలో వున్న రెండు నక్లెస్‌లను దోచుకుని వెళ్ళారు. సునందమ్మ మృతి చెందిన విషయం సమీపంలో వున్న కుమారుడు సంతోష్‌కుమార్‌కు తెలియగా తల్లి మృతిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి సునందమ్మ నివాసం వున్న ఇంటి పరిసర ప్రాంతంలో సిసి కెమెరాలు, వేలిముద్రలు, టవర్ లోకేషన్‌లు పరిశీలించారు. ఈ పరిశీలనలో ప్రక్క ఇంటిలో వున్న దుర్గ, లీలామనోహర్‌లపై అనుమానం రావడంతో విచారణ చేపట్టారు. చేసిన నేరంను అంగీకరించి తాము దొంగలించిన బంగారు నగలను ముత్తూట్ ఫైనాన్స్, ఇండియన్ బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు వారు విచారణలో తెలిపారు. ఈ మేరకు తాకట్టులో వున్న బంగారంను విడిపించి ముద్దాయిలను పాలేరు ఫ్లైఓవర్ బ్రిడ్జివద్ద బుధవారం సాయంత్రం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు డిఎస్పీ వెల్లడించారు. ఈ హత్య కేసును చేధించిన సిఐ, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ మణికంఠ చందోలు అభినందించినట్లు డిఎస్పీ తెలిపారు.

# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

## - తులసిబాబును మూడు రోజులు విచారించిన పోలీసులు

## - ఆ ఒక్కప్రశ్నకు మాత్రమే సమాధానం చెప్పిన తులసిబాబు

**ఒంగోలు, ప్రభాతవార్త** అప్పటి ఎంపీ, ఇప్పటి ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరిస్తున్న రఘురామకృష్ణమరాజుపై 2021లో జరిగిన హత్యాయత్నంకేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న తులసిబాబు గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. వైసీపీ సానుభూతి పరుడిగా కృష్ణాజిల్లాలో హడావుడి చేసే అతని ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న అతణ్ణి రఘురామకృష్ణమరాజు కేసులో విచారిస్తున్నారు. విచారణలో తులసిబాబు తీరుతో పోలీసులు ప్రస్టేషన్‌కు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్ని ప్రశ్నలు అడిగిన దేనికి సమాధానం చెప్పని అతని తీరు చర్చగా మారింది. బాపట్ల జిల్లాకు చెందిన తులసిబాబు కృష్ణా జిల్లాలో అందులో గుడివాడ రాజకీయాలతో అతడికి ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన నేతలతో తిరిగే అలవాటు ఉన్నతులసిబాబు తీరును ఆరా తీస్తున్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం విచారణ కొనసాగింది. వైద్య పరీక్షలు అనంతరం ఆయనను పోలీసులు గుంటూరు తరలించారు. మూడు రోజుల పాటు తులసిబాబును సుమారు వంద ప్రశ్నలు అడిగారు. ఆయన నుంచి పలు వివరాలు రాబట్టారు. 2021 మే 14నాటి ఎంపీ రఘురామకృష్ణమరాజుపై హత్యాయత్నం కేసులో తులసిబాబు నిందితుడు. రిమాండ్‌లో ఉన్న అతడిని సోమవారం ఉదయం 11గంటలకే కస్టడిలోకి తీసుకున్నారు. హైబీపీ కారణంగా తులసిబాబు ఆ రోజు సాయంత్రం 5.30గంటల వరకు గుంటూరు జీజీహెచ్‌లోనే ఉండటంతో రాత్రి ఒంగోలు తీసుకువచ్చి గంటన్నర పాటు విచారించారు. మంగళవారం ఉదయం 8.56గంటలకే ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్ నుంచి ఎస్పీ కార్యాలయానికి తీసుకొని వెళ్లారు. రోజంతా దర్యాప్తు చేసినట్లు సమాచారం. న్యాయవాది సమక్షంలో సాక్షాలు చూపుతూ ప్రశ్నించడంతో జావాబు చెప్పడానికి తులసిబాబు తడబడినట్లు తెలిసింది. బాపట్ల జిల్లా వాసివి నీకు కృష్ణా జిల్లా గుడివాడ రాజకీయాలకు సంబంధం ఏమిటి..? ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ ప్రజాప్రతినిధులతో అంటకాగుతున్నావు. ప్రభుత్వ కార్యాలయాల్లో తిరుగుతావు. ఏమి లాభం చేకూరుతుంది.

# తై అమావాస్య భక్తులకు పండగ

**శ్రీకాళహస్తి,జనవరి 29 ప్రభాతవార్త** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం తై అమావాస్య సందర్భంగా భక్తులతో కిట కిట లాడింది. స్థానిక భక్తులే కాక పొరుగున ఉన్న తమిళనాడు,కర్నాటక రాష్ట్రాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. షోడషా భిషేకాల సందర్భంగా ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి సంకల్పంతో పూజలు,అభిషేకాలకు శ్రీకారం చుట్టరు.ఈ కార్యక్రమాల్లో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కుటుంబసభ్యులు బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితారెడ్డి,బిజెపి నాయకుడు కొలా ఆనంద్‌కుటుంబసభ్యులు, వేలాది మంది భక్తులు విశేషంగా మహిళా భక్తులుహాజరయ్యారు. దాంతో ఆలయంలో ఉదయం రాహుకాల సమయంలో భక్తుల తాకిడి అధికమైంది. సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో 'తై అమావాస్య'కు ఎంతో ప్రాధాన్యత ఉంది. మహాశివరాత్రికి ముందు వచ్చే ఈ ఉత్సవాన్ని ఆలయంలో ఘనంగా నిర్వహించటం ఆనవాయితి. శివుని కోసం తపస్సు చేసుకుంటూ స్నానమాచరించటానికి భరద్వాజ మహాముని కొలనను నిర్మించుకున్నారు. ఇక్కడకు ఏడాదిలో ఒకరోజు తై అమావాస్య సందర్భంగా మాత్రమే స్వామి అమ్మవార్ల ఇక్కడకు వస్తారు. భక్తుల పూజలందుకుంటారు.దర్శనమిస్తారు.

# అటవీ భూముల ఆక్రమణ..అభూత కల్పనే

## - చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే నిరాధార ఆరోపణలు

## - మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**తిరుపతిరూరల్, జనవరి 29 ప్రభాతవార్త:** అటవీ భూములు ఆక్రమించారనే ఆరోఫణలు పూర్తిగా అవాస్తవమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తమ రాజకీయ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలనే దురుద్దేశ్యంతోనే అసత్యపు కథనాలు ప్రచురిస్తున్నారని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. లేనిది ఉన్నట్లుగా క్రియేట్ చేసి అభూత కల్పనతో ప్రజలను పక్కదారి పట్టించడంలో చంద్రబాబు దిట్ట అనే విషయం అందరికి తెల్సిందే అన్నారు. బుధవారం తిరుపతి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడారు. 2001లో ప్రవేట్ వ్యక్తుల నుండి 75 ఎకరాలు భూమిని తమ కుటుంబ సభ్యుల పేరిట కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. 1981లోనే ఆ భూమి అటవీ భూమి కాదని 1981లో డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్స్ నిర్ధారించినట్లు తెలిపారు. కేంద్ర అటవీశాఖ అనుమతితోనే తారురోడ్డు నిర్మాణం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటినుంచి తమ రాజకీయ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా నిరాధార ఆరోఫణ చేస్తూ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. మదనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఫైల్స్‌ను పెద్దిరెడ్డి దగ్ధం చేసారంటూ ఆరోఫణలు చేసారు...ఘటన జరిగి 9 నెలలు అయిన ఒక ఆధారాన్ని చూపలేకపోయారని, రూ.40కోట్ల రుపాయాలు ఇసుక దందా చేసారని, నేపాల్‌కు ఎర్రచందనం రవాణా చేసారని ఆరోఫలు చేసారని ఏ ఒక్కదానికైన ఆధారం ఉందా అని ప్రశ్నించారు. చట్టవిరుద్ధంగా ఒక ఎకరం భూమి అయిన కబ్జా చేసినట్టు నిరూపించగలరా అని పెద్దిరెడ్డి ప్రశ్నించారు. పులిచర్ల ప్రాంతంలో 75 ఎకరాలు అటవీ భూమిని ఆక్రమించారనే, అటవీశాఖ అధికారులకు తెలియకుండానే రోడ్డు వేసారని వచ్చిన కథనం మాజీ మంత్రి మండిపడ్డారు. 1981లోనే ఇవి ప్రవేట్ భూములని నిర్ధారించినట్లు తెలిపారు. కుట్రలు కుతంత్రాలకు పెట్టింది పేరు చంద్రబాబు అని, తప్పుడు వార్తలు వ్రాయించడం ఆయనకే సాధ్యం అన్నారు.



# జగన్ క్వాష్ పిటిషన్ కేసు వాయిదా

**విజచవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** తనపై నమోదైన పరువునష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ వైకాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ఏపీ హైకోర్టులో వేసారు.ఈ ఫిర్యాదు పై విచారణను ఏపీ హైకోర్టు వాయిదా వేసింది. జగన్ పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని మంత్రి నారాయణ తరపు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోర్టును కోరారు. జగన్ తరపు న్యాయవాది, మాజీ అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ తన వాదనలు వినిపిస్తూ వరుసగా విచారణకు సమయం అడుగుతున్నారని... పిటిషన్ పై రెగ్యులర్ విచారణ జరపాలని కోరారు. ఈ క్రమంలో తదుపరి విచారణను మూడు వారాల పాటు హైకోర్టు వాయిదా వేసింది. పరువునష్టం కేసు వివరాల్లోకి వెళితే... అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్ మెంట్ మార్పుల వెనుక అప్పటి మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ పాత్ర ఉందంటూ ఒక పత్రికలో కథానాలు వచ్చాయి. సదరు పత్రిక కథనాలతో తన పరువుకు భంగం వాటిల్లిందని విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టులో నారాయణ దావా వేశారు. దీనిపై ఆ కోర్టులో విచారణ జరిగింది. విచారణకు హాజరు కావాలంటూ జగన్ కు కోర్టు పలుమార్లు సమన్లు జారీ చేసింది. అయితే ఆయన కోర్టుకు హాజరు కాలేదు. ఆ తర్వాత కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

# పోలీసులకు బాస్‌లు ఎస్పీలా..అధికార పార్టీ నాయకులా..

## - లా అండ్ ఆర్డర్ కాపాడేందుకు మీ కార్యాలయం ఎదుట కూర్చుంటాం

## - వైఎస్సార్సీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, జనవరి 29 ప్రభాతవార్త బ్యూరో** జిల్లాలోని పోలీసులకు బాస్ ఎస్పీ, డిఐజిలా అధికార పార్టీ నేతలా అని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. జిల్లాలో తాము చెప్పిందే వేదం, మేము ఏమి చెబితే అదే శాసనం అనేలా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నా వారిని పోలీసులు కంట్రోల్ చేయలేకపోతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పోలీసు యంత్రాంగం పూర్తిగా నిర్వీర్యం అయిందని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు నిస్సహాయ స్థితికి చేరాయని, ఎస్‌పి, డిఐజిలు చేతకాని వారిలా ఏమి చేయలేని పరిస్థితికి వెళ్లారని ఆరోపించారు. కూటమి ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు లాండ్ ఆర్డర్ పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. పోలీసులకు బాస్‌లు ఎస్‌పి, డిఐజిల అధికార పార్టీ ప్రజా ప్రతినిధులా అని ప్రశ్నించారు. వైసీపీ శ్రేణులపై దాడులు చేస్తే తమకు అన్యాయం జరిగిందని, పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే కేసులు కూడా రిజిస్టర్ కావడం లేదని, ఒకవేళ చేసిన టిడిపి నాయకులను పోలీసులు పిలిపించుకుని కౌంటర్ కేసులు నమోదు చేసి బాధితులపైనే నాన్ బెయిలబుల్ కేసులు, టిడిపి వారిపై బెయిలబుల్‌కేసులు పెడుతున్నారని విమర్శించారు. డిఎస్‌పి, సిఐ స్థాయి వ్యక్తులే కొద్ది రోజులు ఊరు విడిచి వెళ్లాలని వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు చెప్పే పరిస్థితి తొలిసారిగా చూస్తున్నామన్నారు. పోలీసు స్టేషన్‌లోనే కొట్టడం, మీడియాలో కథనాలు వస్తే రైలు పట్టాలపై పడుకోబెడతామని బహిరంగంగా వ్యాఖ్యానించడం, మాజీ ఎమ్మెల్యేను కూడా నియజకవర్గాలకు వెళ్లలేని పరిస్థితి ఉంటున్నా, పోలీసులు చేతకాని వారిలా కళ్లు, చెరువులు మూసుకుంటున్నారని విమర్శించారు. పోలీసులు ప్రజా స్వామ్య యుతంగా వ్యవహరించకుంటే తాము మీ కార్యాలయాల వద్దకు వచ్చి మీ బాధ్యతలను గుర్తు చేస్తామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంపై మాకు నమ్మకం ఉందని మళ్లీ అధికారంలోకి వస్తే అందరిలా అది చేస్తాం, ఇది చేస్తామని చెప్పమని, ప్రజల హక్కులను కాపాడేందుకు ఎందాకైనా వెళ్తామని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా గత ఎన్నికల సమయంలో ఫీజు రీయెంబర్స్, అమ్మఒడి పెంచు తామని ప్రకటనలు చేసి చెల్లించకపోవడం పరిస్థితి ఏర్పడిందన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

# విఆర్‌ఓల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలం

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్త :** విఆర్‌ఓల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ఏపి విఆర్ఓ సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు లు తెలిపారు. బుధవారం వీఆర్ఓ రాష్ట్ర సంఘం డైరీని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయనకు విఆర్‌ఓల సమస్యలు విన్నవించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు రాటకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

# గుమ్మనూరు జయరాంపై టిడిపి అధిష్టాన వర్గం సీరియస్

## - ఇది మన పార్టీ పద్ధతి కాదని హెచ్చరిక భగ్గుమన్న జర్నలిస్ట్ సంఘాలు

**అనంతపురం, జనవరి 29, ప్రభాతవార్త బ్యూరో** మాజీ మంత్రి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పై తెలుగుదేశం పార్టీ అధిష్టాన వర్గం సీరియస్ అయింది. పాత్రికేయుని బెదిరించడం మన పార్టీ సాంస్కృతి కాదని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యేని హెచ్చరించింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు ఎమ్మెల్యేకి ఫోన్ చేసి చివాట్లు పెట్టినట్లు సమాచారం.. అనంతపురం జిల్లా గుంతకల్లు టిడిపి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మంగళవారం రోజు విలేకరులపై నోరు పారేసుకున్నారు.. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గుంతకల్లు విలేకరులతో ఏమన్నాడంటే నేను అన్ని చేసి వచ్చినొన్ని.. రాసుకోండి ..ఏం రాసుకుంటారో. తప్పు చేస్తే రాయండి.. ఆధారాలు లేకుండా రాస్తే తాటతీస్తా అని బహిరంగ హెచ్చరించారు.. ఎలక్ట్రానిక్ మీడియా ,పత్రిక ప్రతినిధులకు గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బహిరంగంగా వార్నింగ్ ఇవ్వడం మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

# మంగళగిరిలో 10.80 ఎకరాల్లో మెగా హ్యాండ్లూమ్ పార్క్

## - స్థలాన్ని పరిశీలించిన మంత్రి సవిత

**విజయవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** మంగళగిరిలోని ఆటో నగర్ ను ఆనుకుని మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేత కార్మికులకు 365 రోజులు భృతి కల్పించే లక్ష్యంలో భాగంగా ఆ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బుధవారం మంగళగిరిలోని ఆటోనగర్ కు ఆనుకుని ఉన్న 10.80 ఎకరాలను చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గడిచిన అయిదేళ్ల చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందకపోవడంతో పాటు ఉత్పత్తి అయిన వస్త్రాలు విక్రయించే మార్కెట్ సదుపాయం లభించకపోవడంతో, ఎందరో నేతన్నలు అప్పుల పాలయ్యారన్నారు. కొందరు చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని విచారం వ్యక్తంచేశారు.

టీడీపీ పాలనలో చేనేతలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న సమయం చేనేతకు స్వర్ణయుగమన్నారు. 2014 19లో చేనేతల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నూలు కొనుగోలుకు రాయితీ అందజేశారని, ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించారని మంత్రి గుర్తు చేశారు.

# అటవీ సంపదను దోచుకున్న పెద్దిరెడ్డిని ప్రజలు సహించరు

## రవాణా, యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి, జనవరి 29: ప్రభాతవార్త** గతంలో మంత్రిగా పనిచేస్తూ ప్రభుత్వ భూములు, అడవి భూములు ఆక్రమించుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరిగి ఆ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... గతంలో అటవీ శాఖ మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేల ఎకరాల పేద ప్రజల భూములు, అటవీ భూములు అటవీ సంపదను దోచుకోవడం జరిగిందని ఇవన్నీ తిరిగి ప్రభుత్వానికి అప్పగించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన కుమారుడు గతంలో చేసిన అక్రమాలు అన్యాయాలు వెలకట్టలేనివని ఇప్పుడు వాటిని బయటకు తీసే సమయం వచ్చిందన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తంబళ్లపల్లె మదనపల్లె నియోజకవర్గం మరియు పుంగనూరు తిరుపతిలో ఎక్కడ చూసినా వేలాది ఎకరాల భూమిని దొంగ రికార్డులు సృష్టించి కబ్జా చేయడం జరిగిందన్నారు. పెద్దిరెడ్డి భార్య పేరు మీద మదనపల్లెలో ఐదు ఎకరాల చెరువును కబ్జా చేసి ఆమె పేరు మీద ఎక్కించడం జరిగిందన్నారు. ప్రపంచానికే తలమానికమైనదన్నారు.

# పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై విచారణకు కమిటీ ఏర్పాటు

**విజయవాడ జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల ఆక్రమణలపై విచారణకు ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు జాయింట్ కమిటీని ఏర్పాటు చేసింది.ఈ కమిటీలో చిత్తూరు కలెక్టర్ సుమిత్, ఎస్పీ మణికంఠ ,చందోలు, ఐఎఫ్ఎస్ అధికారి యశోదాబాయ్‌ను సభ్యులుగా నియమించింది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కమిటీని ఆదేశించింది. కమిటీ నివేదిక అనంతరం ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

# రాష్ట్రానికి గత 7నెలల్లో రూ.6.33లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చాం : మంత్రి పార్ధసారధి

**సచివలాయం,జనవరి 29,ప్రభాతవార్త :** గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేయగా సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మరలా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు పెద్దఎత్తున కృషి చేయడం జరుగుతోందనిరాష్ట్ర సమాచార పౌరసంబంధాల గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్ధసారధి వెల్లడించారు.బుధవారం రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిని శరవేగంగా ముందుకు తీసుకెళ్ళేందుకు గత 7నెలల్లో రాష్ట్రానికి రూ.6.33లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ఎంఓయులు కుదుర్చుకోవడం జరిగిందని తద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని తెలిపారు.ముఖ్యంగా విశాఖలో టిసిఎస్,ఎన్టీపిసి,అరి ్సలర్ మిట్టల్,హెచ్‌పిసి,రిలయన్స్ వంటి కంపెనీలు భారీ ఎత్తున పెట్టుబడులుపెట్టనున్నాయన్నారు.ఒకవ్యక్తి మూర్ఖత్వ పాలనతో ఏరాష్ట్రమైనా దేశమైనా ఏవిధంగా నష్టపోతుందనేందుకు గత ప్రభుత్వ పాలనే నిదర్శనమన్నారు.రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అధోగతి పాలు చేసి సుమారు 10లక్షల కోట్లు అప్పుల ఊబిలోకి నెట్టేశారని మంత్రి పార్ధసారధి అన్నారు.గతప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కు సంబంధించి రూ.2800కోట్లు,అంగన్‌వాడీ ల్లో చిన్నపల్లలకు అందించే చిక్కీలు,గుడ్లుకు సంబంధించి రూ.1700కోట్లు,ఉద్యోగులకు సంబంధించి రూ.20వేల కోట్లు బకాయిలు చెల్లించలేదని వివరించారు.సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం మరోపెద్ద హామీ అయినా దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేయడం జరుగుతోందని దాని వల్ల 90లక్షల మందికి లబ్ధిచేకూరుతోందని మంత్రి తెలిపారు.గడిచిన 7నెలల్లో 7ఏళ్ళ అభివృద్ధిని చేసి చూపించిన దార్శనికుడు చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు.రూ.1000ల పెన్షన్ పెంచడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్ళు పట్టింది కానీ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే రూ.3వేలు ఉన్నా సామాజిక పెన్షన్‌ను రూ.4వేలు చేశారన్నారు.ఇచ్చిన హామీ మేరకే ప్రతి నెల ఒకటో తేదిన ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ వస్తుందన్నారు.

# డా.బిఆర్ అంబేద్కర్‌ను ఓడించి నేడు కపట నాటకాలా?

## - కాంగ్రెస్ నేతల తీరుపై లంక దినకర్ విమర్శలు

**అనంతపురం సిటీ, జనవరి 29 ప్రభాతవార్త** రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్‌ను గతంలో ఓడించిన కాంగ్రెస్ నేడు అంబేద్కర్ పట్ల కపట నాటకాలను ఆడుతోందని 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్ పేర్కొన్నారు. జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్‌ను ఎన్నోసార్లు ఘోరంగా అవమానించిన కాంగ్రెస్ పార్టీ నేడు అంబేద్కర్ పట్ల కపట ప్రేమ చూపిస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎన్నికల్లో నిలబడితే అవమానించి ఓటమి పాలు చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు రాజ్యాంగ పుస్తకాన్ని చేతుల్లో పెట్టుకొని అపద్దాలు మాట్లాడుతున్న తీరు ప్రజలంతా చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ కుయుక్తులను బిజెపి కార్యకర్తల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందించేలా చూడాల్సిన బాధ్యత బిజెపిదన్నారు.

# పారదర్శకమైన సేవలందించాలి: మంత్రి నాదెండ్ల మనోహర్


సివిల్‌సప్లై కమీషనర్ సౌరబ్‌గౌర్‌ను అభినందిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

**అమరావతి, జనవరి 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పౌరసరఫరాల వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించడం, నాణ్యమైన సేవలను ప్రజలకు చేరువ చేయడం ద్వారా మెరుగైన సేవలందించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. నూతనంగా సివిల్‌సప్లయ్ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిర సౌరబ్‌గౌర్ బుదవారం మంత్రిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆయనకు సూచించారు.

30-1P□g7exHMNWJQE.qxd:30-1P□g7exHMNWJQE.qxd 01/01/01 9:46 AM Page 1



# ప్రభుత్వానికి వ్యవసాయం అత్యంత ప్రాధాన్యం

## వ్యవసాయ రంగానికి రూ.50 వేలకోట్ల ఖర్చు: అగ్రివర్సిటీ విద్యార్థులతో ఇష్టాగోష్టిలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



బుధవారం ఇష్టాగోష్టి కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**అత్తాపూర్ జనవరి29,ప్రభాతవార్త:** ప్రభుత్వానికి వ్యవసాయం అత్యంత ప్రాధాన్యతాంశమని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, వడ్లకు బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి ఎన్నో పథకాలని అమలు చేస్తున్నామని వివరించారు. ఏడాదికి వ్యవసాయ రంగానికి సుమారు 50వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని తెలిపారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించి విద్యార్థులతో ఇష్టాగోష్టి కార్యక్రమంలో ప్రసం గించారు. తన సొంత జిల్లాలో ఉన్న ఈ విశ్వవిద్యాలయం అంటే తనకెంతో అభిమా నమన్నారు. అలాగే తన జిల్లా పరిధిలోని తాండూర్ కందికి భౌగోళిక గుర్తింపు లభించి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించడం సంతోషదాయకం అని స్పీకర్ అన్నారు. ఈ గుర్తింపు వెనక పిజెటీఏయూ కృషి ఎంతో ఉందన్నారు. సమర్థుడు, మేధావి అయిన ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య నేతృత్వంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆకాంక్షి ంచారు. విశ్వవిద్యాలయం భూ ములు మరియు ఆస్తుల పరిర క్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అందుకు తాను పూర్తిగా సహ కరిస్తానన్నారు. విశ్వవిద్యాలయానికి సంబంధించి నిధులు, నియామకాలు, బోధన బోధనేతర సమస్యల గురించి స్థానిక శాసనసభ్యుడు ప్రకాష్ గౌడ్, ఉపకుల పతిని తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిస్తామని హామీ ఇచ్చారు. విశ్వవిద్యాలయ సమగ్ర అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. రైతుల కళ్ళల్లో కొత్త వెలుగులు తీసుకురా వడానికి కృషి చేస్తామని ఆల్దాస్ జానయ్య వివరించారు. స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యం కుదుర్చుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాల యానికి నిధులు పెంచాలని, నియామకాలు చేప ట్టాలని, కొత్త వసతి గృహాలు నిర్మించాలని విద్యార్థులు కోరారు. అలాగే పరిశోధనలకి నిధులు అత్యధికంగా కేటాయించాలని, ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయాలని, హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్ నిధులు మంజూరు చేయాలని బోధన, బోధ నేతర సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వవి ద్యాలయం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్త విస్తరణ పద్ధతులను అభివృద్ధి చేయాలి

## ఐకార్-క్రిడా ఆధ్వర్యంలో వర్షాధార వ్యవసాయంపై అంతర్జాతీయ సదస్సు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి29:** వర్షాధార రైతులను ఆదుకోవడానికి, వ్యవసాయ ఆదాయాన్ని పెంచడానికి విధాన మద్దతు ఎంతో అవసరం ఉందని ఐకార్-క్రీడా ఆధ్వర్యంలో వర్షాధార వ్యవసాయంపై జరిగిన అంతర్జాతీయ సదస్సు అభిప్రా యపడింది. కొత్త విస్తరణ పద్ధతులను అభివృది చేయడానికి కృషి చేయాల్సి ఉందని పేర్కొంది. వర్షాధార వ్యవసాయంపై స్థితిస్థాపకత, స్థిరమైన జీవనోపాధి కోసం మార్గాలను నిర్మించడం అనే అంశంపై ప్రధానంగా చర్చించారు. బుధవారం హైదరాబాద్ లోని క్రిడా(సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డ్రైలాండ్ అగ్రికల్చర్) పరిశోధనా కేంద్రంలో ఈ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన 750మందికి పైగా ప్రతినిధులు, రైతులు, స్వచ్ఛంద సంస్థ అధికారులు, వివిధ వ్యవసాయ ఇన్‌పుట్‌లతో వ్యవహరించే ప్రైవేట్ రంగ అధికారులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐకార్ డైరెక్టర్ జనరల్ హిమాంశు పాటక్ సదస్సు కార్యక్రమాలను వివరించారు. ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎఐసిఆర్‌పిడిఏ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ జెవిఎన్ఎస్ ప్రసాద్, ఐఎస్‌డిఏ ప్రతినిధులు,



బుధవారం జరిగిన సదస్సులో అవార్డులను ప్రదానం చేస్తున్న దృశ్యం

విశిష్ట ప్రముఖులందరికీ స్వాగతం పలికారు. క్రీడా డైరెక్టర్ డాక్టర్ జురీ సింగ్ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థకు వర్షాధార వ్యవసాయం ప్రాముఖ్యత గురించి సభకు తెలియజేసారు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.కె. చౌదరి మాట్లాడుతూ వర్షాధార వ్యవసాయంలో ఎదురవుతున్న వివిధ ఒత్తిళ్లు, సమస్యలను అధిగమించడంలో రైతు సమాజానికి సహాయపడే సాంకేతికతలు, సిఫార్సులు మరియు విధాన క్లుప్తాలను తీసుకురావాలని ప్రతినిధులను కోరారు. ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డ్రైల్యాండ్స్ వ్యవసాయంపై క్రీడా చేస్తున్న అందిస్తున్న సహకారాన్ని ప్రస్తావించారు. ఐకార్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు మాట్లాడుతూ వర్షాధార వ్యవసాయం ఉత్పాదకతను పెంపొం దించడానికి స్థితిస్థాపకతను తీసుకు వచ్చినందుకు పరిశోధకులను అభినం దించారు. ఈ సదస్సు విస్తారిత సారాంశాలు సమావేశానికి సంబంధించిన ఇతర ప్రచురణల సంగ్రహాన్ని ప్రముఖులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డ్రైలాండ్ అగ్రికల్చర్‌కు చెందిన ప్రముఖులకు అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఎస్‌డిఏ కోశాధికారి డా.పి.కె.పంకజ్ ధన్యవాదాలతో కార్యక్రమం ముగిసింది. ప్రారంభోత్సవం అనంతరం ఎగ్జిబిషన్ స్టాల్‌ను ప్రారంభించారు.

# మతత్వశక్తులను ఓడించడానికి లౌకికశక్తులు కలిసిపోరాడాలి

## సిపిఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీకి మహేష్‌కుమార్‌గౌడ్ అభినందనలు

**హైదరాబాద్,జనవరి 29 ప్రభాతవార్త:** దేశంలో, రాష్ట్రంలో మతతత్వ శక్తులను అవినీతి పరులను నియంతలను ఓడించేందుకు లౌకికభావ సిద్ధాంతాలలో కలిసి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ కొత్తగా ఎన్నికైనా రాష్ట్రసిపిఎం కార్యదర్శిని కోరారు. నూతంగా ఎన్నికైన కార్యదర్శికి జాన్‌వెస్లీకి మహేష్‌కుమార్‌గౌడ్ అభినందనలు తెలిపారు. బుధవారం ఫోన్‌చేసి తాను నమ్మిన సిద్ధాతంను నిబద్ధతతో ఆచరిస్తూ ప్రజలను పోరాటాలకు సమీకరించడంలో అద్వితీయమైన పాత్రను పోషిస్తువచ్చారని అదేవిధంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలను సమీకరించడానికి మీ కార్యదర్శి పదవి తోడ్పాటు ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఎంలో సామన్య కార్యకర్తగా అంచెలంచెలుగా ఎదిగిన వెస్లి ప్రజలను పోరాట్లో సమీకరిస్తూ ఇంకా ఉన్నత నాయకుడిగా ఎదుగాలని అభినందిస్తూ టిపిసిసి చీఫ్ హర్షం తెలిపారు.

# కుంభమేళా బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

## తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్,జనవరి 29,ప్రభాతవార్త:** కుంభమేళా తొక్కిసలాటలో చనిపోయిన బాధిత కుటుంబాలకు కేంద్రప్రభుత్వం, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం బాసటగా నిలువాలని అన్ని విధాలుగా వారిని ఆదుకోవాలని తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ డిమాండ్‌చేశారు. కుంభమేళా తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన సంఘటనపై మహేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

మౌని అమావాస్య కావడంతో దేశవ్యా ప్తంగా భక్తులు కోట్లమంది తరలివచ్చారని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల భద్రత చర్యలు చేపట్టాల్సి ఉండాల్సిందని అన్నారు.

# బిజెపిది గాడ్సేఆలోచన..కాంగ్రెస్‌ది మహాత్మాగాంధీ విధానం

## రేవంత్ ప్రజాయజ్ఞంకు అడ్డుపడుతున్న బిజెపి, బిఆర్ఎస్‌లు: నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి

**హైదరాబాద్,జనవరి 29,ప్రభాతవార్త:** బిజెపిది గాడ్సే ఆలోచన కాంగ్రెస్‌ది మహాత్మాగాంధీ ఆలోచన విధానం రాహుల్‌గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం చేస్తుండని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేయడానికి సిఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు భుజాన వేసుకోవాలని ఆయన కోరారు. బిజెపి, మోడీ ప్రభుత్వం అంబెద్కర్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని విమర్శించారు. అమిత్‌షా రాజ్యసభలో అంబెద్కర్‌ను అవమానించాడని అన్నారు. అమిత్‌షాను లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పమన్నాడు కానీ చెప్పలేదు. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నాడని అన్నారు. రేవంత్‌రెడ్డిని సవ్యసాచి అని అందరు పిలుస్తున్నారని రాజకీయాలు చేస్తూనే ఆయన అభివృద్ధి సంక్షేమం తెలంగాణలో పరిగెత్తి





స్తున్నారని అన్నారు. దేశనేతగా జాతీయనేతగా ఎదుగుతున్నాడని పేరును అనతికాలంలోనే తెచ్చుకున్నాడని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికోట్లు రూపాయలు ఇచ్చిందో చర్చకు కెటిఆర్ సిద్దమా అని ప్రశ్నించారు. హరీష్‌రావు, కెటిఆర్ బిఆర్ఎస్ పార్టీ క్యాడర్‌కోసం మాట్లాడితే కాంగ్రెస్ ప్రజల కోసం మాట్లాడుతోందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పేద రైతులను ఆదుకొంటున్నదని పదేళ్ళలో భూమి లేనివారిని మీరు ఆదుకోలేదని ఆయన అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల కోసం యజ్ఞం చేస్తూంటే బిజెపి, బిఆర్ఎస్ నాయకులు చెడగొడుతున్నారని ఆవేదన చెందారు. తెలంగాణలో ఫెడరల్ వ్యవ స్థకు వ్యతిరేకంగా బిజెపి నాయకులు మాట్లా డుతున్నారని ఆరోపించారు. మేం ఇందిరమ్మ ఇళ్ళు కేవలం కాంగ్రెస్‌పార్టీకి మాత్రమే ఇవ్వడం లేదని అన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన గద్దర్‌కు అవార్డు ఇవ్వాలని కోరారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రధానం చేయడం స్వాగతిస్తున్నామని అన్నారు. హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చి దావోస్‌లో లక్షా త78వేల కోట్లు పెట్టుబడులు ముఖ్యమంత్రి తీసుకొచ్చారని చెప్పారు.

# ఉపాధ్యాయ వృత్తిలో లేని వారిని గెలిపించొద్దు

## టిఎస్ యుటిఎఫ్, టిపిటిఎఫ్

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫిబ్రవరి 27న జరగనున్న నల్గొండ, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థులు అలుగుబెల్లి నర్సిరెడ్డి, వై అశోక్ కుమార్ లను గెలిపించాలని టిఎస్ యుటిఎఫ్, టిపిటిఎఫ్ సంఘాలు ఉపాధ్యాయ లోకానికి విజ్ఞప్తి చేశాయి. రెండు సంఘాల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులతో కలిసి సంఘాల నాయకులు బుధవారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో టిఎస్ యుటిఎఫ్, టిపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, సిహెచ్ అనిల్ కుమార్, ఎ వెంకట్, ఎన్ తిరుపతి, ఎమ్మెల్సీ అలు గుబెల్లి నర్సిరెడ్డి, కరీంనగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఫిబ్రవరి 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్‌కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి టిపిటిఎఫ్ మాజీ అధ్యక్షుడు వై అశోక్ కుమార్‌ను గెలిపించాలని టిఎస్ యుటిఎఫ్, టిపిటిఎఫ్ రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చాయి. రెండు సంఘాల తరపున పోటీ చేస్తున్న నాయకులు మూడు దశాబ్దాలకుపైగా ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేసి, నిబద్ధతతో వ్యవహరించారని తెలిపారు. 2019 మార్చిలో నల్గొండ నియో జకవర్గం నుండి ఎన్నికైన నర్సిరెడ్డి గత 6 సంవత్సరాలుగా ఆదర్శవంతమైన పనితీరు కనబరిచారని తెలిపారు. వై అశోక్ కుమార్ టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్‌పిసి) స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని చెప్పారు. తెలంగాణ ఉద్యమం సమయంలో టిజెఎసి నాయకునిగా ప్రొఫెసర్ కోదండరామ్‌తో కలిసి పనిచేశారని గుర్తు చేశారు.

# విద్యతోనే వికాసం: మంత్రి సీతక్క

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** జీవితంలో అన్నిటికంటే ఉత్తమమైనది విద్య అని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం లకిడికాపూల్‌లోని ఫిక్కి కార్యాలయంలో విద్యాదన్ స్వచ్ఛంద సంస్థ స్కాలర్‌షిప్‌ల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యతోనే వికాసం సాధ్యపడుతుందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం తెచ్చి 6-14 సంవత్సరాల మధ్య పిల్లలకు నిర్బంధ విద్యను ప్రవేశపెట్టిందని, విద్యను ఎవరు దోచుకోలేరు, విద్య పంచుకుంటేనే విజ్ఞానం పెరు గుతుందన్నారు. ఆ ఉద్దేశంతో విద్యదన్ ఫౌం డేషన్ పనిచేయడం అభినందనీయం అన్నారు. మీ ప్రయత్నాలకు మా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. విద్య ద్వారానే నా లైఫ్ ఈ స్థాయికి వచ్చిందన్నారు. నేను టెన్త్ క్లాస్ వరకు చదువుకున్నానని, తర్వాత పదేళ్లపాటు అజ్ఞాత జీవితం గడిపానన్నారు. బయటకొచ్చిన తర్వాత తిరిగి విద్యార్థిగా చదువును కొనసాగిం చానని అన్నారు.





బుధవారంవిద్యాదన్ స్వచ్ఛంద సంస్థ స్కాలర్‌షిప్‌ల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క

చదువుకోవాలి అన్న పట్టుదలతో ఎల్.ఎల్.బి, ఎంఎ, పిహెచ్‌డి పూర్తి చేశానని, ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్నా విద్యను ఆపలేదన్నారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఎంఏ కోర్సును జాయిన్ అవ్వాలనుకుంటున్నానని అన్నారు. అన్ని దానాల్లోకెల్లా విద్యా దానం గొప్పది, జ్ఞానాన్ని లక్షల మందికి పెంచడం ద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేసిన వాళ్లమ వుతామన్నారు. విద్య, అభివృద్ధిలో నేటికీ అంత రాలు కొనసాగుతున్నాయన్నారు. మానవ విలువలను, సంబంధాలను పటిష్టం చేసే విద్యను ప్రోత్సహించాలన్నారు. పేదలకు విద్య అందించే విద్యాధన్ ఫౌండేషనుకు మా ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

# సంజయ్ నువ్వు కార్పొరేటర్ కాదు..కేంద్రమంత్రివి

## జిఎస్‌టి నిధులు రాబట్టడంలో పదేళ్లలో బిఆర్ఎస్ విఫలం: ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త:** బిజెపి నాయకుడు బండి సంజయ్‌కుమార్ కార్పొరేటర్ కాదని కేంద్రమంత్రి అని గుర్తు పెట్టుకోవాలని భువగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ పద్మ అవార్డుల విషయంలో బండి సంజయ్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని విమర్శించారు. పద్మశ్రీ అవార్డుల విషయం పార్లమెంట్‌లో జిరో అవర్‌లో లేవనెత్తుతామని అన్నారు. తెలంగాణ ప్రజలు ఎనిమిది మంది బిజెపి ఎంపిలను గెలిపించారు విభజన హామిల గురించి మాట్లాడాలని ఆయన డిమాండ్ ఇచ్చారు. కేంద్రం బీహార్, ఏపికి ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వట్లేదు అందుకే బడ్జెట్‌లో మొండి చేయిచూపిస్తున్నారని అని అన్నారు. కిషన్‌రెడ్డి దావోస్ పర్యటనను, కంపెనీలపై నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రం కోసం సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్ళారో కెటిఆర్‌ను అడిగితే వ్యంగనయంగా చెప్పాడు. ఆదిలాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోడీని రాష్ట్రానికి పెద్దన్నలాగా ఉండమన్నారు హైదరాబాద్ త్రిపుల్ ఆర్ రోడ్డుకోసం కేంద్రమంత్రి గడ్కారిని సిఎం రేవంత్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్ లైఫ్‌లైన్‌కు 45వేల కోట్లు అవసరం అని తెలిపారు. నల్లగొండ జిల్లా రైతులు ఎవ్వరు కూడా కెటిఆర్ ధర్నానుపట్టించుకోలేదని ఆయన వివరించారు. మూసి ప్రాజెక్టుకోసం తెలంగాణ ఎంపిలు కలిసికట్టుగా పార్లమెంట్‌లో కొట్లాడాలని ఆయన కోరారు. మహారాష్ట్రకంటే మనరాష్ట్రం కేంద్రానికి ఎక్కువ జిఎస్‌టి కడుతోందని పదేళ్ళలో రావాల్సిన నిధులు రప్పించడంలో బిఆర్ఎస్ విఫలమైందని ఆయన అన్నారు. హరీష్‌రావు ముందు కెసిఆర్ ప్రజలకు దర్శనం ఇవ్వమని చెప్పు అని ఆయన కోరారు

# అభివృద్ధి, సంక్షేమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలి: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి29:** రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కోసం, తద్వారా లబ్ధిపొందడం కోసం విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల ఎంప్లాయిస్ అసోసియేషన్ రూపొందించిన 2025 సంవత్సర నూతన క్యాలెండరును మంత్రి హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరణ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్, డి.యస్. జగన్, డిప్యూటీ డైరెక్టర్ మధు సూదన్, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

# వేసవిలో నీటి సమస్యలు లేకుండా చర్యలు

## ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్: మంత్రి సీతక్క

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో మిషన్ భగీరథపై మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు. మిషన్ భగీరథ పంపులను, నల్లా పైపులను తనిఖీ చేయాలన్నారు. ఏదైనా సమస్యతో మిషన్ భగీరథ సరఫరాలో సమస్యలు తలెత్తినా ఇతర పద్ధతిలో నీరు సరఫరా చేసేలా ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. వచ్చే ఐదు నెలల కోసం మిషన్ భగీరథ సిబ్బంది ప్రణాళిక రూపొందించుకోవాలని, వేసవి ముగిసే వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రతి మనిషికి 100 లీటర్ల నీటిని ప్రతిరోజు అందించాల్సిందే అన్నారు. గ్రామ స్థాయిలో మండల స్థాయిలో కమిటీ వేసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవడంతోపాటు, మిషన్ భగీరథ నీళ్లపై నమ్మకం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథపై వేల కోట్లు ఖర్చు చేసినా, ప్రజలు ఎందుకు ఆ నీటిని పూర్తిస్థాయిలో వినియోగించడం లేదో అధ్యయనం చేయాలన్నారు. ఎంతమంది మిషన్ భగీరథ నీరు తాగునీటి కోసం వినియోగించడం లేదో సర్వేలు చేపట్టాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంత మేర మిషన్‌భగీరథ తాగునీరు సరఫరా చేస్తున్నాము? ఎన్నిగృహాలకు నీరు అందటంలేదు వంటి వివరాలను ఎమ్మెల్యేలకు అందజేయాలన్నారు.

ఈసందర్భంగా తెలంగాణ గ్రామీణ తాగు నీటి సరఫరా ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని మంత్రిఆవిష్కరించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 2004 నుంచి 2014 వరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై విచారణ జరగాలి

## సిఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** ఇళ్లులేని బీదలకు ఇళ్లను నిర్మించి ఇచ్చే ఉద్దేశంతో సర్కారు తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం బాగానే వున్నా ఇందులో అ వినీతికి తావులేకుండా చూడాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కోరింది. ఉమ్మడి ఎపి హయాంలో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండగా ఇదే రీతిన నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భారీగా అక్రమాలు జరిగాయని దీనిపై వెంటనే విచారణ చేసి వాస్తవాలను నిగ్గు తేల్చాలని సంస్థ కార్యదర్శి పద్మనాభ రెడ్డి సిఎం రేవంత్ రెడ్డికి బుధవారం లేఖ రాశారు. 2004 నుంచి 2014 మధ్యన 33.4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అప్పటి సర్కారు మంజూరు చేసిందని ఇందులో 20.49 లక్షల ఇళ్లు పూర్తి అయినట్లు ప్రభుత్వం చెప్పిందని ఆయన తెలిపారు. కానీ ఇందులో సగం వరకు ఇళ్లు నిర్మాణ దశలోనే ఆగిపోగా, మరికొన్నింటి పనులు మొదలు పెట్టలేదని, ఇంకొన్ని నిర్మాణం కాకుండానే జరిగినట్లు చూపారని, మరికొన్ని ప్రాంతాలలో ఇదివరకే నిర్మాణం అయిన ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లుగా చూపారని ఇలా జరగడానికి కొందరు స్థానిక నాయకులు, అధికారులు కారణమని పద్మనాభ రెడ్డి తెలిపా రు. కాగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక తెలంగాణలో 2004 నుంచి 2014 వరకు జరిగిన ఇం దిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సిఐడి విచారణకు ఆదేశించారని ఆయన తెలిపారు. సిఐడి విచారణలో అనేక విషయాలు వెలుగు చూశాయని, వీటిలో ముఖ్యమైనది లక్షల సంఖ్యలో పూర్తి కాని ఇళ్లతో పాటు అక్రమాలు వున్నాయని ఆయన వెల్లడించారు. ఇక తెలంగాణలో కొత్త సర్కారు పూర్తికాని ఇందిర మ్మ ఇళ్లను పక్కనపెట్టి కొత్తగా డబుల్ బెడ్‌రూంల నిర్మాణం చేబట్టిందని ఆయన తెలిపారు. ఇక ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ణంలో అక్రమాలపై సిఐడి విచారణ సవ్యంగా సాగలేదని, రాష్ట్రంలో 12 వేల గ్రామాలు వుండగా కేవలం 36 గ్రామాలను సందర్శించిన అధికారులు తూతూ మంత్రంగా విచారణను పూర్తి చేశారని ఆయన విమర్శి ంచారు. దీనివల్ల అవినీతి అధికారులు చెలరేగి పోతున్నారని ఆయన తెలిపారు.

ఇక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేబట్టిందని, ఇది నిజమైన లబ్ధిదారులకు చేరాలంటే అధికార యంత్రాంగం కచ్చితంగా పనిచేయాలని ఆయన కోరారు. 2004 నుంచి 2014 వరకు జరిగిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జరిగిన వేల కోట్ల రూపాయల అవినీతిపై విచారణ చేబట్టి దోషులను శిక్షించాలని, దీనివల్ల ప్రస్తుతం జరిగే ఇళ్ల నిర్మాణం సవ్యంగా సాగే వీలుందని ఆయన తెలిపారు.

# చార్మినార్ జోన్‌లో 163 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఎఎస్ఐలుగా పదోన్నతులు

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు విభాగంలోని చార్మినార్ జోన్‌లో సుదీర్ఘ సర్వీసు కలిగిన 163 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతులు కల్పిస్తూ మల్టీ జోన్ 2 ఐజిపి వి.సత్యనారాయణ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారు ఇప్పుడు పనిచేసే పోలీసు స్టేషన్లలోనే పనిచేయాల్సి వుంటుంది.

# ప్రాక్టికల్ పరీక్షలకు సెంటర్లను ఇవ్వలేం

## నేడు డిఐఇఓలకు వినతిపత్రాలు

## టిపిజెఎంఎ రాష్ట్ర కార్యవర్గ తీర్మానం

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజెస్ అసోసియేషన్ తమ కాలేజీల్లో ప్రాక్టికల్ పరీక్షలకు, థియరీ పరీక్షలకు సెంటర్లను ఇవ్వలేమని తెగేసి చెప్పాయి. ఇదే విషయాన్ని తెలియజేస్తూ రాష్ట్రం లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారుల(డీఐఈవో)కు వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసింది. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు రాష్ట్రంలో ప్రాక్టికల్ పరీక్షలకు షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన విషయాలను తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజెస్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(టీపీజేఎంఏ) రాష్ట్ర అధ్యక్షులు గౌరీ సతీష్ తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతన్న ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలతో బుధవారం హైదరాబాద్‌లో అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వ హించినట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం విష్ణు వర్ధన్ రెడ్డి, గౌర వాధ్యక్షులు ఏ వరదారెడ్డితోపాటు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరైనట్టు తెలిపారు. సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు తెలిపారు. తమకు 2014 నుంచి ఇప్పటి వరకు పెంచని ట్యూషన్ ఫీజు బకాయిలను ఇప్పించేలా బోర్డు సెక్రటరీ చర్యలు తీసుకో వాలన్నారు. ఇంటర్ బోర్డు ఉన్నతాధి కారులు ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రే విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నందున వీటిపై తగిన నిర్ణయాలు తీసుకొని ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు జూనియర్ కాలేజీలు కొనసాగేలా చూస్తారని ఆశిస్తున్నట్టు గౌరీ సతీష్ తెలిపారు.

# ఎఐ సాయంతో సమగ్ర హెల్త్ ప్రొఫైల్

## ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా రూపకల్పన

## రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** కృత్రిమ మేధ(ఏఐ)ను ఉపయోగించి రాష్ట్రంలోని ప్రతి పౌరుడి హెల్త్ ప్రొఫైల్‌ను సమగ్రంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం జూబ్లిహిల్స్‌లో ఒక హాస్పిటల్ సర్వీసెస్ రూపొందించిన ఎండిఆర్.మై డిజి రికార్డ్ మొబైల్ యాప్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఇటీవలి కాలంలో వ్యాధిగ్రస్తులు ముందుగా ఒక ఆసుపత్రికి వెళ్తున్నారు. అన్ని వైద్య పరీక్షలు చేయించుకుని, చికిత్స తీసుకుంటున్నారన్నారు. నమ్మకం కుదరక మళ్లీ ఇంకో ఆస్పత్రికి వెళ్తున్నారు. అక్కడ కూడా మళ్లీ అన్ని వైద్య పరీక్షలను చేయించుకోవాల్సి వస్తుంది. ఫలితంగా ఆర్థికంగా ఇబ్బంది పడు తున్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ అందుబాటులోకి వస్తే రోగులపై పడే అదనపు భారం తగ్గుతుంది. వేగంగా మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులకు సాయపడుతుంది. భవిష్యత్తులో రాబోయే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడానికి వీలవుతుంది అని అన్నారు. హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాము. ఏఐ లాంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, అన్ని రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా రూపొం దిస్తామని వివరించారు. ఆరోగ్య సమా చారాన్ని కచ్చితత్వంతో అందించేలా ఏఐ ఆధారిత మొబైల్ యాప్‌ను రూపొందించిన యాజమా న్యాన్ని ఆయన అభినందించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్య రంగంలో ఇలాంటి తరహా ఆవిష్కరణలు మరిన్ని రావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో టిపిసిసి అధ్య క్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, మాడ్యూర్ హాస్పి టల్స్ సర్వీసెస్ ఛైర్మన్ మోటూరి ఉన్నారు.





బుధవారం హైదరాబాద్‌లో ఎండిఆర్.మై డిజి రికార్డ్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

30-1pg10exT.qxd:30-1pg10exT.qxd 01/01/01 8:36 AM Page 1





# బ్రేక్ కాని రికార్డులు

## వీటిని అధిగమించడం అసాధ్యం

### అద్భుతాలు చేసిన టీమిండియా స్టార్‌లు

**ఢిల్లీ:** క్రికెట్ చరిత్రలో రికార్డుల జాబితా చాలా పెద్దది. ఎన్నో రికార్డులు నమోదవుతూనే ఉన్నాయి. మరెన్నో బద్దలవుతున్నాయి. అయితే, కొన్ని మాత్రం ఎప్పటికీ బ్రేక్ కాకుండా అలానే ఉండిపోతున్నాయి. ఇది బద్దలు కొట్టడం అసాధ్యం అనిపిస్తోంది. ఇలాంటి వ్యక్తులను క్రికెట్‌లో అద్భుతాలుగా పేర్కొంటుంటారు. ఇలా ఎవరూ అధికమించలేని భారీ రికార్డులు కొట్టిన ప్లేయర్ల జాబితాలో టీమిండియా నుంచి ఐదుగురు ఆటగాళ్లు ఉన్నారు. వారిని గుర్చి తెలుసుకుంటే ఎంఎస్ ధోని కెప్టెన్ కూల్, ఫినిషర్ లేదా ఫాస్టెస్ట్ వికెట్ కీపర్ అని పిలుస్తుంటారు. క్రికెట్‌లో మహి సాధించిన విజయాలను ఎవరైనా లెక్కించవచ్చు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక స్టంపింగ్‌లు చేసిన ఆటగాడిగా ధోనీ రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ కెరీర్‌లో స్టంపింగ్ ద్వారా 195 వికెట్లు పడగొట్టాడు. అలాగే లిటిల్ మాస్టర్‌గా ఫేమస్ అయిన సునీల్ గవాస్కర్ కూడా తన కెరీర్‌లో ఎన్నో రికార్డులు నెలకొల్పాడు. వాటిలో కొన్ని బద్దలు అయ్యాయి. కానీ, ఆ రికార్డును ఇంకా ఎవరూ సరిచేయలేకపోయారు. గవాస్కర్ టెస్టులో 4 ఇన్నింగ్స్‌ల్లోనూ డబుల్ సెంచరీలు సాధించిన ఘనత సాధించాడు. ఇప్పటి వరకు ఈ రికార్డును ఎవరూ పునరావృతం చేయలేకపోయారు. ఇక 60 ఏళ్ల క్రితం తన బౌలింగ్‌తో అద్భుతం చేసిన భారత బౌలర్. 1964లో బ్రిటిష్ వారి ముందు వరుసగా 21 మెయిడిన్ ఓవర్లు బౌలింగ్ చేసి అద్భుత రికార్డు సృష్టించాడు నాదకర్ణి. ఇది ఇప్పటికీ కొనసాగుతోంది. మరో ప్లేయర్ గాడ్ ఆఫ్ క్రికెట్ సచిన్ టెండూల్కర్ 100 సెంచరీల గొప్ప రికార్డు గురించి అందరికీ తెలుసు. వన్డేల్లో సచిన్ సెంచరీల రికార్డును విరాట్ కోహ్లీ బద్దలు కొట్టాడు. అయితే, ఇప్పటి వరకు ఎవరూ 100 సెంచరీల సంఖ్యను అందుకోలేకపోయారు. కాగా ప్రస్తుత టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను హిట్‌మ్యాన్ అని పిలుస్తుంటారు. రోహిత్ వన్డేల్లో ఎన్నో ఫీట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన రికార్డ్ ఒకటి ఉంది. మూడుసార్లు డబుల్ సెంచరీ చేసి రికార్డులు సృష్టించాడు. వన్డే ఇంటర్నేషనల్స్‌లో 264 పరుగులు చేసిన రోహిత్ రికార్డును ఇంకా ఎవరూ చేరుకోలేకపోయారు.

# ఐసిసి టి20 ర్యాంకింగ్స్‌లో.. సత్తా చాటిన టీమిండియా ప్లేయర్లు



**ఢిల్లీ:** ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆటగాళ్లు సత్తా చాటారు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఏకంగా 25 స్థానాలు మెరుగుపర్చుకుని తొలిసారి టాప్5లోకి చేరాడు. ఇంగ్లండ్ సిరీస్లో తొలి మూడు మ్యాచ్‌ల్లో 10 వికెట్లు తీసిన వరుణ్ 679 రేటింగ్ పాయింట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక వెటరన్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ ఈ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకాడు. రషీద్ స్పిన్నర్ అకీల్ హుసేన్‌ను రెండోస్థానానికి దించి అగ్ర పీఠాన్ని అధిరోహించాడు. రషీద్ ఖాతాలో 718 రేటింగ్ పాయింట్లు ఉండగా, అకీల్ ఖాతాలో 707 పాయింట్లు ఉన్నాయి. అలాగే ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ కూడా గణనీయంగా తన ర్యాంక్‌ను మెరుగుపర్చుకున్నాడు. ఆర్చర్ 13 స్థానాలు ఎగబాకి 6వ స్థానానికి చేరాడు. భారత బౌలర్ అక్షర్ పటేల్ కూడా 5 స్థానాలు మెరుగుపర్చుకుని 11వ స్థానానికిచేరాడు. కాగా భారత్ నుంచి టాప్10లో వరుణ్ చక్రవర్తి (5), అర్షదీప్ సింగ్ (9), రవి భిష్ణోయ్ (10) ఉన్నారు. ఇంగ్లండ్ సిరీస్‌లో ఆశించి నంతగా రాణించ లేకపోయిన భిష్ణోయ్ 5 స్థానాలు కోల్పోయి ఐదో స్థానం నుంచి 10వ స్థానానికి పడిపోయాడు. ఇంగ్లండ్ మ్యాచ్ విన్నింగ్ నాక్ ఆడి భారత్‌ను గెలిపించిన తిలక్ ఈ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి ఎగబాకాడు. ఆసీస్ విధ్వంసకర ఆటగాడు ట్రవిస్ హెడ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. భారత్ నుంచి తిలక్‌తో పాటు, సూర్యకుమార్ యాదవ్ (4), యశస్వి జైస్వాల్ (9) టాప్10లో ఉన్నారు. ఇంగ్లండ్ సిరీస్‌లో తొలి మ్యాచ్లో చెలరేగిన అభిషేక్ శర్మ, ఆతర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనప్పటికీ 59 స్థానాలు మెరుగుపర్చుకుని 40వ స్థానానికి చేరాడు. మరో భారత ఓపెనర్ సంజూ శాంసన్ వరుసగా మూడు వైఫల్యాల కారణంగా 12 స్థానాలు కోల్పోయి 29వ స్థానానికి పడిపోయాడు. ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే భారత ఆటగాడు హార్దిక్ పాండ్యా టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు.

## ఆట



# క్రికెట్ చరిత్రలో అసాధారణ రనౌట్

**ఢిల్లీ:** క్రికెట్ చరిత్రలో ఓ విచిత్రమైన రనౌట్ నమోదైంది. సౌతాఫ్రికా అండర్ 19 జట్టుతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు ఆటగాడు ఆర్యన్ సావంత్ అసాధారణ రీతిలో రనౌటయ్యాడు. మ్యాచ్ 3వ రోజు బుధవారం సావంత్ 11 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తూ జేసన్ రౌల్స్ వేసిన బంతిని స్లాగ్‌స్వీప్ చేశాడు. అయితే బంతి షార్ట్ లెగ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న జోరిచ్ వాన్ షాల్క్‌విక్ హెల్మెట్‌ను బలంగా తాకి, స్టంప్స్ పైకి తిరిగి వచ్చింది. ఆ సమయంలో సావంత్ క్రీజ్ బయట ఉన్నాడు. సెకెన్ల వ్యవధిలో జరిగిపోయిన ఈ తంతు చూసి కొందరు దక్షిణాఫ్రికా ఆటగాళ్లు రనౌట్‌కు అప్పీల్ చేయగా, మరి కొందరు బంతి హెల్మెట్‌కు తాకి గాయపడిన జోరిచ్‌ను పరామర్శించే పనిలో పడ్డారు. దక్షిణాఫ్రికా ఫీల్డర్ల అప్పీల్‌తో ఔటయ్యానన్న విషయాన్ని గ్రహించిన సావంత్ మెల్లగా పెవిలియన్ బాట పట్టగా, బంతి బలంగా తాకడంతో జోరిచ్ మైదానంలో అపస్మారక స్థితిలో పడిపోయాడు. గాయపడిన అత డిని హుటాహుటిన అసుపత్రికి తరలించారు. జోరిచ్‌కు ఎలాంటి అపా యం కలగలేదని తదనంతరం దక్షిణాఫ్రికా మేనేజ్మెంట్ వెల్లడించింది. కాగా ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌ను ఇంగ్లండ్ కొనసాగించింది. మూడోరోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 275 పరుగులు చేసింది. ఇంగ్లండ్ ప్రస్తుతం 255 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో థామస్ ర్యూ (71) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అంతకు ముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్సలో 299 పరుగలకు ఆలౌట్ అయింది. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 319 పరుగులు చేసింది.

# సహజ, రష్మిక శుభారంభం

## వైదేహీ, వైష్ణవి, అంకిత, ప్రాంజల నిష్క్రమణ

**ఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ 75 మహిళల టోర్నమెంట్లో భారత్ నంబర్ వన్, యామలపల్లి సహజ, భారత్ మూడో ర్యాంకర్, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేశారు. పూణేలో జరిగిన సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సహజ 6-7 (4/7), 6-1, 6-3తో జపాన్‌కు చెందిన నహోసాటోపైన, శ్రీవల్లి రష్మిక 6-1, 6-2తో అలానా అమెరికాకు చెందిన స్మిత్‌పై గెలిచారు. క్వాలిఫయర్ నహోసాటోతో 2 గంటల 35 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో సహజ తొలి సెట్‌ను ట్రైబ్రేక్‌లో కోల్పోయింది. తొలి సెట్ చేజార్చుకున్నా ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడి పుంజుకుంది. ఆ తర్వాత కేవలం 4గేములు కోల్పోయిరెండు సెట్లు నెగ్గి విజయాన్ని ఖరా రు చేసుకుంది.



అలా నా స్మిత్‌తో 80 నిమి షాల్లో ముగిసిన మ్యా చ్‌లో రష్మిక కేవలం మూడు గేములు మాత్రమే చేజార్చుకుంది. భారత్‌కే చెందిన వైదేహి, వైష్ణవి, అంకిత రైనా తొలి రౌండ్లోనే నిష్క్రమించారు. వైదేహి 3-6, 3-6తో రష్యాకు చెందిన తాతియానా ప్రొజోరోవా చేతిలో, వైష్ణవి 3-6, 4-6తో చైనాకు చెందిన ఫాన్‌గ్రాన్ టియాన్ చేతిలో, అంకిత రైనా 7-6 (8/6), 4-6, 3-6తో రష్యాకు చెందిన ఎలీనా ప్రిదాన్కినా చేతిలో ఓడిపోయారు. ఇకడబుల్స్ తొలి రౌండ్లో రష్మిక-వైదేహి ద్వయం 2-6, 1-6తో రష్యాకు చెందిన మరియా కొజిరెవా-ఇరీనా శ్యామనోవిచ్ జోడీ చేతిలో ఓడిపోయింది. మరో ప్లేయర్ యడ్లపల్లి ప్రాంజలకు నిరాశ ఎదురైంది.క్వాలిఫయింగ్ సింగిల్స్ తొలిరౌండ్‌లో ప్రాంజల4-6, 4-6తో జపాన్‌కు చెందిన నహోసాటో చేతిలో ఓడిపోయింది. డబుల్స్ మెయిన్ డ్రా తొలిరౌండ్‌లో ప్రాంజల-జీల్‌దేశాయ్ 2-6,4-6తో దయానా మర్సినెకెవికా (లాత్వియా)-నహో సాటో (జపాన్) జంట చేతిలో పరాజయం పాలైంది.

## మహిళల అండర్19 వరల్డ్ కప్‌లో..

# శ్రీలంక హ్యాట్రిక్




### అయినా లంకకు సెమీస్ ఆశలు గల్లంతు

**ఢిల్లీ:** ఐసీసీ అండర్19 మహిళల టీ20 వరల్డ్ కప్ 2025 చివరి సూపర్ సిక్స్ మ్యా చ్‌లో శ్రీలంక ఆస్ట్రేలియాకు షాకిచ్చింది. ఈ మెగా టోర్నీలో ఓటమి ఎరుగని ఆసీస్‌కు శ్రీలంక ఓటమి రుచి చూపించింది. మలేసియాలోని బంగి వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక ఆసీస్‌పై 12 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. లంక ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు సంజన కవిండి (19), సుముదు నిసంసల (18), కెప్టెన్ మనుడి ననయక్కార (15), హిరుని హన్సిక (14) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోర్ల కేపరిమితమయ్యారు. ఆసీస్ బౌలర్లలో లిల్లీ బాస్సింగ్‌వైత్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు పడగొట్టింది. హస్రత్స్ గిల్, టెగాన్ విలియమ్సన్ కూడా పొదుపుగా బౌలింగ్ చేసి చెరి 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేదించించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా లంక బౌలర్లు మూకుమ్మడిగా అటాక్ చేయడంతో ఒక్కో పరుగు చేసేందుకు నానా ఇబ్బందులు పడింది. చమోది ప్రబోద, ప్రముది మెత్సర, అసేని తలగుణే తలో 2 వికెట్లు తీయడంతో పాటు, అత్యంత పొదుపుగా బౌలింగ్ చేశారు. లిమాంస తిలకరత్న ఓ వికెట్ పడగొట్టింది. లంక బౌలర్ల ధాటికి ఆస్ట్రేలియా 20 ఓవర్లు బ్యాటింగ్ చేసి కూడా 8 వికెట్ల నష్టానికి 87 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో బే (27) టాప్ స్కోరర్‌గా నిలువగా, మెక్కియోన్ (10), కెప్టెన్ హ్యామిల్టన్ (10), వికెట్ కీపర్ గ్రేస్ లయన్స్ (10) రెండంకెల స్కోర్లు చేశారు. కాగా ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండానే ఆసీస్ ఇదివరకే సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. మరోవైపు శ్రీలంక సైతం ఈ ట ర్నీలో అద్భుతంగా రాణించినప్పటికీ, ఆ జట్టుకు అదృష్టం కలిసిరాలేదు. గ్రూప్ దశలో శ్రీలంక, మలేసియా, వెస్టిండీస్ జట్లపై విజయాలు సాధించినప్పటికీ, భారత్ చేతిలో ఘోరంగా ఓడి సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఆతర్వాత సూపర్6లో తప్పక గెలుస్తుందనుకున్న మ్యాచ్‌కు వరుణుడు అడ్డుతగిలాడు.

# కొత్త బడ్జెట్‌లో టాక్స్ శ్లాబ్‌ల సడలింపులు!

## వాణిజ్యం

**న్యూఢిల్లీ, జనవరి 29:** మోడీ 3.0 ప్రభుత్వం తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌ను మరికొన్ని రోజుల్లో పార్లమెంట్ ముందుకు తీసుకురానుంది. దీనిలో ఏదోరకంగా ఊరట లభిస్తుందని వేతనజీవి ఆశగా ఎదురు చూస్తున్నాడు. సంకీర్ణ ప్రభుత్వం కావడం, కీలక భాగస్వామి జెడియు పాలించే బీహార్‌లో ఎన్నికలు ఈ యేడాదే ఉండడంతో కచ్చితంగా ప్రజాకర్షక నిర్ణయాలు ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కొత్త ఆదాయపు పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ప్రజలను దీనివైపు మళ్లించే యత్నం జరగొచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచే అవకాశాలున్నాయి. కొత్త ఆదాయపు పన్ను విధానాన్ని 2020-21లో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దీనిలో చాలా మార్పులు చేర్పులు చేసి పన్ను చెల్లింపుదారులకు ఆకర్షించేలా చేశారు. 2024 బడ్జెట్‌లో స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచారు. జాతీయ పింఛన్ స్కీమ్ లబ్ధిలను కూడా కల్పించారు. పాత పన్ను విధానంలో మాత్రం ఇది రూ.50వేలు గానే ఉంది. వేతన ఆదాయంపై పన్ను విధించడానికి ముందు స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని తీసేస్తారు. దీంతో పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం తగ్గుతుంది. స్వల్ప మొత్తంతో అధిక ట్యాక్స్ శ్లాబ్‌లో చేరేవారికి ఇది బాగా ఉపయోగ పడుతుంది. 1974లో తొలిసారి ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 16 కింద దీనిని తొలి సారి పరిచయం చేశారు. పన్ను సంక్లిష్టతల ను తగ్గించి సరళతరం చేయడం దీని ఉద్దేశం. ఉద్యోగి ఆఫీసుకు వెళ్లి వచ్చేందుకు అయ్యే రవాణా ఖర్చులు, ఆరోగ్య వైద్య ఖర్చులను వారికి తిరిగి ఇవ్వడం కూడా దీనిలో మరోకోణం. కానీ 2005లో దీనిని పూర్తిగా తొలగించారు. దాదాపు దశబ్దానికి పైగా ఎటువంటి పన్ను లబ్ధి ఇవ్వలేదు. తిరిగి 2018లో రూ.40వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో దీనిని ప్రవేశపెట్టారు. ప్రయాణ ఖర్చులు కింద రూ.19,200, మెడి కల్ రీఎంబర్స్ మెంట్ రూ.15 వేల నుంచి తొలగించారు. ఇక 2019లో తాత్కాలిక బడ్జెట్‌లో రూ.50 వేలకు పెంచారు. 2023లో దీనికి కొత్త పన్ను విధానంలోకి కూడా తీసుకొచ్చారు. ఆ తర్వాత యేడాదే దానిలో రూ.75 వేలకు పెంచారు. పాత విధానంలో మారలేదు.





# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 29:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదేబాటలో పయనించాయి. ఇన్ఫోసిస్, జొమాటో, టిసిఎస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీనికి తోడు ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో పన్ను మినహాయింపు ఉంటుందనే అంచనాలు పెరగడంతో సూచీలు రాణించాయి. కనిష్టాల వద్ద ఇన్వెస్టర్ల కొనుగోళ్లకు దిగడం, ఐటి, ఆటో స్టాక్స్‌లో కొనుగోళ్లతో సూచీలు లాభాల బాటపట్టాయి. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు మార్కెట్ల ర్యాలీకి ప్రధాన కారణమని విశ్లేషకుల అంచనా వేస్తున్నారు. అమెరికా ఫెడ్ రిజర్వ్ సమావేశం నేపథ్యంలో అక్కడి విధానపరమైన నిర్ణయాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు. మార్కెట్లు లాభాల్లో కొనసాగుతున్నప్పటికీ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు విక్రయాల పర్వం కొనసాగుతున్నందున కాస్త అప్రమత్తంగా ఉండాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. చివరికి సెన్సెక్స్ 631 పాయింట్లు పెరిగి 76,532 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 205 పాయింట్లు లాభపడి 23,163 పాయింట్ల వద్ద నిలిచింది. జొమాటో, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, ఎంఅండ్ఎం, బజాజ్ ఫైనాన్స్, కోటాక్ మహీంద్రా బ్యాంకు, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ముగిసాయి. మారుతి సుజుకీ, ఏసియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐటిసి, యాక్సిస్ బ్యాంకు, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.





# అదానీ గ్రీన్ ఒప్పందంపై శ్రీలంక పునఃసమీక్ష

**ముంబై, జనవరి 29:** అదానీ గ్రీన్ ఎనర్జీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని పునఃసమీక్షించే యోచనలో ఉన్నట్లు శ్రీలంక ప్రభుత్వం ప్రకటించింది. 484 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు కోసం కిలోవాట్‌కు 8.2 యుఎస్ సెంట్ల చొప్పున గతంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఈ విద్యుత్ ధరను యూనిట్‌కు 6 సెంట్ల దిగువకు తీసుకురావాలి కొత్త యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక బిడ్డర్లు తక్కువ యూనిట్ ధరలకు ఆఫర్ చేయడం, 20 యేళ్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని అధిక రేటుకు కుదుర్చుకోవాలని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విమర్శలకు దారితీసింది. అధ్యక్షుడు నురా కుమార దిస్సానాయకే నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వారి ప్రస్తుత ప్రాధాన్యతలు, ఇంధన విధానాలకు అనుగుణంగా నిబంధనలను సమీక్షించాలని నిర్ణయించింది. అయితే అదానీ గ్రూప్, శ్రీలంక ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరి ప్రాజెక్ట్‌ను కొనసాగిస్తున్నట్లు ప్రకటన రావాల్సి ఉంది. మే 2024లో ఆమోదించిన టారిఫ్‌ను పునఃసమీక్షించాలని శ్రీలంక కేబినెట్ తీసుకున్న నిర్ణయం ప్రామాణిక సమీక్షా ప్రక్రియలో భాగమని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నియమించిన కమిటీ మొత్తం ప్రాజెక్టును సమీక్షించనుంది. అదానీ





గ్రూప్ శ్రీలంక గ్రీన్ ఎనర్జీ రంగంలో ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. లక్ష్యాలకు అనుగుణంగా ఉండేలా చూడటానికి పునరాలోచనలో ఉన్నట్లు పేర్కొంది. శ్రీలంకలో పునరుత్పాదక ఇంధనం, ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి కంపెనీ సిద్ధంగా ఉందని తెలిపింది.


# పసిడిపై దిగుమతి సుంకాలు పెంచొద్దు!

**న్యూఢిల్లీ, జనవరి 29:** భారతీయులకు పసిడికి మధ్య సంబంధం విడదీయలేనిదని మనందరికీ తెలిసిందే. గత బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశంలోని పసిడి ప్రియుల కోసం పెద్ద ప్రకటన చేశారు. ఆ సమయంలో బంగారంపై ఉన్న దిగుమతి సుంకాన్ని ఏకంగా 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించిన విషయం విదితమే. వాస్తవానికి ఈ తగ్గింపు బంగారానికి డిమాండ్ పెంచేసింది. కొందరు తమ పెట్టుబడి అవసరాల కోసం బిస్కెట్లు, బార్లను కొనుగోలు చేస్తుండగా, చాలా మంది శుభకార్యాలు, ఇతర అవసరాల కోసం ఆభరణాల రూపంలో గోల్డ్ కూడబెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో భారీగా దిగుమతులు పెరగడంతో మళ్లీ సుంకాలు పెంచుతారనే భయాలు తిరిగి మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలను కనిపెడుతూ ఉండే వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ రాబోయే బడ్జెట్‌లో బంగారంపై దిగుమతి సుంకాన్ని పెంచవద్దని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దిగుమతులపై పన్ను పెంపు ప్రతికూల ప్రభావాన్ని చూపి గోల్డ్ పరిశ్రమతో పాటు ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుందని హెచ్చరించింది. వాస్తవానికి గత బడ్జెట్ సమయంలో దిగుమతులపై పన్నును భారీగా తగ్గించడం సానుకూల ప్రభావాన్నే చూపించిందని డబ్ల్యూజిసి ప్రాంతీయ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సచిన్ జైన్ పేర్కొన్నారు. వాస్తవానికి భారత జిడిపిలో బంగారు ఆభరణాల పరిశ్రమ 1.3 శాతం వాటాను కలిగి ఉంది. దేశంలో ఈ పరిశ్రమ దాదాపు 20-30 లక్షల మందికి ఉపాధి అవకాశాన్ని కల్పిస్తోంది. జులైలో పన్ను తగ్గింపులు అధికారికంగా దిగుమతి చేసుకునే బంగారాన్ని భారీగానే పెంచింది. ఇది పరిశ్రమలో పారదర్శకతను పెంచుతుందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది. ఇది భారతదేశ ఆర్థిక వృద్ధి, శ్రేయస్సుకు గణనీయంగా దోహదపడుతుందని జైన్ పేర్కొన్నారు.



# ఐదేళ్లలో రూ.1.73 లక్షల కోట్ల ఫ్రాడ్ క్లెయిమ్‌లు

**న్యూఢిల్లీ, జనవరి 29:** మోసపూరిత క్లెయిమ్‌ల వల్ల బీమా పరిశ్రమకు యేటా కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతుంది. ఈ సమస్యను నిత్యం ప్రత్యేక యంత్రాంగాల ద్వారా పర్యవేక్షిస్తున్నా, ఫ్రాడ్ క్లెయిమ్‌ల సంఖ్య పెరుగుతూనే ఉంది. గత ఐదేళ్లలో మొత్తం బీమా పరిశ్రమలో సుమారు 3.01 లక్షల మోసపూరిత కేసులను గుర్తించారు. వీటి విలువ






రూ.1.73 లక్షల కోట్లని తేలింది. భారతీయ జనరల్ ఇన్సూరెన్స్ పరిశ్రమ ఈ మోసాల వల్ల యేటా సుమారు రూ.30వేల కోట్లు నష్టపోతున్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. బీమా సంస్థలు భారీ లాభాలను ఆర్జిస్తున్నాయని కొందరి అభిప్రాయం. ఇవి కేవలం లాభాల కోసమే ఉన్నాయని చాలా మంది అనుకుంటున్నారు. అయితే బీమా కంపెనీలకు లాభాలు వచ్చినా భవిష్యత్తులో క్లెయిమ్‌లకు భారీగానే చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు జనరల్ ఇన్సూరెన్స్ పరిశ్రమ సగటు క్లెయిమ్ నిష్పత్తి 80శాతం కంటే ఎక్కువ. కంపెనీల రాబడితో లెక్కిస్తే క్లెయిమ్ నిష్పత్తి 115శాతం వద్ద ఉంది. అంటే ప్రీమియంల ద్వారా సమకూరిన ప్రతి రూ.100కు పరిశ్రమ రూ.115 చెల్లిస్తుంది. సరళంగా చెప్పాలంటే బీమా సంస్థలు క్లెయిమ్ చెల్లింపులు, నిర్వహణ ఖర్చులపై డబ్బును కోల్పోతున్నాయి. ప్రత్యక్షంగా 10 లక్షల మందికి, పరోక్షంగా 50 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న బీమా పరిశ్రమ జీవనోపాధికి తోడ్పడుతోంది. ఈ పరిశ్రమలో లాభాపేక్ష లేదని చెప్పలేం. కానీ అదే సమయంలో కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. బ్రోకర్లు, టిపిఎలు, ఇన్సూరెన్స్ రంగంలోని నిపుణులు ఈ పరిశ్రమ విలువను పెంచుతూ ఆర్థిక, ఉపాధి వృద్ధికి మూలస్తంభంగా నిలుస్తున్నారు.

# 11% ప్రీమియంతో డెంటా వాటర్ లిస్టింగ్

**ముంబై, జనవరి 29:** ఐటిసి హోటళ్ల వ్యాపారమైన ఐటిసి హోటల్స్ లిమిటెడ్ షేర్లు బుధవారం స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో లిస్ట్అయ్యాయి. బిఎస్ఇలో రూ.188 వద్ద, ఎన్ఎస్ఇలో రూ.180 వద్ద అరంగేట్రం చేశాయి. వేర్వేరు వ్యాపార కార్యకలాపాల్లో నిమగ్నమైన ఐటిసి



లిమిటెడ్, ఆతిథ్య వ్యాపారాన్ని విడదీసి, 'ఐటిసి హోటల్స్' పేరుతో పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా నిర్వహిం చాలని గతేడాదిలోనే ప్రకటించింది. ప్రతీ 10 ఐటిసి షేర్లకు ఒక ఐటిసి హోటల్స్ షేర్‌ను కేటాయించింది. బుధ వారం ఆ షేర్లు స్టాక్‌మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. కొత్త సంస్థలో ఐటిసికి సుమారు 40శాతం వాటా ఉంటుందని, మిగతా 60శాతం వాటా కంపెనీ వాటాదార్ల వద్ద ఉంటుంది. వాటర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్ కంపెనీ డెంటా వాటర్ షేర్లు బుధవారం స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. సబ్‌స్క్రిప్షన్‌లో మంచి ఆదరణ సొంతం చేసుకున్న ఈ కంపెనీ షేర్లు స్వలనప లాభంతో దలాల్ స్ట్రీల్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర రూ.294తోపోలిస్తే రూ.10.54శాతం ప్రీమియంతో ఎన్ఎస్ఇ లో రూ.325 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. ఇక బిఎస్ఇలో 12.24శాతం ప్రీమియంతో రూ.330 వద్ద లిస్టయ్యాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps